www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 16 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ మాఘ బహుళ పాడ్యమి

06-12 ఫిబ్రవరి 2023

వెల : ₹15/-



'పద్మ'భారతీయం



సెక్యులరిజం ముసుగు కింది చరిత్రకు సాంత్వన 'ఆవరణ'






## వాసి తగ్గించుకున్న బీబీసీ

మోదీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని శక్తులు బురదచల్లే యత్నాలకు దిగుతున్నాయి

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక





# మొగల్ గార్డెన్స్ కాదు, అమృత్ ఉద్యాన్

రైసినా హిల్స్ పరిసరాలలో ఉండే రాష్ట్రపతి భవన్‌కు ప్రత్యేక ఆకర్షణ మొగల్ గార్డెన్స్. ఈ భవంతిని 1927 ప్రాంతంలో ఆంగ్లేయులే నిర్మించినా దీని చుట్టూ పెంచిన ఉద్యానవనానికి మొగల్ గార్డెన్స్ అని నామకరణం చేయడమే విచిత్రం. ఇప్పుడు ద్రౌపది ముర్ము ఈ గార్డెన్ పేరును అమృత్ ఉద్యాన్‌గా మార్చారు. ఏటా అనుమతించినట్టే ఈ సంవత్సరం కూడా జనవరి 30 నుంచి పౌరుల సందర్శనకు అవకాశం ఇచ్చారు.

చరిత్ర వక్రీకరణ అన్న మాట కాంగ్రెస్ నేతల నోటి నుంచి యథాప్రకారం వెంటనే జాలువారింది. మన తెలుగు సినిమాలో డైలాగ్ ఎలా తెలిసిందో గానీ, రషీద్ అల్వీ అనే కాంగ్రెస్ అధికార ప్రతినిధి పేజీలు చింపేస్తే చరిత్ర చెరిగిపోదు అంటూ ఆక్రోశించాడు. మీరు వేరే ఉద్యానవనం పెంచుకుని కావలసిన పేరేదో పెట్టుకోవాలి కానీ ఇదేమిటి? అంటూ ఆక్రోశించాడు. ఇలా రోడ్ల పేర్లు, ఉద్యానవనాల పేర్లు మార్చేస్తే దానితోనే అభివృద్ధి జరిగిపోదు అంటూ దేవరహస్యం కూడా చెప్పాడు. మళ్లీ పాచిపాటే పాడాడు అల్వీ. స్వరాజ్య సమరం వేళ బీజేపీ బ్రిటిష్ వైపు నిలబడింది కాబట్టి గణతంత్ర వేడుకలు నిర్వహించే హక్కు ఈ పార్టీకి లేదని కూడా తేల్చారు. పాపం, జనసంఘ్ 1951లో ఏర్పడిందనీ, అదే తరువాత బీజేపీ అయిందని తెలియని దద్దమ్మలు ఇప్పటికీ చాలామంది ఉన్నారన్నమాట. ఈ మాట అన్న తరువాత స్పృహ వచ్చింది కాబోలు, స్వరాజ్య సమరంలో గురు గోల్వాల్కర్ ఏం చేశారు? హెడ్గేవార్ ఏం చేశారంటూ ప్రశ్నలు సంధించారు అల్వీ. వీళ్లంతా ఇంకా పాకిస్తాన్ తీర్మానం ఆమోదించిన 1940 సంవత్సరం దగ్గరే ఉండిపోయారు పాపం.



**ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు.. చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.**




రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

## పాఠకులకు విజ్ఞప్తి!

75 ఏళ్ల జాగృతి జాతీయభావ జైత్రయాత్రలో మీరందిస్తున్న సహకారం మాకెంతో అమూల్యమైనది. పత్రిక విస్తరణలోనూ మీ పాత్ర మరువలేనిది.

75 ఏళ్ల ఈ ప్రయాణంలో ఎన్ని ఒడిదుడుకులు, కష్టాలు ఎదురైనా ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా, హిందూ సంస్కృతీ, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ జాతీయభావాలే పరమావధిగా నిత్యనూతనంగా మిమ్మల్ని వారం వారం పలకరిస్తోంది, జాగృతి.

ఈ ఏడాది వజ్రోత్సవాల సందర్భంగా జాగృతిని మరింత మందికి చేరువ చేయాలని భావించి అనేక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాం. అందులో భాగంగా తెలంగాణలో ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా మెంబర్‌షిప్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో మీ సహకారమే మాకు కీలకం.

మీ అమూల్యమైన సమయాన్ని జాగృతి కోసం కొంత కేటాయించి, మీ మిత్రులు, బంధువులు, తెలిసిన వారందరికీ జాగృతిని పరిచయం చేసి, వారిని చందాదారులుగా చేర్పిస్తారని,ఈ మహాయజ్ఞంలో పాలుపంచుకుంటారని ఆశిస్తూ...

సర్క్యులేషన్ మేనేజర్
సెల్: 9959997013

**జాగృతి చందాను ఆన్‌లైన్‌లో పంపుటకు కిందనున్న క్యు.ఆర్. కోడ్‌లను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి.. లేదా లింక్ ద్వారా చందా చెల్లించండి!**

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- ✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- ✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- ✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- ✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- ✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- ✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- ✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- ✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- ✦ చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : సిహెచ్. కుమార్

అధికారదాహం, పదవీ రాజకీయాలు భారతీయ సమాజాన్ని ఎంత పతనావస్థకు తీసుకుపోగలవో రోజుకో ఉదాహరణతో, ప్రాంతానికో రుజువుతో అనునిత్యం బయటపడుతున్నాయి. బుజ్జగింపు రాజకీయాలు, ఓట్ల రాజకీయాలు రోజురోజుకీ వికృత రూపం దాలుస్తున్నాయి. సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన నాయకులు, మేధావులు, రచయితలలో ఎక్కువ మంది మెదళ్లు మొద్దుబారిన ఫలితమే ఇదంతా. హిందూధర్మానికి వక్రభాష్యాలు చెబుతూ, పవిత్ర గ్రంథాలలో వివక్షను వెతుకుతూ వాటిని దగ్ధం చేయడం దేనికి నిదర్శనం? హిందూ దేవతల ఆలయాలను కూల్చేశానని తొడకొడుతూ ప్రకటించడం దేనికి సంకేతం? ముస్లిం మతోన్మాదం వెర్రితలలు వేసిన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లనే ఏమిటి, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్ వరకు కూడా హిందూ సమాజం మీద కక్ష కట్టిన తీరు అనేక ప్రశ్నలకు తావిస్తున్నది.

సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు స్వామిప్రసాద్ మౌర్య నాయకత్వంలో గాంధీ వర్ధంతి రోజున ఉత్తరప్రదేశ్‌లో రామచరిత మానస్ గ్రంథంలో 'కొన్ని పుటలు' తగలబెట్టిన దుర్ఘటన జరిగింది. ఎందుకింత దుశ్చర్య? ఆ పుటలలో వెనుకబడిన తరగతుల వారినీ, మహిళలనూ కించపరిచే వ్యాఖ్యలు ఉన్నాయట. అఖిల భారతీయ ఓబీసీ మహాసభ లక్నోలోని బృందావన్ యోజన సెక్టార్‌లో ఈ ఘాతుకానికి పాల్పడింది. ఇలాంటి దగ్ధకాండను కొనసాగించాలన్న ఉద్దేశాన్ని కూడా ఆ విధ్వంసకులు ప్రకటిస్తున్నారు. ఈ దుష్కృత్యానికి మళ్లీ ఒక వర్గాన్ని అండగా చేసుకోవడం ఖండించదగినది. పదవీదాహంతో కొందరు మూర్ఖులు చేసిన పనిని మొత్తం ఓబీసీ వర్గానికి అంటగట్టడం సహేతుకం కాదు. ఆ చర్య హిందూ సమాజంలో చీలిక తెచ్చే యత్నమని స్పష్టంగా అర్థం కావడం లేదా? చాలాకాలం యోగి ఆదిత్యనాథ్ మంత్రివర్గంలో సభ్యుడైనప్పటికీ మౌర్యకి జనవరి 22న హఠాత్తుగా రామచరితమానస్‌లో ఇలాంటి కొన్ని పేజీలు ఉన్నాయని జ్ఞానోదయం కావడం వింత కాదా! ఉత్తరప్రదేశ్ శాసనసభకు నిరుడు జరిగిన ఎన్నికలలో ఓడిపోయి, దొడ్డిదోవన

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ మాఘ బహుళ పాడ్యమి**

**లోపలి పేజీలలో...**



ముఖపత్ర కథనం

**వాసి తగ్గించుకున్న బీబీసీ**

6లో

జాతీయం

**బాధ్యతారాహిత్యం, బరితెగింపు!**



12లో



ధారావాహిక నవల

**వరాహమిహిర**

– పాలంకి సత్య

20లో

# జాగృతి

## సంపాదకీయం

శాసనమండలిలోకి చొరబడి వీరంగం వేస్తున్న మౌర్య ఒకప్పుడు బీజేపీ సభ్యుడే. అప్పుడు రామచరితమానస్‌లో కానరాని దోషాలు ఇవాళ ఎందుకు కనిపిస్తున్నాయి? సాధువులను దెయ్యాలతో పోల్చే తెంపరితనం నాడెందుకు మౌనం దాల్చింది? కారణం ఒక్కటే, పదవి. అప్పుడు కూడా రాముడి మీద, సాధువుల మీద ఈయన గొణుగుడు ఉండేదని అంటున్నారు. నాడు పెదవి దాటని హిందూ వ్యతిరేకత ఇప్పుడెందుకు విజృంభిస్తున్నట్టు? హిందూ సమాజంలో వచ్చిన కొన్ని అవాంఛనీయ ధోరణులను సామరస్యంగా, సహోదరభావంతో

## ఇంత కుసంస్కారమా?

పరిష్కరించే ఉద్దేశంతో 16వ శతాబ్దంలో ఆరంభమైనదే భక్తి ఉద్యమం. ఆ సమయంలో తులసీదాస్ అవధి భాషలో వెలువరించినదే రామచరితమానస్. ఆ పవిత్ర గ్రంథాన్ని ఇవాల్టి కుళ్లు రాజకీయాలతో తూకం వేయడమే అజ్ఞానం.

తన నియోజకవర్గంలో ఉన్న మూడు హిందూ దేవాలయాలను కూల్చివేయించాను అని బాహాటంగా ప్రకటించాడు సీనియర్ డీఎంకే నాయకుడు టీఆర్ బాలు. అవన్నీ నూరేళ్ల క్రితం కట్టిన ఆలయాలేనట. బాలు ఉపన్యాసాన్ని తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై వైరల్ చేయడంతో రగడ మొదలయింది. తన తండ్రి ఉపన్యాసానికి కత్తిరింపులు చేసి ప్రసారం చేశారంటూ బాలు కొడుకు, డీఎంకే ఐటీ సెల్ అధిపతి టీఆర్‌బీ రాజా వివరణ ఇచ్చుకున్నాడు. ఇదంతా జనవరి 30న జీన్యూస్ నివేదించింది. ఆ మొత్తం ఉపన్యాసం వింటే బాలు ఎంత కండకావరంతో విర్రవీగుతున్నాడో అర్థమవుతుంది. గుళ్లు కూలిస్తే ఓట్లు రావని నా శ్రేయోభిలాషులు చెప్పారు. అయినా ఓట్లు ఎలా తెచ్చుకోవాలో నాకు తెలుసు అని కూడా తొడగొట్టినంత పనిచేశాడు. అందుకే బీజేపీ తాజాగా విడుదల చేసిన మరొక వీడియోలో బాలు లంచం తీసుకుని ఆ గుళ్లు కూల్చివేయించాడని అన్నామలై ఆరోపిస్తున్నారు. జనవరి 30వ తేదీనే ఇండియా టుడే విడుదల చేసిన ఒక వీడియో మరీ దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఆలయంలో ప్రవేశించేందుకు నీకెవరు అనుమతిచ్చారు (జనవరి 19) అంటూ డీఎంకే యూనియన్ కార్యదర్శి మాణిక్యం ఒక ఎస్‌సీ యువకుడిని పరుషంగా మాట్లాడినట్టు ఆ వీడియో వల్ల తెలుస్తుంది. ఆ కుర్రాడు తాగి వచ్చినందుకే తాము బుద్ధి చెప్పామని, పరుషంగా మాట్లాడిన మాట నిజమేనని డీఎంకే మాణిక్యం ఒప్పుకున్నాడు. బాలు అలా, మాణిక్యం ఇలా.

ముస్లిం పర్సనల్ లాలో మహిళల పట్ల టన్నుల కొద్దీ వివక్ష ఉందంటూ ఆ వర్గం వనితలే ఘోషిస్తున్నారు. దీని మీద కూడా మౌర్య తనదైన శైలిలో ధ్వజమెత్తి మరే ఇతర కాగితాలైనా తగలబెట్టగలరా? బాలికలు, యువతులు విద్యాలయాల ముఖం చూడకూడదంటూ అఫ్ఘానిస్తాన్‌లో తాలిబన్ హుకుం జారీ చేసేశారు. వాళ్ల గొడవ మనకొద్దు అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే తాలిబన్ ఎజెండానే మన దేశంలో ముస్లిం మతోన్మాదులు అమలు చేసే ప్రయత్నంలో ఉన్నారు.

ముస్లిం మహిళలు కూడా భారతీయులే అనుకుంటే, వారు కూడా బీసీ వర్గీయులే అనుకుంటే మౌర్య ఇంకొన్ని కాగితాలేమైన దగ్ధం చేసి తన దమ్మేపాటిదో రుజువు చేసుకోవాలి. ఇక మౌర్య ప్రాతినిధ్యం వహిస్తున్న సమాజ్‌వాదీ నాయకులు వాదన పరమ వికృతంగా ఉంది. రామచరిత మానస్‌ను ఎవరు కించపరుస్తారు? అని ప్రశ్నిస్తూనే, తమ నేత నాలిక తీటనీ, చేతి దురదనీ మాత్రం ప్రస్తావించడం లేదు. ఇంతటి కుసంస్కారం ప్రదర్శిస్తున్న ఇలాంటి నేతలకు బుద్ధి చెప్పడానికి హిందూ సమాజం ఇంకాస్త గట్టిగానే ఆలోచించవలసిన సమయం వచ్చింది. ★

 | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



26లో

కథ

**19(1) ఏ**

– శరత్‌చంద్ర

ధరహాసం





పిటిషన్ వేసి పశ్చాత్తాపం! (తెలంగాణ) - 14
ఆలయాలపై ప్రభుత్వ పెత్తనం ఏమిటీ? (ఆంధ్రప్రదేశ్) - 16
అమెరికాను కుదిపేస్తున్న తుపాకీ సంస్కృతి (అంతర్జాతీయం) - 24
అహంభావి కాదు... ఆత్మాభిమాని (నివాళి) - 26
'పద్మ'భారతీయం (మహిళ) - 28
'ఆవరణ' (పరిచయం) - 30
భారత మహిళా క్రికెట్‌కు మహర్దశ (క్రీడ) - 43
ఎడారిలో ఒయాసిస్ 'మాలికాపురం' (సినిమా) - 50

**జనహృదయ నేతగా మోదీ ఖ్యాతి విస్తరిస్తోంది. అంతర్జాతీయంగా కూడా విశిష్ట వ్యక్తిగా ఆ పేరు మార్మోగుతోంది. జి-20 నాయకత్వం, దానితో వచ్చే కీర్తిప్రతిష్టలు, ఆర్థిక ప్రయోజనాలు వాకిట్లో ఉన్నాయి. అంతేనా! ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే, భారత ప్రధానిగా ఎవరిని ఎంచుకుంటారు? అన్న అంశంతో 'ఇండియా టుడే' పత్రిక నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో దాదాపు 72 శాతం మంది మోదీ పాలనపైన సంతృప్తి వ్యక్తం చేయటం.. ఆయనకున్న ప్రజాభిమానాన్ని చెప్పకనే చెబుతోంది. ఈ ఆదరణను ఓర్వలేని శక్తులు కొన్ని ఆయన మీద బురదచల్లే కుటిలయత్నాలకు దిగుతున్నాయి. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన ఉన్న కాలంలో చెలరేగిన అల్లర్లను ఇందుకు సాకుగా చూపుతున్నాయి.**



# వాసి తగ్గించు

బీబీసీది జాత్యహంకారమే. ఆ దేశం (బ్రిటిష్) అధీనంలో భారత్ ఉన్నప్పుడు జరిగిన అమానుషాల గురించి ఆ చానల్ ఎందుకు మాట్లాడదు? జలియన్‌వాలాబాగ్ గురించి, కొండకోనలలో గిరిజన తెగలను రూపుమాపడం గురించి, కోహి నూర్ వజ్రం గురించి డాక్యుమెంటరీలు ఎందుకు తీయరు? బీబీసీకి, దీని వెనుక ఉన్న కొందరు భారత్, పాక్ జర్నలిస్టులకు ప్రతి ఎన్నికలకు ముందు భారత్‌లో మంటలు చెలరేగడమే కావాలి. విశ్వవిద్యాలయాలలో రక్తం చిందాలి.

ఇరవై ఏళ్ల క్రితం నాటి సంఘటన.. సుదీర్ఘకాలం దానిపైన వాదోపవాదాలు, న్యాయవిచారణలు సాగి చివరకు తీర్పు కూడా వెలువడింది. అలాంటి అంశాన్ని ఇప్పుడు తవ్వి తీయటమేమిటి? దానికి ఎనలేని ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయంగా చర్చకు ఆస్కారం కల్పించటం వెనక, ఎవరి రాజకీయ ప్రయోజనాలు దాగి ఉన్నాయి? ఏ లక్ష్యాన్ని ఆశించి ఇందుకు సిద్ధపడ్డారు? ఇప్పటికిప్పుడు అందులో దాగి ఉన్న మర్మం (హిడెన్ ఎజెండా) మనకు తెలియక పోయినా ఒక విషయం మాత్రం స్పష్టం. నిస్సందేహంగా ఇది ప్రపంచ దేశాల మధ్య సమున్నతంగా ఎదిగిన భారత్‌ను, దానికి నేతృత్వం వహిస్తున్న ప్రధాని మోదీని అప్రతిష్ట పాలు చేయటానికి అనుసరించిన ఎత్తుగడ.. అపఖ్యాతి పాలు చేయటానికి అనుసరించిన వ్యూహం అని చెప్పకతప్పదు. ఇప్పుడు చర్చంతా.. బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ 'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పైన.. అది సృష్టిస్తున్న చిచ్చుపైననే.

బీబీసీకి వందేళ్ల చరిత్ర ఉంది. బ్రిటిష్ పౌరులు అందించే లైసెన్సు ఫీజులే దానికి ఆధారం. ఈ మధ్య కాలంలో ఎక్కువ మంది ఓటీటీలవైపు మళ్లటంతో అది నిధుల సమస్యను ఎదుర్కొంటోంది. రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. బ్రిటిష్ ఇంటెలిజెన్సు సర్వీసు అధికారుల ఆసక్తులు, అవసరాలకు అనుగుణంగా కథనాలు వండి వారుస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మన దేశ విషయానికొస్తే అది అనేక సందర్భాల్లో పక్షపాత ధోరణితో వ్యవహరించింది. 2020లో సీఏఏకి సంబంధించిన హింస విషయంలోగానీ, కొవిడ్-19 మరణాల విషయంలో గానీ, కశ్మీర్ పరిణామాలపైన గానీ బీబీసీ రిపోర్టింగ్ మన దేశ ప్రతిష్టను దెబ్బతీసేదిగానే సాగింది. ఇప్పుడు మోదీపైన రెండు భాగాలుగా రూపొందించిన డాక్యుమెంటరీ అందుకు భిన్నమైనదేమీ కాదు. వివాదాస్పదమైన ఇలాంటి డాక్యుమెంటరీని ప్రసారం చేయటంలో ఆశ్చర్యపడవలసిన పనిలేదని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సరే, ఇంకా బెంగాలీ, నేపాలీ, తమిళం, గుజరాతీ, మరాఠీ, పంజాబీ భాషల్లో భారతీయులకు బీబీసీ సేవలను అందిస్తోంది.

మోదీని లక్ష్యంగా చేసుకుని, 2002 గుజరాత్ అల్లర్లు, జమ్ముకశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తి అందించిన ఆర్టికల్ 370 రద్దు, కొన్ని రాష్ట్రాలలో బీఫ్ బ్యాన్, నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సీ) వంటి అంశాలతో 'ఇండియా.. ది మోదీ క్వశ్చన్' పేరిట బీబీసీ డాక్యుమెంటరీని రూపొందించింది. మొదటి భాగం డాక్యుమెంటరీని యూకేలో ప్రసారం చేసింది. అక్కడ ప్రసారమైన నిమిషాల వ్యవధిలోనే అది సామాజిక మాధ్యమాల్లో షేర్ కావటం ప్రారంభమైంది. దీనితో బీబీసీ డాక్యుమెంటరీని షేర్ చేసే ఖాతాలను బ్యాన్ చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. మోదీపై రూపొందించిన డాక్యుమెంటరీ అంతా ఏకపక్షంగా సాగింది. తప్పుడు



**డాక్టర్ పార్థసారథి చిరువోలు**
సీనియర్ జర్నలిస్ట్




# కున్న బీబీసీ

రిపోర్టులతో, అపఖ్యాతి సమాచారంతో, అన్ని హద్దులను చెరిపేసేదిగా ఉంది. బీబీసీ డాక్యుమెంటరీని భారత్ తీవ్రంగా ఖండించింది. అదొక విద్వేషపూరిత చర్యగా అభివర్ణించింది. 'ఇది ఒక ప్రచార కార్యక్రమం. వారు ఎంచుకున్న కోణాన్ని ప్రచారం చేయటానికి మాత్రమే దీనిని రూపొందించారు' అని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి వ్యాఖ్యానించారు. ఇందులో వలసవాద మనస్తత్వం పూర్తిగా బహిర్గతమవుతోందన్నారు.

ఇదంతా దేశంలో విభజనలు తీసుకురావటానికి చేసిన ప్రయత్నం అని ప్రధాని మోదీ స్పందించారు. బీబీసీ డాక్యుమెంటరీ వివాదం నేపథ్యంలో, ఢిల్లీలో ఏర్పాటయిన ఓ కార్యక్రమంలో ప్రధాని చేసిన వ్యాఖ్యలు ప్రాముఖ్యం సంతరించుకున్నాయి. 'ఇది భారత్‌కు అనుకూల సమయమని అన్ని చోట్లా రుజువవుతోంది. ఇలాంటి తరుణంలో వేర్వేరు నెపాలతో భరతమాత బిడ్డల మధ్య విభజనలు తీసుకొచ్చేందుకు అనేక ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ ప్రయత్నాలు ఎప్పటికీ విజయాన్ని సాధించలేవు. దేశభవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రజలంతా కలిసికట్టుగా ఉండాలి' అని ఆయన హితవు చెప్పారు.

అగ్రదేశం అమెరికా కూడా స్పందించింది. 'మీరు చెబుతున్న డాక్యుమెంటరీ గురించి నాకు తెలియదు. రెండు శక్తిమంతమైన ప్రజాస్వామ్యాలుగా అమెరికా, భారత్‌కు వాటి భాగస్వామ్య విలువల గురించి తెలుసు. భారత ప్రజాస్వామ్యం శక్తిమంతమైనది. ఈ రెండు దేశాలను కలిపి ఉంచే వాటిపై మా దృష్టి ఉంటుంది. ఈ బంధాన్ని బలోపేతం చేసే అంశాల గురించి ఆలోచిస్తాం. ఇరుదేశాల మధ్య సన్నిహిత రాజకీయ సంబంధాలు, ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. అమెరికా, భారత ప్రజల మధ్య విడదీయరాని బంధం ఉంది' అంటూ ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి నెడ్ ప్రైస్ పేర్కొన్నారు. బ్రిటిష్ ప్రధాని రిషి సూనక్ కూడా ఇదే తరహాలో స్పందించారు. అందులోని విషయాలను పూర్తిగా అంగీకరించలేనని పేర్కొంటూ, డాక్యుమెంటరీ వివాదం నుంచి దూరంగా జరిగారు. ఈ డాక్యుమెంటరీపై స్వతంత్ర దర్యాప్తు చేయాలని యూకేలో ఆన్‌లైన్ పిటిషన్ దాఖలైంది. గతవారం ప్రసారమైన మొదటి భాగంలో దుష్ప్రచారం ఎక్కువగా ఉందని, వీక్షకులను తప్పుదోవ పట్టించేలా ఉందని, ఇందులో నిర్దిష్ట ప్రమాణాలను పాటించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఐటీ చట్టం 2021, సెక్షన్ 69 ఏ ఐటీ చట్టం 2000 ప్రకారం సోషల్ మీడియా కంపెనీల పైన సెన్సార్‌షిప్ విధించే అధికారం భారత ప్రభుత్వానికి ఉంది. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆదేశాలను యూట్యూబ్, ట్విటర్‌లు ఔదలదాల్చాయి. జనవరి 20వ తేదీన ఇందుకు సంబంధించిన 50 ట్వీట్లను ట్విటర్ బ్లాక్ చేసింది. ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత భూషణ్, అమెరికన్ నటుడు, రాజకీయవేత్త జాన్ కుశాక్ తదితరుల ట్వీట్లు ఉన్నాయి. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ట్విటర్ పేర్కొంది.

ప్రభుత్వం నిషేధించటం వల్ల ఈ అంశానికి ప్రాధాన్యం వచ్చిందని కొందరు చెప్పవచ్చు కానీ, ఇదంతా ఒక నెట్‌వర్క్ పరిధిలో జరగడం కూడా ఈ ప్రాచుర్యానికి కారణం. ఇందులో ఏముందో తెలుసుకోవాలన్న ఆరాటం కంటే దీన్ని ఆయుధంగా వాడుకోవటానికి రాజకీయ ప్రత్యర్థులు రంగంలోకి దిగారు. ఢిల్లీ, హైదరాబాద్, కలకత్తా, తిరువనంతపురం తదితర ప్రదేశాల్లో బహిరంగంగా డాక్యుమెంటరీని ప్రదర్శించారు.

ప్రసారసాధనాలు ప్రత్యేక కథనాలను ప్రసారం చేశాయి. సామాజిక మాధ్యమాల్లో అది చర్చలకు దారితీసింది. నిషేధం మాట ఎలా ఉన్నా, మారుపేర్లతో చాపకింద నీరులా అది సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా షేర్ అవుతున్నట్టుగా సమాచారం. అగ్రదేశాధినేతలూ స్పందించటం వెనక ఇది మోదీకి సంబంధించిన అంశం కావటమే కారణం అని చెప్పాలి.

### రాజకీయ ప్రకంపనలు

ఈ డాక్యుమెంటరీపై నిషేధాన్ని తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలు విమర్శించాయి. కేరళ రాజధాని తిరువనంత పురంలోని షణ్ముగం బీచ్‌లో కేరళ కాంగ్రెస్ యూనిట్ ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించింది. ప్రస్తుతం కేరళలో కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉంటే, అధికారంలో సీపీఎం ఉంది. డాక్యుమెంటరీ నిషేధించాలని ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్‌తో పాటు సీపీఎం కూడా వ్యతిరేకించటం విశేషం. బీబీసీ డాక్యుమెంటరీ నేపథ్యంలో, వెటరన్ కాంగ్రెస్ నాయకుడు ఏకే ఆంటోనీ కుమారుడు అనిల్ కె ఆంటోనీ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.'ఈ డాక్యుమెంటరీ అత్యంత ప్రమాదకరమైనది, అది భారత సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేదిగా ఉంద'ని ఆయన పేర్కొంటే, ఈ వ్యాఖ్యలు పూర్తిగా అపరిపక్వ మైనవని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, లోక్‌సభ సభ్యుడు శశిథరూర్ స్పందించారు. మన జాతీయ భద్రత, సార్వభౌమత్వం ఒక చిన్న డాక్యుమెంటరీకి దెబ్బతినేటంత బలహీనమైనవా అని ఆయన ఎదురుప్రశ్న వేశారు. 'వాస్తవాలకు వెలుగు ఎక్కువ. దానికి బయటకు చొచ్చుకువచ్చే దుర్మార్గమైన లక్షణం ఉంటుంది. నిషేధాలు, అణచివేత, జనాలను భయపెట్టటం వంటివేమీ దాన్ని నియంత్రించలేవు' అన్నారు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ. భారత్ జోడో యాత్రలో భాగంగా జమ్ము పర్యటనలో విలేకరులతో మాట్లాడారు.

### భగ్గుమంటున్న యూనివర్సిటీ ప్రాంగణాలు

బీబీసీ డాక్యుమెంటరీ ప్రకంపనలు రేపింది. యూనివర్సిటీ ప్రాంగణాల్లో విద్యార్థుల మధ్య ఉన్న సుహృద్భావ వాతావరణాన్ని అది దెబ్బతీసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డాక్యుమెంటరీని ప్రదర్శించటంపైన వివాదం తలెత్తింది.




### దురుద్దేశంతో రూపొందించిన అభియోగపత్రం

'గుజరాత్ అల్లర్లలో మోదీ పాత్ర లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన తర్వాత కూడా ఈ పని చేయటమేమిటి? విభజించు-పాలించు అనే సూత్రం కింద హిందూ-ముస్లింల మధ్య చిచ్చు రేపాలన్న సామ్రాజ్యవాద కాలం ధోరణి నుంచి బ్రిటన్ ఇంకా బయట పడలేదనటానికి ఇది నిదర్శనం అని బీబీసీ డాక్యుమెంటరీపై మాజీ న్యాయమూర్తులు, విశ్రాంత అధికారులు వ్యాఖ్యానించారు. 13 మంది విశ్రాంత న్యాయ మూర్తులు, 133 మంది మాజీ అధికారులు, దౌత్యవేత్తలు, 156 మంది ఇతరులు కలిపి మొత్తం 302 మంది బీబీసీకి వ్యతిరేకంగా ప్రకటన జారీ చేశారు.'దేశభక్తుడయిన నేతపై దురుద్దేశంతో రూపొందించిన అభియోగ పత్రం ఈ డాక్యు మెంటరీ. మా దేశాన్ని, మా ప్రధానిని ఏకపక్షంగా విమర్శిస్తే సహించేది లేదు' అని స్పష్టం చేశారు.

### బోగస్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్

బీబీసీ డాక్యుమెంటరీపైన శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఫెర్మాంట్ ప్రాంతంలో ఉన్న కొందరు ఎన్ఆర్ఐలు నిరసన ప్రదర్శన చేశారు. దాదాపు 50 మంది సభ్యుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంది. 'బీబీసీ అంటే 'బోగస్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్', బీబీసీ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోంది. అది ఏకపక్షంగానూ, జాత్యహంకారంతో వ్యవహరి స్తోంది. అది ఫేక్ న్యూస్ పెడ్లర్' అంటూ నినాదాలు చేశారు.

### అది పూర్తిగా ఏకపక్షం

'భారత ప్రధానిని బాధ్యునిగా చిత్రీకరిస్తూ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ పూర్తిగా ఏకపక్షంగా ఉంది. కామన్‌సెన్సు గానీ, జడ్జిమెంటుగానీ లేకుండా పూర్తిగా ఏకపక్షంగా దీనిని నిర్మించారు' అంటూ ధ్వజమెత్తారు బ్రిటిష్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ప్రముఖుడు లార్డ్ రామి రేంజర్. డాక్యుమెంటరీ

కానీ పట్టుదలగా ఎస్ఎఫ్ఐ విద్యార్థులు రెండోమారు కూడా డాక్యుమెంటరీని ప్రదర్శించి తాము పైచేయి సాధించాలని చూశారు. దీనికి ప్రతిగా ఏబీవీపీ విద్యార్థులు కశ్మీర్ ఫైల్స్ చిత్రాన్ని ప్రదర్శించారు. ఢిల్లీ జేఎన్‌టీయూ, జామియా మిలియా యూని వర్సిటీల్లో కలకలం రేగింది. డాక్యుమెంటరీ ప్రదర్శించటానికి ఓ వర్గం విద్యార్థులు సిద్ధమయితే, రెండోవర్గం దానిని అడ్డుకోవటానికి ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో చెలరేగిన అల్లర్లు హింసాత్మకంగా మారాయి. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) విభాగం కలకత్తాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ప్రదర్శించింది. ప్రఖ్యాత సంస్థ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్)లో కూడా డాక్యుమెంటరీ ప్రదర్శించారు. చాలా యూనివర్సిటీల్లో డాక్యుమెంటరీ ప్రదర్శనకు రహస్య ఏర్పాట్లు సాగుతున్నాయన్న వార్తలు వస్తున్నాయి. విద్యార్థి సంఘాల మధ్య తలెత్తిన పట్టుదలలు ఈ వ్యవహారాన్ని ఎక్కడ వరకూ తీసుకెళతాయోనని అటు విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, ఇటు పోలీసులు కూడా ఆందోళన చెందుతున్నారు.

యూనివర్సిటీ నిబంధనల ప్రకారం విద్యార్థి సంఘాలు నిర్వహించే అన్ని కార్యక్రమాలకు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఇందుకు భిన్నంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డాక్యుమెంటరీని ప్రదర్శించారు. దాదాపు 100 మంది వరకూ దానిని చూశారు. క్యాంపస్‌లో ఉన్న 'ఫెటర్నిటీ' గ్రూపు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటయ్యింది. ఈ విషయం తెలియగానే స్టూడెంట్స్ వెల్ఫేర్ విభాగం డీన్, భద్రతా సిబ్బంది వెళ్లి ఆపటానికి ప్రయత్నించారు. విద్యార్థులు






## రీపై నిరసన గళాలు

తీరునే కాదు, అది ప్రసారం చేసిన సమయాన్ని కూడా ఆయన తప్పు పట్టారు.

**పాత గాయాలను రేపుతోంది**

'భారతదేశంలో నిజంగా ముస్లింలు అగచాట్లు పడుతున్నారనుకుంటే, ఈ పాటికి వాళ్లంతా ఎప్పుడో దేశాన్ని విడిచిపెట్టి వెళ్లేవారు. దానికి భిన్నంగా ఇక్కడ పాకిస్తాన్ కంటే, ఇతర అనేక ముస్లిం దేశాల కంటే ఎక్కువ ముస్లింలు జీవిస్తున్నారు. అక్కడ అభివృద్ధిని చూసి బంగ్లాదేశ్ నుంచి కూడా ముస్లింలు తరలివస్తున్నారు' అని బ్రిటిష్ వాణిజ్య ప్రతినిధి డొలార్ పాపాట్ బీబీసీ డైరక్టర్ జనరల్ టిమ్ డేవీకి లేఖ రాశారు. డాక్యుమెంటరీ మొదటి భాగమంతా ఏకపక్షంగా, గుజరాత్ అల్లర్లలో మోదీని ముద్దాయిగా చూపించే ప్రయత్నం చేసిందని అన్నారు. భారత న్యాయవ్యవస్థ, పార్లమెంట్ కూడా ఆయన పాత్ర లేదని తేల్చిన తర్వాత కూడా ఇలాంటి ప్రయత్నం చేయటం తగదని.. ఎట్టిపరిస్థితుల్లోనూ రెండో భాగాన్ని ప్రసారం చేయవద్దని హితవు పలికారు. 'యుకే మతస్వేచ్ఛ ఉన్న దేశం. ఇతర మతాల పట్ల కూడా సహనాన్ని చూపుతుంది. అటువంటి దేశం.. భారత్ పరిస్థితుల్ని తప్పుగా చూపించి అపఖ్యాతి పాలు కావటం నాకు ఇష్టం లేదు' అని స్పష్టంగా తన మనసులో మాట చెప్పారు.

**ప్రధాని మోదీ ఖ్యాతిని దెబ్బతీయటానికే..**

'ఈ డాక్యుమెంటరీలో కొత్త విషయం గానీ, ప్రత్యేకంగా బయటపెట్టిన విషయాలేమీ లేవు' అని బీబీసీ తొలిభాగం డాక్యుమెంటరీని స్వయంగా చూసిన ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ కార్యకారిణి సభ్యులు రామ్‌మాధవ్ పేర్కొన్నారు. '2002లో గుజరాత్ అల్లర్ల సమయంలో బ్రిటిష్ ఫారెన్ ఆఫీసు నుంచి అందిన 'రహస్య నివేదిక' అని బీబీసీ పేర్కొంది.

ఒక బృందాన్ని గుజరాత్ పంపించి అక్కడ పరిస్థితులపైన అధ్యయనం చేయించాం. ఇది సమగ్ర నివేదిక. మోదీ ఖ్యాతిని అది దెబ్బతీస్తుంది' అని



విదేశాంగ కార్యదర్శి జాక్ స్ట్రా వెల్లడించారు. 'ఇలాంటి విచారణ చేపట్టటం తీవ్ర అభ్యంతరకరం. వలసవాద మనస్తత్వం అంటే ఇదే. బ్రిటిష్ ఫారెన్ ఆఫీసులో ఉన్న కొందరు ఉద్దేశపూర్వకంగా దీన్ని బీబీసీకి లీక్ చేశారు. జి-20 అధ్యక్ష హోదాలో, ఓ పెద్ద సదస్సుకు భారత్ సిద్ధ మవుతున్న నేపథ్యంలో, అంతర్జాతీయ యవనికపైన ప్రాధాన్యం గల వ్యక్తిగా మోదీ ఎదుగుతున్న క్రమంలో ఈ డాక్యుమెంటరీ విడుదల కావటం.. కచ్చితంగా భారత ప్రధాని ప్రతిష్టను దెబ్బతీయటానికే' అని రామ్‌మాధవ్ వ్యాఖ్యానించారు. ★

వాళ్లను లెక్క చెయ్యలేదు. డాక్యుమెంటరీ చూసేశారు. మూడ్రోజుల తర్వాత ఈ విషయంపైన వివాదం తలెత్తింది. భారత ప్రభుత్వం నిషేధించిన డాక్యుమెంటరీని ప్రదర్శించటం సరికాదని ఏబీవీపీ విద్యార్థి సంఘం అధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విద్యార్థి సంఘం అధ్యక్షుడు అభిషేక్ స్పందించారు. 'ప్రదర్శన ఆపమని యూనివర్సిటీ అధికారులు కోరిన మాట నిజమే. కానీ ప్రభుత్వం డాక్యుమెంటరీ నిషేధించలేదు. ఏ కోర్టూ ఆ విషయం ప్రకటించ లేదు. అలాంటప్పుడు ప్రదర్శన ఆపమనటమేమిటి అని మేం ప్రశ్నించాం. డాక్యుమెంటరీని చూశాం' అని వివరించారు. 'ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించటం నిబంధనలను ఉల్లంఘించటమే. దీనిపై నివేదిక కోరాం. రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. మిగతా అంతా ప్రశాంతంగా ఉంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో లేదు' అని యూనివర్సిటీ రిజిస్ట్రార్ దేవేశ్ నిగమ్ ఒక ప్రకటనలో వివరించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

**ఢిల్లీలోని జేఎన్‌యూలో..**

నర్మదా హాస్టల్ ముందున్న స్టూడెంట్స్ యూనియన్ కార్యాలయంలో రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో డాక్యుమెంటరీ ప్రదర్శనకు విద్యార్థి సంఘం సిద్ధమయ్యింది. ఇందుకు ఒక రోజు ముందుగా ప్రకటన చేసింది. అందుకు అనుమతిని నిరాకరించింది యూనివర్సిటీ. ప్రదర్శనను రద్దు చేసుకోవాలని, అలా చేయకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవలసి వస్తుందని కూడా హెచ్చరించింది. విద్యార్థులు అందుకు అంగీకరించలేదు. అనుకున్నట్టుగానే డాక్యుమెంటరీ ప్రదర్శనకు సిద్ధమయ్యారు. సరిగ్గా అరగంట ముందు క్యాంపస్‌లో విద్యుత్ నిలిచిపోయి అంధకారం అలుముకుంది. దాంతో ఏ4 సైజులో పేపరుపై ప్రింటు చేసిన క్యూఆర్ కోడ్‌ను అందించారు. ల్యాప్‌టాప్‌లలోనూ, ఫోన్లలోనూ చూసేందుకు అవకాశం కల్పించారు. కొందరు విద్యార్థులయితే ల్యాప్‌టాప్‌లకు పెద్ద స్పీకర్లను కనెక్ట్ చేశారు. గుంపులుగా, గుంపులుగా కూర్చుని దీనిని అందరూ చూస్తున్న సమయంలో చీకట్లో నుంచి వాళ్లపై ఎవరో రాళ్లు విసరటం ప్రారంభించారు. మరికాసేపటికి ఇటుకలు కూడా మీద పడ్డాయి. అంతే ఒక్కసారిగా కలకలం రేగింది. తొక్కిసలాట కూడా చోటుచేసుకుంది. విద్యార్థులు డాక్యుమెంటరీ చూడటం ఆపేసి పరుగు అందుకున్నారు. ఆ తర్వాత నినాదాలు చేసుకుంటూ జేఎన్‌యూ ప్రధాన గేటు వద్దకు వచ్చారు. ఆ సమయంలోనూ మరోసారి వాళ్లు

**వెంటనే కావలెను**

జాగృతిలో పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్ కావాలి. ఫొటో షాప్, పేజీ మేకర్‌లో పేజీలు డిజైన్ చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం. తెలుగు టైపింగ్ వచ్చి ఉండాలి. డిగ్రీ/ఇంటర్మీడియట్ పాసైనవారు అర్హులు. ఎంపికైన అభ్యర్థి హైదరాబాద్‌లోని కాచిగూడలో గల మా కార్యాలయంలో పనిచేయాల్సి ఉంటుంది. జీతం: రూ.14,000/- నుంచి రూ.16,000/- (ప్రతిభను బట్టి). ఆసక్తి గల అభ్యర్థులు jagritiweekly@gmail.com కు పూర్తి బయోడేటాను పంపించండి. వివరాలకు: 9959991304.

రాళ్లదాడుల బారిన పడ్డారు. రాళ్లు విసిరిన వ్యక్తులు ముఖాలు కనిపించకుండా, మాస్కులు పెట్టుకుని తలపాగాలు చుట్టుకున్నారని విద్యార్థి సంఘం ఆరోపించింది. వాళ్లను పట్టుకోవటానికి తాము విఫలయత్నం చేసినట్టు, పలు వాహనాల్లో ఢిల్లీ పోలీసులు క్యాంపస్ బయట ఉన్నా పట్టించుకోలేదని, జేఎన్‌యూ భద్రతాసిబ్బంది ప్రేక్షకపాత్ర పోషించారని ఆరోపించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)కి చెందిన వ్యక్తులు రాళ్లు విసరటాన్ని తాము చూసినట్టు జేఎన్‌యూ అధ్యక్షుడు ఐషే ఘోష్ ఆరోపించారు. 'వాస్తవం బయటకొస్తుందని భయపడుతున్నారు. మీరు వెలుగును లాక్కోవచ్చు. స్క్రీన్‌లను లాగేసుకోవచ్చు. ల్యాప్‌టాప్‌లను కూడా తీసేసుకోవచ్చు. కానీ మా కళ్లను మాత్రం తీసుకోలేరు. అవే మాకు స్ఫూర్తి' అని ఆవేశపూరితంగా ప్రసంగించారు. ఈ ఆరోపణలకు ఏబీవీపీ నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. రాళ్లదాడిలో గాయపడిన విద్యార్థులు సఫ్దర్ గంజ్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో డాక్యుమెంటరీని ప్రదర్శించటానికి సిద్ధమయ్యారనే ఆరోపణలపై దాదాపు డజను మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




### అసలు డాక్యుమెంటరీలో ఏముంది?

జనవరి 17న ప్రదర్శించిన మొదటి భాగంలో భారతీయ జనతా పార్టీలో చేరి మోదీ ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన క్రమాన్ని వివరించారు. 2002 గుజరాత్ అల్లర్లు ప్రారంభమయినప్పటి నుంచి ఆ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన ఎన్నికల వరకూ సాగిన సంఘటనలు చూపించారు. యూకే ఫారెన్ ఆఫీసు ప్రచురించని ఒక నివేదికను ఇందుకు ప్రధానంగా ఎంచుకుంది. నరేంద్ర మోదీ 2014లోనూ, ఆ తర్వాత తిరిగి 2019లో ప్రధానిగా ఎంపికయిన తర్వాత భారతదేశంలో ముస్లింల స్థితిగతులు ఎలా మారాయనేది రెండో భాగంలో చూపించారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు అనంతరం, సిటిజన్‌షిప్ మాట్రిక్స్ ప్రవేశపెట్టిన తర్వాత పరిస్థితిని చర్చించారు. జార్ఖండ్‌లో బీఫ్ రవాణా చేస్తున్నారనే అనుమానంపై అలీముద్దీన్ అన్సారీపైన దాడిని, దీనికి బాధ్యులయిన నలుగురు హిందువులను కేంద్రమంత్రి జయంత్ సిన్హా స్వాగతించటం వంటి అంశాలను చూపించారు. తను బంగ్లాదేశీయుడిని కాదని స్పష్టం చేసే పత్రాలు లేక, అస్సాంలో ఒక రిక్షా కార్మికుడు భార్య, ఇద్దరు పిల్లలతో 18 నెలల పాటు దుర్భర పరిస్థితులను ఎదుర్కోవటాన్ని చూపారు. 'ఈ దేశం శరణార్థుల సమస్యలను పరిష్కరించటం లేదు. తమ ప్రజల్లో నుంచి శరణార్థులను తయారు చేస్తోంది. ఇది చాలా విచారించవలసిన విషయం' అని రచయిత్రి అరుంధతీరాయ్ స్పందించారు. ఇండియాను 'హిందూ నేషన్'గా మార్చటానికి, హిందువులను దగ్గరకు చేర్చుకుని ముస్లింలకు హక్కులు లేకుండా చేస్తున్నారు' అని విమర్శించారు.



### బీబీసీ పక్షపాత ధోరణిపైన నివేదిక

గత నెలలో బ్రిటిష్ చరిత్రకారుల బృందం ఒకటి బీబీసీ పనితీరును తప్పు పడుతూ ఒక నివేదికను వెలువరించింది. 'బీబీసీ పక్షపాతంతో పని చేస్తోంది. రాజకీయ ఉద్దేశాలతో పనిచేసే కార్యకర్తలకు అది ఊతమిస్తోంది. వివాదస్పదమైన గత అంశాలకు లేదా పాత చరిత్రకు కొత్త గొంతుకను అందించే ప్రయత్నం చేస్తోంది. ప్రముఖులంటూ అది ఇంటర్వ్యూ చేసే వ్యక్తులకు ఆ విషయం పైన కొద్దిగానో, లేదా ఏ మాత్రం అవగాహన ఉండదు. చాలా సందర్భాల్లో వారు వ్యాఖ్యానించేవి అత్యంత సంక్లిష్టమైనవి, వివాదాస్పదమైన విషయాలయి ఉంటాయి. ముందుగానే ఓ విషయంపైన ఒక అభిప్రాయానికి వచ్చి దానికి అనుగుణంగా 'ఏకపక్షం'గా వ్యాఖ్యానాలను గుదిగుచ్చుతారు. దీనివల్ల విషయంపైన పూర్తి స్పష్టత రాదు. వృత్తిపరమైన నైపుణ్యాలతో మేధావుల ప్రశంసలు అందుకునే స్థాయిలో అవి ఉండవు. 'అత్యున్నతస్థాయి సామర్థ్యం ఉన్న ప్రజెంటర్లు, జర్నలిస్టులను ఉపయోగించుకోవాలని బీబీసీ చార్టర్ చెబుతున్నా వాస్తవంలో పరిస్థితి దానికి భిన్నంగా ఉంది' అని వ్యాఖ్యానించారు.

### వివాదాలు కొత్తేం కాదు

బీబీసీ వివాదాల్లో చిక్కుకోవటం కొత్త కాదు. లూయిస్ మల్లె రూపొందించిన రెండు డాక్యుమెంటరీలు.. కలకత్తా, ఫాంటమ్ ఇండియాలు భారతీయ ఆగ్రహానికి గురయ్యాయి. భారతదేశంలో రోజువారీ జీవితం ఎలా ఉంటుందో ఇందులో చూపారు. భారతదేశంపైన ఇవి తప్పుడు అభిప్రాయాన్ని కలిగిస్తాయని మన దేశం భావించింది. ఫలితంగా 1972 వరకూ బీబీసీని భారతదేశంలోకి అనుమతించలేదు. లండన్ నుంచి రిపోర్టింగ్

చేసేవాళ్లు. ఆ తర్వాత బీబీసీ రిపోర్టర్‌గా ఇక్కడకు వచ్చిన మార్క్ టులీకి భారతదేశంపై అభిమానాన్ని ప్రదర్శించేవాడు. ఎమర్జెన్సీ సమయంలో మళ్లీ బీబీసీపై నిషేధం విధించారు. 2015లో లెస్లీ ఉడ్విన్ రూపొందించిన బీబీసీ డాక్యుమెంటరీ వివాదాస్పదమైంది. ఢిల్లీలో నిర్భయ గ్యాంగ్ రేప్, హత్య సంఘటనపై 'ఇండియాస్ డాటర్' పేరుతో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. రేపిస్టులలో ఒకరయిన ముకేష్ ఇంటర్వ్యూ క్లిప్ కూడా జత చేశారు. దాంతో ఈ డాక్యుమెంటరీ ప్రసారం చేయరాదని పోలీసులు 'స్టే' తెచ్చుకున్నారు. దాని ప్రకారం బీబీసీ దానిని భారతదేశంలో ప్రసారం చేయలేదు. అది విదేశాల్లో ప్రసారం అయి యూట్యూబ్‌లో మన దేశంలోకి చేరింది. దాంతో తర్వాత రోజుల్లో ప్రభుత్వం దానిని కూడా నిషేధించాలని ఆదేశించవలసి వచ్చింది. ఈ విషయంపై పార్లమెంటులో ఘాటుగా వాదోపవాదాలు సాగాయి. ప్రతిపక్షాలు రాద్ధాంతం చేశాయి. 'భారతదేశాన్ని అపఖ్యాతి పాలు చేయటానికి ఇదో కుట్ర' అని అప్పటి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఎం. వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. రాజ్యసభ సభ్యుడు జావేద్ అక్తర్ 'ఈ డాక్యుమెంటరీని మంచిగా రూపొందించారు. అది అభ్యంతరకరంగా భావించేవాళ్లు తమ మైండ్ సెట్‌ను మార్చుకోవాల'ని అన్నారు. బెంగళూరులో బాల కార్మికుల దురవస్థలను చూపుతూ జూన్ 2008లో, బీబీసీ పనోరమా షోలో చూపించిన ఒక డాక్యుమెంటరీలో విజువల్స్ కూడా ఫేక్ అని ఆరోపణలొచ్చాయి. ఇక గుజరాత్ అల్లర్లపైన రాకేశ్ శర్మ దర్శకత్వంలో రూపొందిన 'ఫైనల్ సొల్యూషన్' అనే డాక్యుమెంటరీ (బీబీసీకి సంబంధం లేదు) ప్రదర్శనకు ముందు సెన్సార్ బోర్డు అనుమతి లభించలేదు. మత కలహాల నుంచి బయటపడిన వారు, సాక్షుల ఇంటర్వ్యూలను ఇందులో పొందుపరిచారు. దీనివల్ల మత ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందని భావించి అందుకు అనుమతించ లేదు. కేంద్రంలో యూపీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపైన నిషేధాన్ని ఎత్తివేశారు. నేషనల్ అవార్డులలో, నాన్ ఫిక్షన్ విభాగంలో స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్లలోనూ ఎన్నో బహుమతులను గెలుచుకుంది.

అంతర్జాతీయ అంశాల్లోనూ బీబీసీ అనేక మార్లు వివాదాస్పదమైంది. 1995లో బీబీసీ రూపొందించిన డయానా ఇంటర్వ్యూ అంతర్జాతీయంగా ఎక్కువ మంది చూసిన వీడియోగా పేరు తెచ్చుకుంది. బీబీసీకి చెందిన మార్టిన్ బషీర్ దాని రూపకర్త. కొన్ని సంవత్సరాల తర్వాత అది నకిలీ డాక్యుమెంట్ ఆధారంగా రూపొందిన విషయమని తెలిసింది. ఎర్ల్ స్పెన్సర్‌కు ఫేక్ డాక్యుమెంట్లు సమర్పించి బషీర్




> బీబీసీ డాక్యుమెంటరీ అనేది ఒక్క గుజరాత్ లోనే కాదు. మొత్తం భారతదేశంలోనే రాజకీయాల గతి మార్చిన చారిత్రక సందర్భం. అలాంటి సందర్భంపైన బీబీసీ రూపొందించిన మీడియా ఇన్వెస్టిగేషన్ మాత్రమే, దానిపై నిషేధం విధించటం సమర్థనీయం కాదు అనే వాళ్లూ ఉన్నారు. ఏది ఏమైనా గుజరాత్ అల్లర్ల సమయంలో ముఖ్యమంత్రిగా ఉండటం వల్ల ఈ అంశం చంద్రునిలా మచ్చలా మిగిలిపోతుందే తప్ప ఆయన ప్రతిష్ఠ ఏమాత్రం మసకబారదు.

ఆయన నమ్మకాన్ని సంపాదించుకుని, ఆ తర్వాత డయానాను పరిచయం చేసుకోగలిగాడు. ఆమెను ఇంటర్వ్యూకు ఒప్పించగలిగాడు. ఈ ఇంటర్వ్యూపైన ఉన్నతమైన ప్రమాణాలు, పారదర్శకత లోపించినదిగా విమర్శలు వచ్చాయి.

ఇరాక్ వద్ద జీవ, రసాయన ఆయుధాలు ఉన్న విషయంలో బ్రిటిష్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ఆయన సిబ్బంది తప్పుడు నివేదిక సృష్టించారని బీబీసీ 2003 మే 29న వార్తాకథనం ప్రసారం చేసింది. ఇది సృష్టించిన సంచలనం, దానివల్ల ఇరాక్‌కు కలిగిన నష్టం పూడ్చలేనిది. అలాగే అమెరికా ప్రపంచ దృష్టిలో దుర్మార్గమైన దేశంగా మిగిలింది. అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్, బ్లెయిర్‌లను యుద్ధనేరస్థులుగా మార్చివేసింది. ఈ నివేదికలో.. 45 నిమిషాల్లో ఇరాక్ రసాయన, జీవ ఆయుధాలను ప్రయోగించగలదన్న వాక్యాన్ని తాము జోడించినట్టు బీబీసీ ప్రతినిధి గిల్లిగన్ ప్రకటించారు. ఆ తర్వాత రోజుల్లో ఈ సమాచారం అందించిన బ్రిటిష్ ఇంటెలిజెన్స్ అధికారి డేవిడ్ కెల్లీ ఆత్మహత్య చేసుకున్నారు. తప్పుడు వార్తాకథనం ప్రసారం చేసినందుకు బీబీసీ క్షమాపణలు చెప్పాలని బ్లెయిర్ ప్రభుత్వం బీబీసీపై ఒత్తిడి చేసింది. చివరికి బీబీసీ డైరెక్టర్ జనరల్ గ్రెగ్ డైక్ రాజీనామా చేశారు. సరే, ఈ విషయం పక్కనుంచితే, భారత సంతతి వ్యక్తి సునాక్ ప్రస్తుతం బ్రిటన్ ప్రధానిగా ఉన్నారు. రెండు దేశాల మధ్య సంబంధాలు సజావుగా సాగుతున్నాయి. త్వరలో వ్యాపార ఒప్పందానికి కూడా సిద్ధమవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో బీబీసీ డాక్యుమెంటరీ ప్రసారం కావటం వెనుక.. 20 ఏళ్ల క్రితం నాటి సంఘటనను పైకి తీయటానికి కారణాలేమయి ఉంటాయి? అందుకు దౌత్యపరమైన తెరవెనుక కారణాలేమయినా ఉన్నాయా? రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో భారత స్వతంత్ర వైఖరిని అగ్రరాజ్యాలు భరించలేకపోతున్నాయా? ఐక్యరాజ్య సమితి.. లష్కరే తొయిబా నేత అబ్దుల్ రహమాన్ మక్కీని అంతర్జాతీయ నేరస్థునిగా ప్రకటించేందుకు చైనా మద్దతు ఇచ్చింది. భారత్ పట్ల చైనా తన వైఖరి మార్చుకుందా? ఇది అగ్రరాజ్యం అమెరికాకు గుర్రుగా ఉందా? అన్న సందేహాలు వెంటాడుతున్నాయి. చైనాకు వ్యతిరేకంగా అగ్రరాజ్యాలు ఏర్పరిచిన క్వాడ్‌లో కూడా భారతదేశం చేరినా అవి ఇంకా తీరినట్టు లేవు.

బీబీసీ డాక్యుమెంటరీ అనేది ఒక్క గుజరాత్‌లోనే కాదు. మొత్తం భారతదేశంలోనే రాజకీయాల గతి మార్చిన చారిత్రక సందర్భం. అలాంటి సందర్భంపైన బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ మీడియా ఇన్వెస్టిగేషన్ మాత్రమే. దానిపై నిషేధం విధించటం సమర్థనీయం కాదు అనే వాళ్లూ ఉన్నారు. ఏదిఏమైనా గుజరాత్ అల్లర్ల సమయంలో ముఖ్యమంత్రిగా ఉండటం వల్ల ఈ అంశం చంద్రునిలో మచ్చలా మిగిలిపోతుందే తప్ప మోదీ ప్రతిష్ఠ ఏమాత్రం మసకబారదు. ★

# బాధ్యతారాహిత్యం,

**రాజకీయ పార్టీలన్న తరవాత విమర్శలు, ప్రతివిమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం వింతేమీ కాదు. రాజకీయాల్లో ఇవన్నీ అత్యంత సహజం. అయితే, రోజువారీ సాధారణ విమర్శలను పక్కనపెడితే దేశభద్రత, రక్షణ, విదేశీ వ్యవహారాలు, సైన్యం తదితర అంశాల విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. అత్యంత సంయమనం పాటించాలి. అన్ని పార్టీలు ఒకే మాట వినిపించాలి. ఒకే బాటలో నడవాలి.**

రక్షణ దళాలకు సంబంధించిన అంశాలను పూర్తిగా రాజకీయాలకు దూరంగా ఉంచాలి. సరిహద్దుల్లో అహరహం ప్రాణాలొడ్డి పోరాడే బలగాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఎట్టి పరిస్థితుల్లో మాట్లాడరాదు. ఇది అన్ని పార్టీలు అనుసరించాల్సిన, అవలంబించాల్సిన ప్రాథమిక సూత్రం. దశాబ్దాల పాటు దేశాన్నేలిన, వందేళ్లకు పైగా చరిత్ర గల హస్తం పార్టీకి ఈ మాత్రం తెలియదని అనుకోలేం. పాకిస్తాన్‌పై సర్జికల్ దాడులకు సంబంధించి గతంలో ఆ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ అవగాహనా రాహిత్యంతో మాట్లాడి అభాసుపాలయ్యారు. దాడులకు సంబంధించిన ఆధారాలు చూపాలంటూ డిమాండ్ చేసి తెలివితక్కువతనాన్ని ప్రదర్శించుకున్నారు. దేశభద్రతకు సంబంధించిన కీలక అంశంపై ఆషామాషీగా, అవగాహన లేకుండా మాట్లాడి తన పరువును, పార్టీ పరువును తీశారు. తాజాగా తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత జోడో యాత్రలో భాగంగా జమ్ములో మళ్లీ ఈ తేనెతుట్టెను కదిపారు. దీనికి సంబంధించిన పాత ఆరోపణలను మళ్లీ వల్లె వేశారు. పాకిస్తాన్‌పై 2016 సెప్టెంబర్‌లో చేపట్టిన సర్జికల్ దాడులకు సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలు లేవని, ఉంటే వాటిని బయటపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రచార ఆర్భాటం కోసం, ప్రజలను పక్కదారి పట్టించే ప్రక్రియలో భాగంగా మోదీ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

దిగ్విజయ్ సింగ్ అమాయకుడేమీ కాదు. నిన్న కాక మొన్న రాజకీయాల్లోకి వచ్చిన కొత్తతరం నాయకుడేమీ కాదు. దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో ఒకటైన మధ్యప్రదేశ్‌కు దశాబ్దం పాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లో పార్టీ అంతర్గత సమస్యలను పరిష్కరించిన నేతగా పేరుంది. అయితే ఇలాంటి సీనియర్ నాయకుడి నుంచి సర్జికల్ దాడులకు సంబంధించి అవగాహనా రాహిత్య మాటలు విని యావద్దేశం ఆశ్చర్యపోయింది. 2016లో ఆయన ఈ ఆరోపణలను చేసినప్పుడు పార్టీ వీటిని కనీసం ఖండించలేదు. తద్వారా పరోక్షంగా ఆయనను వెనకేసుకుని వచ్చింది.

దొంగలు పడ్డ ఆర్నెళ్లకు కుక్కలు మొరిగినట్లు పార్టీ ఇప్పుడు స్పందించింది. యువరాజు రాహుల్ గాంధీ తీరిగ్గా దిగ్విజయ్ వ్యాఖ్యలను ఖండించారు. ఆయన వ్యాఖ్యలతో, అభిప్రాయాలతో పార్టీకి ఎంతమాత్రం సంబంధం లేదని ప్రకటించారు. అంతేకాక దిగ్విజయ్ సింగ్‌ను పరోక్షంగా మందలించారు. భద్రతా బలగాలు తమ విధులను అత్యంత సమర్థంగా నిర్వహిస్తున్నాయని, ఇందులో రెండో మాటకు తావులేదని స్పష్టీకరించారు. దీనికి సంబంధించిన ఎలాంటి సాక్ష్యాధారాలు చూపనవసరం లేదని పేర్కొన్నారు. ఆయన అభిప్రాయాలతో తాను గానీ, పార్టీ గానీ ఎంతమాత్రం ఏకీభవించడం లేదన్నారు. తద్వారా రాహుల్ నష్ట నివారణ చర్యలు చేపట్టారు.

రాహుల్ వ్యాఖ్యలు కచ్చితంగా స్వాగతించదగ్గవే. ఇందులో సందేహమేమీ లేదు. కానీ దిగ్విజయ్ వ్యాఖ్యలను 2016లోనే ఆయన ఎందుకు ఖండించలేదు. అప్పట్లో మౌనంగా ఉన్న నేత ఇప్పుడు ఎందుకు హడావుడి చేస్తున్నారు. నాటి, నేటి వ్యాఖ్యలను ఖండించడానికి ఇంత సమయం ఎందుకు తీసుకోవలసి వచ్చిందన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ విషయాన్నే అధికార భారతీయ జనతా పార్టీ సూటిగా ప్రశ్నించింది. దిగ్విజయ్ వ్యాఖ్యలు చేసే నాటికీ, ఇప్పటికీ పరిస్థితిలో వచ్చిన మార్పేమీ లేదని, ఇప్పటికిప్పుడు ఖండించాల్సిన అవసరం ఏమొచ్చిందన్న బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ సూటి ప్రశ్నకు రాహుల్ నుంచి మౌనమే సమాధానంగా వచ్చింది. దిగ్విజయ్ వ్యాఖ్యలపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో నష్ట నివారణ చర్యల నేపథ్యంలో భాగంగా స్వయంగా రాహుల్ రంగంలోకి దిగవలసి వచ్చిందన్న అభిప్రాయాలు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

మరోవైపు దిగ్విజయ్ సింగ్ కూడా నష్టనివారణ చర్యలు చేపట్టారు. తన వ్యాఖ్యలు ప్రభుత్వాన్ని ఉద్దేశించి చేసినవని, సైన్యానికి సంబంధించినవి కావని వివరణ ఇచ్చారు. సైన్యం అంటే తనకు అత్యంత గౌరవం ఉందని, దాని చిత్తశుద్ధి, విశ్వసనీయత, పోరాటపటిమపై సంపూర్ణ విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం నిజాలను తొక్కిపెడుతోందని, వాస్తవాలను వెలుగులోకి రానీయకుండా అర్ధసత్యాలను ప్రచారం చేస్తుందన్న విషయంలో రెండో అభిప్రాయం లేదన్నారు.

సర్జికల్ దాడులకు సంబంధించి ఒక్కసారి గతంలోకి వెళితే వాస్తవాలు బోధపడతాయి. సెప్టెంబర్ 29, 2016న పాక్ ఆధీనంలోని కశ్మీరులో నియంత్రణ రేఖ వెంబడి లాంచ్ ప్యాడ్‌లపై భారత సైన్యం దాడులు




దిగ్విజయ్ వ్యాఖ్యలపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వినిపించాయి. సహజంగానే కేంద్ర ప్రభుత్వం తీవ్రంగానే స్పందించింది. దిగ్విజయ్ వ్యాఖ్యలను దీటుగా తిప్పికొట్టింది. మాజీ సైనికాధికారులు కూడా ఖండించారు. ఆర్మీ మాజీ చీఫ్ వేద్ ప్రకాశ్ మాలిక్, ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) రఘునాథ్ నంబియార్ స్పందించారు. దాడులపై అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదని, వాస్తవాలను సంపూర్ణంగా తెలుసుకుని మాట్లాడాలని వారు సూచించారు.

# బరితెగింపు!

నిర్వహించింది. ఈ సందర్భంగా పాక్‌కు గణనీయ నష్టం వాటిల్లినట్లు సైన్యం పేర్కొంది. పాక్ తీవ్రవాద క్యాంపులను ధ్వంసం చేసింది. వాటిపై దాడులు చేయడం ద్వారా నిర్వీర్యపరిచింది. దాదాపు 35 నుంచి 70 మంది వరకు పాక్ వైపున ప్రాణనష్టం వాటిల్లినట్లు తెలియజేసింది. దీనిని సహజంగానే పాక్ తిరస్కరించింది. తమ సైనికులు ఇద్దరే మరణించారని, 9 మంది గాయపడ్డారని తెలిపింది. అదే సమయంలో 8 మంది భారతీయ సైనికులు మరణించారని, ఒకరు తమ నిర్బంధంలో సైన్యంలో కనిపించిందని, దీంతో వారికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు.

**సైనిక అధికారుల ఖండన..**

దిగ్విజయ్ వ్యాఖ్యలపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వినిపించాయి. సహజంగానే కేంద్ర ప్రభుత్వం తీవ్రంగానే స్పందించింది. దిగ్విజయ్ వ్యాఖ్యలను దీటుగా తిప్పికొట్టింది. మాజీ సైనికాధి కారులు కూడా ఖండించారు. ఆర్మీ మాజీ చీఫ్ వేద్ ప్రకాశ్ మాలిక్, ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) రఘునాథ్ నంబియార్ స్పందిం




ఉన్నట్లు పేర్కొంది. భారత దళాలు నియంత్రణ రేఖను దాటలేదని, సరిహద్దు వద్ద ఎదురుకాల్పులు మాత్రమే జరిగాయని వివరించింది. అంతకు ముందు కశ్మీరులోని ఉరి సెక్టారు వద్ద సెప్టెంబర్ 18న పాకిస్తాన్‌లోని ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్‌కు చెందిన ఉగ్రవాదులు 19 మంది భారత సైనికులను హతమార్చారు. దీనికి ప్రతీకారంగా భారత సైనికులు సెప్టెంబర్ 29న నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ– లైన్ ఆఫ్ కంట్రోల్)ను దాటి పాకిస్తాన్ తీవ్రవాద శిబిరాలు, సైనిక శిబిరాలపై భారీ దాడులు జరిపారు. మన దళాలు నియంత్రణ రేఖను దాటి విధ్వంసాలకు దిగాయని సాక్షాత్తు భారత్ ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఉరి ఘటన తరవాత పాక్ దాడికి ప్రతీకారం తీర్చుకోవాలన్న పట్టుదల భారతీయ చారు. దాడులపై అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదని, వాస్తవాలను సంపూర్ణంగా తెలుసుకుని మాట్లాడాలని వారు సూచించారు. 2016తో పాటు 2019లోనూ పాక్ సైన్యం బరితెగింపునకు దిగింది. ఆ ఏడాది ఫిబ్రవరి 14న పుల్వామా ఉగ్రదాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ (సెంట్రల్ రిజర్వు ఫోర్స్) జవాన్లు మరణిం చారు. ప్రతీకారంగా భారత వైమానిక దళానికి చెందిన ఫైటర్ జెట్‌లు పాకిస్తాన్‌లోని బాలాకోట్‌లోని జైషే మహమ్మద్‌కు చెందిన అధునాతన టెర్రర్ లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేశాయి. వాస్తవాలు ఇలా ఉండగా దిగ్విజయ్ సింగ్ వంటి సీనియర్ నేత మాట్లాడిన మాటలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైనవి. ఈ వ్యాఖ్యలు ఆయనతో పాటు పార్టీకి కూడా నష్టమే.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**



ఆయన ఎత్తు రెండు అడుగులకు మించదు. అలా అని మరుగుజ్జు కాదు. జన్మతః ఫ్లోరోసిస్ బాధితుడు. తనంతట తాను కాళ్లు, చేతులు కదపలేడు. తెలంగాణలో.. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ అనగానే వెంటనే స్ఫురించే పేరు. ఆయన ఉమ్మడి నల్గొండ జిల్లా మర్రిగూడెం మండలం శివన్నగూడెం వాసి అంశాల స్వామి. చెల్లెళ్లిద్దరు ఇదే వ్యాధితో చిన్న వయస్సులోనే కన్నుమూశారు. తమ ప్రాంతంలో తీవ్రంగా ఉన్న ఫ్లోరిన్ సమస్య మరెవ్వరికి కడపు కోత పెట్టకూడదనే అశయంతో ఫ్లోరోసిస్ విముక్తి కోసం చిన్నతనం నుంచే ఉద్యమించారు. జలసాధన సమితితో కలిసి ఈ అంశాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లారు. ఆయన పోరాటం

## 'భగీరథ' స్ఫూర్తిప్రదాత ఫ్లోరోసిస్ 'స్వామి'

ప్రధానులనే కదలించింది. 2003లో అప్పటి ప్రధాని వాజ్‌పేయిని కలిశారు. ఆయన ఎదురుగా ఉన్న టేబుల్‌పై నిలిచి, ఫ్లోరైడ్ తీవ్రతను వివరించడంతో స్పందించిన ప్రధాని, దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని నాటి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అనంతర కాలంలో కిరణ్‌కుమార్ రెడ్డి వేసిన ప్రత్యేక కమిటీకి 'కృష్ణాజలాల సరఫరాతోనే ఫ్లోరైడ్ సమస్య పరిష్కార మవుతుంద'ని తేల్చిచెప్పారు. కృష్ణా జలాల కోసం 'సొరంగం తవ్విపెట్టు–నల్గొండకు బువ్వపెట్టు' నినాదంతో చక్రాల కుర్చీలో 73 గ్రామాలలో సుమారు 150 కిలోమీటర్ల యాత్ర నిర్వహించారు. స్వామి ఉద్యమం కారణంగానే, ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తరువాత ఇది 'తెలంగాణ (భారత) రాష్ట్ర సమితి ఎన్నికల ప్రణాళిక' కీలక అంశమైంది. 'మిషన్ భగీరథ' ద్వారా ఫ్లోరోసిస్ రహిత శుద్ధి చేసిన నీరు అందించాలన్న దృఢ సంకల్పానికి అంశాల స్వామి ఉద్యమమే ప్రేరణగా నిలిచిందని ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. పదుల కొద్దీ గ్రామాలు చుట్టి రావడానికి సాధనమైన మూడు చక్రాల వాహనమే అంశాల స్వామికి ప్రాణాంతకమైంది. కొత్తగా కొనుగోల చేసిన ఎలక్ట్రానిక్ త్రిచక్రవాహనంపై నుంచి జనవరి 27న పడి తలకు తీవ్ర గాయంతో మరునాడు మరణించారు. ★

# పిటిషన్ వేసి

**తెలంగాణ ప్రభుత్వం మరోసారి న్యాయస్థానం ముందు బొక్కబోర్లా పడింది. దూకుడుగా వేసిన అడుగును వెనక్కి తీసుకుంది. అనాలోచిత నిర్ణయం తీసుకున్నట్లు పరోక్షంగా అంగీకరించింది కూడా. గవర్నర్‌కు ఇవ్వాల్సిన గౌరవం ఇస్తామని మాట ఇచ్చింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ఉంటుందని స్పష్టత ఇచ్చింది. న్యాయస్థానంలో తాను వేసిన పిటిషన్‌ను తానే ఉపసంహరించుకుంది.**

కోర్టులతో మొట్టికాయలు వేయించుకోవడం కేసీఆర్ ప్రభుత్వానికి కొత్త కాదు. రాష్ట్రం ఆవిర్భవించి, బీఆర్ఎస్ (పూర్వపు టీఆర్ఎస్) పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 8 సంవత్సరాల్లో ప్రభుత్వం పదులసార్లు న్యాయస్థానం చీవాట్లు తినాల్సి వచ్చింది. ఇటీవలి కాలంలో ఈ పరిస్థితి తగ్గింది గానీ, మొదట్లో అనేక అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పద మయ్యాయి. ఆ సందర్భాల్లో కోర్టు మెట్లెక్కిన ప్రతిసారీ ప్రభుత్వానికి చుక్కెదురైంది.

తాజా పరిణామాలను గమనిస్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసలు న్యాయస్థానం మెట్లెక్కాల్సిన అవసరమే లేదు. కానీ, తనకు తానే కోర్టుకు వెళ్లి లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. రాజకీయంగా చర్చను లేవనెత్తేలా చేసింది. చివరకు మనసు మార్చుకుంది. చర్చలకు వెళ్లింది. అవతలి వాళ్లు పెట్టిన డిమాండ్లకు సరేనంది. జడ్జి ముందు పిటిషన్‌పై విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. అలా.. కోర్టుకు వెళ్లి మరీ ఒకరకంగా తన పొరపాటును తానే అందరికీ తెలిసేలా చేసింది.

సుమారు యేడాదిన్నర కాలంగా రాష్ట్రంలో రాజ్‌భవన్ వర్సెస్ ప్రగతి భవన్ అన్నట్లుగా పరిస్థితి తయారయ్యింది. అయితే, ప్రతిసారీ ప్రగతి భవన్ నుంచి అవమానాలు ఎదురవడం, గవర్నర్ సర్దుకుపోవడం జరుగుతున్నాయి. ఈ పరిస్థితులపై తొలుత కొన్నాళ్లు మౌనంగా ఉన్న గవర్నర్.. తర్వాత బహిరంగంగా మాట్లాడటం మొదలుపెట్టారు. గవర్నర్ ఎక్కడికెళ్లినా ప్రభుత్వం ప్రొటోకాల్ పాటించక పోవడం, అధికారులు కూడా అంటీ ముట్టనట్లు వ్యవహరించడం, ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోవడం వంటివి చేసినా తమిళిసై ఏనాడూ అధికారులపైనా, ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పించలేదు. కానీ, రాను రాను సహాయ నిరాకరణ ఎక్కువ కావడంతో కేసీఆర్ లక్ష్యంగా పరోక్ష విమర్శలు చేశారు. అంతేకాదు, గతేడాది తన ప్రసంగం లేకుండానే రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టినా ఆమోదించారు. అయితే, ప్రభుత్వ వ్యవహారశైలిలో ఏమాత్రం మార్పు రాకపోవడంతో గవర్నర్ ఈసారి చిన్న ఝలక్ ఇచ్చారు. దీంతో, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం హైరానా పడింది. బడ్జెట్ ఆమోదం పొందకపోతే సర్కారును నడిపేదెట్లా? అనే సంశయంలో పడింది. ప్రభుత్వం పెద్దలకూ ఈ పరిణామం మింగుడు పడలేదు. చివరకు కోర్టు అంటూ ఓ అస్త్రాన్ని బయటకు తీశారు. అయితే, రాజ్యాంగ వ్యవస్థ గురించి ఆదేశాలు ఇవ్వలేమని న్యాయస్థానం విస్పష్ట వ్యాఖ్యలు చేసింది. చివరకు ప్రభుత్వమే నాలుక్కరుచుకుంది. పరోక్షంగా పొరపాటును అంగీకరించింది.

ఒకే ఒక్క ఝలక్‌తో గవర్నర్ తమిళిసై తన పంతం నెగ్గించుకున్నారు. మొన్నటికి మొన్న రిపబ్లిక్ డే వేడుకలు ప్రభుత్వమే నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో రాజ్‌భవన్‌లో పరేడ్ నిర్వహించి మరీ గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రభుత్వం నిర్వహించింది. తాజాగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ఉంటుందా? లేదా అనే సస్పెన్స్‌కు తెరపడింది. గవర్నర్ ప్రసంగంతోనే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

2023-24 రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి గవర్నర్ అనుమతి మంజూరు చేయకపోవడంతో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయడానికి అనుమతించాలంటూ ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం ముందు అడ్వొకేట్ జనరల్ అభ్యర్థించారు. దీనికి ధర్మాసనం అనుమతించడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతికుమారి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్. తుకారాంజీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

విచారణ సందర్భంగా న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. గవర్నర్ విధుల్లోకి తాము ఎలా జోక్యం చేసుకోవాలని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వం తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపిస్తూ న్యాయసమీక్షకు అవకాశం ఉందని, ఇదే విషయాన్ని షంషేర్ సింగ్ వర్సెస్ పంజాబ్ కేసులో ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం స్పష్టత ఇచ్చిందన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 200 ప్రకారం ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ ప్రవేశపెట్టడం ప్రభుత్వ బాధ్యత అని, దాన్ని గడువులోగా సమర్పించాల్సి ఉందన్నారు. దీనికి గవర్నర్ ఆమోదం తెలపాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి 3న బడ్జెట్ ప్రవేశపెట్టడానికి గవర్నర్ ఆమోదం తెలియజేయాల్సి ఉందని, బడ్జెట్ ప్రవేశపెట్టడం, చర్చలు, సవరణలు అన్నీ మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. బడ్జెట్ అంచనాలను జనవరి 21వ తేదీన గవర్నర్ కార్యాలయానికి పంపామని, 26వ తేదీన ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గవర్నర్‌ను కలిశారని దవే కోర్టుకు తెలిపారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి



సుజాత గోపగోని, 6302164068

# పశ్చాత్తాపం!



గవర్నర్ ఆమోదం తెలపకపోవడంతో జనవరి 27వ తేదీన ఆర్థిక మంత్రి గవర్నర్‌కు లేఖ రాయగా దీనికి ప్రతిగా గవర్నర్ సచివాలయం నుంచి ప్రభుత్వానికి లేఖ అందిందన్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు గవర్నర్ ప్రసంగం ఉంటుందా? లేదా? ఉంటే డ్రాఫ్ట్ ప్రసంగాన్ని పంపాలని కోరారన్నారు. గవర్నర్ ఆమోదం తెలపకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు.

వాదనల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కార్యాలయానికి కనీస గౌరవం ఇవ్వడం లేదని గవర్నర్ తరఫు సీనియర్ న్యాయవాది అశోక్ ఆనంద్‌కుమార్ తెలిపారు. అంతేకాకుండా ఒక ఎమ్మెల్యే గవర్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రభుత్వం రాసిన లేఖపై స్పందించామని, దీనిపై వివరణ కోరితే ఎలాంటి సమాధానం ఇవ్వలేదన్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సంప్రదాయబద్ధంగా గవర్నర్ ప్రసంగం ఉంటుందా లేదా అని అడిగితే సమాధానం లేదన్నారు. రాజ్‌భవన్ తరఫు న్యాయవాది ఈ అంశాలను లేవనెత్తిన సమయంలో ప్రభుత్వ సీనియర్ న్యాయవాది కూడా పొరపాటును అంగీకరించారు.

ఇక, ఇరు వర్గాల న్యాయవాదుల వాదనలను విన్న ధర్మాసనం.. ఇలాంటి వివాదాల్లో కోర్టుకు పరిమిత అధికారాలుంటాయని వ్యాఖ్యానించింది. ఇది రెండు రాజ్యాంగ వ్యవస్థల మధ్య వివాదమని, మీరే సొంతంగా చర్చించుకుని రావాలంది. భోజన విరామ సమయంలో ఒక గంట గడువు ఉందని, ఈ సమయంలో చర్చించుకుని ఫలవంతమైన చర్చతో రావాలని సూచించింది. భోజన విరామం అనంతరం విచారణ సందర్భంగా చర్చల వివరాలను ప్రభుత్వ న్యాయవాది వివరించారు. అసెంబ్లీకి రావాలంటూ సంబంధిత మంత్రి గవర్నర్‌కు ఆహ్వానం పలకడంతోపాటు, ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగ ప్రతిని అందజేస్తారన్నారు. దీన్ని సమావేశాల్లో చదవడానికి గవర్నర్ ఆమోదించారని తెలిపారు. అదేవిధంగా అసెంబ్లీ సమావేశాల్లో పెండింగ్ బిల్లులకు ఆమోదం తెలపాల్సి ఉందన్నారు. పెండింగ్ బిల్లులపై ఏవైనా సందేహాలుంటే సంబంధిత శాఖ మంత్రి, అధికారుల వివరణ తీసుకుని బిల్లులను క్లియర్ చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ఇరు పక్షాల మధ్య అంగీకారం కుదిరినందున కోర్టు నుంచి ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని, పిటిషన్‌పై విచారణను మూసివేయాలని కోరారు. ఇరు పక్షాల మధ్య కుదిరిన సంధిని నమోదు చేసిన ధర్మాసనం పిటిషన్‌పై విచారణను ముగించింది.

అయితే, తాజా పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి మరో షాక్ తగిలినట్లయ్యింది. ముఖ్యంగా రాజ్‌భవన్ విషయంలోనే దెబ్బ మీద దెబ్బలు పడుతున్నాయి. గవర్నర్ తీరును ఎత్తి చూపాలని తలచిన ప్రభుత్వానికి ఇది ఊహించని పరిణామమే అంటున్నారు విశ్లేషకులు. ఇక చేసేదేమీ లేక అనివార్యంగా గవర్నర్ ప్రసంగాన్ని ఉండేలా చూస్తామంటూ హైకోర్టుకు చెప్పాల్సి వచ్చింది. అసలు గవర్నర్‌పై లంచ్ మోషన్‌లో పిటిషన్ వేయడమే తప్పని నిపుణులు వివరిస్తున్నారు. ముందుగా పిటిషన్ వేయడమెందుకు, ఆనక నాలుక కరుచుకోవడమెందుకంటూ తప్పుపడుతున్నారు.

రాజ్‌భవన్, ప్రగతిభవన్ మధ్య కుదిరిన ఈ సంధి ఎంతకాలం కొనసాగుతుందనే చర్చ కూడా జరుగుతోంది. ప్రతిసారి గణతంత్ర ఉత్సవాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, దానికి సీఎం, మంత్రులు రావడం లేదని రాజ్‌భవన్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. మొన్న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఎం, మంత్రులెవరూ అటువైపు కన్నెత్తి చూడలేదు. గవర్నర్ విషయంలో అనుసరించాల్సిన ప్రొటోకాల్‌ను కూడా ప్రభుత్వం పాటించడం లేదు. వరదల సమయంలో కొత్తగూడేనికి, మరో సందర్భంలో నాగర్‌కర్నూల్ చెంచుగూడేలలో గవర్నర్ పర్యటనలకు వెళ్లినప్పుడు ప్రభుత్వం ప్రొటోకాల్ పాటించలేదన్న ఆరోపణలున్నాయి. యాదాద్రి ఆలయ సందర్శనకు వెళ్లినప్పుడు కూడా అధికారులు ఆమెకు స్వాగతం పలకలేదు. మరి భవిష్యత్తులో ఇలాంటి ప్రొటోకాల్ పొరపాట్లు లేకుండా ప్రభుత్వం చూసుకుంటుందా? అన్నది తేలాల్సి ఉంది.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**



క్రైస్తవ, ముస్లిం ధార్మిక సంస్థల పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోని ప్రభుత్వం, దేవాదాయ చట్టాన్ని అడ్డుపెట్టుకుని తమ ఆలయాలు, మఠాల అంతర్గత పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించడాన్ని హిందూ ధార్మిక సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. తమ ప్రతినిధులుగా వున్న ఈవోల ద్వారా మఠాలు, దేవస్థానాల ఆస్తులు, ఆదాయ వ్యవహారాలపై అజమాయిషీ చేసి వాటి ఆదాయాన్ని చిత్తం వచ్చిన విధంగా ఖర్చు చేయడం, తమ అనుచరులకు అనుచిత లబ్ధి కలిగించడం, మత ధర్మాలపై నియంత్రణే లక్ష్యంగా ప్రభుత్వం ఇలాంటి వ్యవహారాలు నడుపుతోందని ఆరోపిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని దేవస్థానాల పాలక మండళ్లను తన అనుచరగణంతో నింపేసి, ఆదాయాన్ని దారి మళ్లిస్తూ, దేవస్థానాల ఆస్తులను మింగేసే ప్రయత్నం చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వాలపై ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఉన్న కాస్త హద్దును చెరిపేసి మరింత దూసుకు వెళుతోంది.

# ఆలయాలపై ప్రభుత్వ

తమ అజమాయిషీ కిందకు రాని దేవస్థానాలు, మఠాలను కూడా నియంత్రించేలా ప్రభుత్వం కార్యనిర్వహణ అధికారులను నియమిస్తోంది. దాంతో వాటి నిర్వహణపై వందల ఏళ్ల నుంచి హక్కు గల మఠాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించి విజయం సాధిస్తున్నాయి. అహోబిలం మఠం వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉన్నత న్యాయస్థానం చేతిలో భంగపడిన విషయం తెలిసిందే. హైకోర్టులో ఓడి సుప్రీం కోర్టుకు వెళ్లిన రాష్ట్ర ప్రభుత్వానికి అక్కడా చుక్కెదురైంది. అహోబిలం అంశంపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని వ్యతిరేకిస్తూ దాఖలయిన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆలయం ఉన్న అహోబిలం గ్రామంలో వీసమెత్తు మౌలిక సదుపాయాలు కల్పించని రాష్ట్ర ప్రభుత్వం ఆలయ నిర్వహణ పనుల్లో మాత్రం జోక్యానికి అత్యుత్సాహం ప్రదర్శించడం ఆస్తుల దారి మళ్లింపునకే అని హిందూ ధార్మిక సంస్థలు ఆరోపిస్తున్నాయి.

**అహోబిలం పవిత్రక్షేత్రం**

పూర్వ కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలం నవనారసింహ క్షేత్రం. ఇది ముఖ్యంగా వైష్ణవ యాత్రికులకు పవిత్ర పుణ్యక్షేత్రం. 108 దివ్యదేశాల్లో ఒకటి. తిరుమల క్షేత్రానికి ఉన్న ప్రాశస్త్యం దీనికి ఉంది. ఈ దేవస్థానాన్ని అహోబిల మఠం పర్యవేక్షిస్తుంది. ఈ మఠాన్ని క్రీ.శ.1400లో దేశిక వడగళై సంప్రదాయాన్ని అనుసరించి స్థాపించారు. ఇది హిందూ యాత్రికులకే కాక, పర్యాటక కేంద్రంగా, కొండలు, నదులు, ప్రకృతితో ప్రసిద్ధికెక్కింది. పురాణ ప్రసిద్ధిగాంచిన అహోబిలాన్ని 'అహోబలం' అనీ వ్యవహరిస్తారు. నరసింహుడి బలాన్ని, శక్తిని దేవతలు ప్రశంసించడం వల్ల 'అహోబల'మైనది. ఎగువ అహోబిలంలో ప్రహ్లాదుని తపస్సుకు మెచ్చిన నరసింహుడు స్వయంభువుగా బిలంలో వెలిశాడు. అందువల్ల అహోబిలం అని కూడా పిలుస్తారు. నరహరి తన అవతారాన్ని భక్తుల కోసం తొమ్మిది ప్రదేశాలలో ప్రకటించాడు కనుక నవనారసింహక్షేత్రం అని పేరువచ్చింది.

అహోబిలం మఠం, దేవస్థానం రెండూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నాయి. మఠానికి సంబంధించిన ప్రధాన కార్యాలయం తమిళనాడులో ఉంది. దేశంలోని చాలా దేవాలయాల పరిపాలనను మఠం చూస్తోంది. పరంపరగా వస్తున్న జీయర్లు/మఠాధిపతులు దేవస్థానానికి ట్రస్టీలుగా వ్యవహరిస్తున్నారు. ఈ దేవస్థానానికి చెందిన ఆలయాల నిర్వహణ మఠాధిపతులే చూస్తున్నారు. ఈ నేపథ్యంలో అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి 2020 డిసెంబరులో ప్రభుత్వం కార్యనిర్వహణ అధికారిని నియమించింది. ఈ నియామకానికి దేవాదాయ శాఖ కమిషనర్‌కి గల అధికారాన్ని ప్రశ్నిస్తూ అహోబిలానికి కేబీ సేతురామన్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అలాగే అహోబిలం మఠాధిపతి తరపున సంపత్ శఠగోపన్ (జీపీఏ హోల్డర్) మరో వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు శ్రీధరన్, డబ్ల్యు.శ్రీనివాస్ వాదనలు వినిపించారు. మఠం అధీనంలో నడిచే దేవస్థానానికి ఈవోను నియమించే అధికారం ప్రభుత్వానికి చట్టం కల్పించలేదన్నారు. ఈవో నియామకాన్ని రద్దు చేయాలని కోరగా, ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ ఏ దేవస్థానమైనా సంబంధిత రాష్ట్ర దేవాదాయ చట్టానికి లోబడే నడుచుకోవాల్సిందేనని, అహోబిలం మఠం వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదన్నారు. కేవలం దేవస్థానం పరిపాలన వ్యవహారాలను నియంత్రిస్తుందని వివరించారు.


అహోబిలం ఆలయం

**మఠానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు**

ఇరువాదనల విన్న హైకోర్టు ప్రధాన న్యాయ

# పెత్తనం ఏమిటీ?



తురగా నాగభూషణం

మూర్తి జస్టిస్ ప్రశాంతకుమార్ మిశ్రా, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం 2022 అక్టోబరు 13న తీర్పు ఇచ్చింది. ఒకప్పుడు అహోబిలం మఠం, దేవస్థానం రెండూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉండేవని, మఠానికి సంబంధించిన ప్రధాన కార్యాలయం తమిళనాడులో ఉందని దేశంలోని చాలా దేవాలయాల పరిపాలనను మఠం చూస్తోందని పేర్కొంది. మఠం, దేవస్థానంలో వేర్వేరు ఆచారాలు, సంప్రదాయాలు పాటిస్తున్నారని చెప్పడానికి ప్రభుత్వం వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, అందువల్ల దేవస్థానం రాష్ట్రంలో ఉన్నందున ఏపీ దేవాదాయ చట్టం వర్తిస్తుందన్న ఏజీ వాదన చెల్లుబాటు కాదని తెలిపింది. 'చారిత్రక శిలా శాసనాలు, సాహిత్య ఆధారాలను పరిశీలిస్తే దేవస్థానాన్ని మఠాధిపతులే ప్రారంభించారు. పరిపాలనా వ్యవహారాలు వారే చూస్తున్నారు. దేవాదాయ చట్టం ప్రకారం కొన్ని సందర్భాల్లో మాత్రమే మఠం వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోగలదు. దేవాలయం నిర్వహణ సరిగ్గా లేనందున ఈవో నియామకం చేపట్టాల్సి వచ్చిందని చెప్పేందుకు ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు చూపలేదు. అహోబిలం మఠంలో దేవస్థానం అంతర్భాగం. వాటిని వేర్వేరుగా చూడలేం. మఠంతో దేవస్థానాన్ని వేరుచేసి పరిపాలన వ్యవహారాలు చూసేందుకు ఈవోను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు' అని న్యాయస్థానం తెలిపింది. ఈవో నియామకం జీయర్, మఠాధిపతుల పరిపాలన పరమైన హక్కులపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. ఇది రాజ్యాంగంలోని అధికరణ 26(డి)ని ఉల్లంఘించ డమేనని చెప్పింది. ఈ నేపథ్యంలో దేవస్థానానికి ఈవోను నియమిస్తూ 2020 డిసెంబరు 30న దేవాదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను కొట్టివేసింది. దేవస్థానం పాలనా వ్యవహారాలు, బ్యాంకు ఖాతాల నిర్వహణలో ఈవో జోక్యం చేసుకోవడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఆ ఖాతాల నిర్వహణ విషయంలో జీయర్/మఠాధిపతికి ఉన్న అధికారాన్ని పునరుద్ధరించింది.

## సుప్రీం కోర్టులోనూ భంగపాటు

ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వెనక్కి తగ్గలేదు. హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఇక్కడా ప్రభుత్వానికి ఎదురు దెబ్బతగిలింది. 'అహోబిలం మఠం పరంపర అధీన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం' (అహోబిలం మఠం దేవాలయం) కార్యనిర్వాహక అధికారిని నియమించేందుకు చట్ట ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎలాంటి అధికారం, లేదా హక్కులేదని న్యాయమూర్తులు ఎస్.కె. కౌల్, ఎ.ఎస్.ఓకాతో కూడిన ధర్మాసనం 2023 జనవరి 27న స్పష్టం చేసింది. మఠం సాధారణ కార్యకలాపాలతో ప్రభుత్వానికి ఏమి సంబంధం? మఠాన్ని ఎందుకు చేజిక్కించుకోవాలనుకుంటున్నారు? అని ప్రశ్నించింది. ఆలయాలు, ధార్మిక క్షేత్రాలను ధర్మకర్తలకే వదిలి వేయాలని, వాటిలో జోక్యం చేసుకోవద్దని ఆదేశించింది. ఆలయ నిర్వహణను 'ధర్మకర్తలకే వదిలేయాలి' అని పేర్కొంది.

## హిందూ ధర్మంపై నియంత్రణ ఎందుకు?

ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి హిందూ ధర్మాన్ని నియంత్రించాలని చూస్తోంది. తమ ప్రభుత్వం ఏర్పడటానికి సహకరించినట్లు భావిస్తూ అతివాద క్రైస్తవ, ముస్లింలకు అనుకూలంగా వ్యవహరిస్తూ హిందూ ధర్మాన్ని అవమానిస్తున్నట్లు హిందూ సంస్థలు, భారతీయ జనతాపార్టీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోని పలు దేవాలయాలను, విగ్రహాలను ధ్వంసం చేయడం, రథాల దహనాన్ని వ్యతిరేకిస్తూ, బీజేపీ ఆందోళన చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం డిపాజిట్లను ప్రభుత్వం ఖాతాల్లోకి మళ్లించేందుకు చేసిన ప్రయత్నాన్ని బీజేపీ తిప్పికొట్టింది. తితిదే బోర్డులో నేరచరిత్ర గల వారిని నియమించడాన్ని కూడా హిందూ సంఘాలు కోర్టులో సవాలు చేసి విజయం సాధించాయి. మూడున్నరేళ్లలో ఈ ప్రభుత్వం వల్ల హిందువులకు జరిగిన అవమానాలు, మతమార్పి డులు, ఇతర చేదు అనుభవాలు, సంఘటనలను బట్టి హిందూ ఆలయాలను ధార్మిక సంస్థలుగా కాక ఆదాయ వనరుగా చూడటం, రాజకీయ పదవులకు వేదికగా పాలక మండలిని భావించినట్లు హిందూ ధార్మిక సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను ఏ మాత్రం పట్టించుకుంటూ, ఆలయాలు, భక్తుల పట్ల శ్రద్ధ వహించకపోవడాన్ని రాజకీయపార్టీలు కూడా తప్పుపడుతున్నాయి. హైకోర్టు ఆదేశించినా మరలా సుప్రీం కోర్టుకు వెళ్లి తమ ప్రతినిధులను నియమించుకోవడానికి ప్రయత్నించడం ఏ రకంగా అర్థం చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు.

## పెత్తనయత్నమేనా!! సౌకర్యాలేవీ?

అహోబిలం వంటి గొప్ప చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం గల క్షేత్రంలో అవసరమైన సౌకర్యాలు కల్పించడం లేదని భక్తులు విమర్శిస్తున్నారు. అసలు ఈ క్షేత్రంలో పారిశుద్ధ్యం, రహదారుల నిర్వహణను తీవ్ర లోపాలుగా భావించవచ్చు. నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే ఈ క్షేత్రం మురికిగా చెత్త చెదారంతో, పందుల సంచారంతో, బురద గుంటలతో ఉంది. రోడ్లయితే పరమదారుణంగా ఉన్నాయి. గ్రామంలోని మట్టి రోడ్ల సైడు కాల్వలు లేక వాడుకనీరు ప్రవహించిన గుంటలు దోమలతో దుర్గంధాన్ని వెదజల్లుతూ అనారోగ్య పరిస్థితులు తలపిస్తున్నాయి. వీధులను శుభ్రం చేసిన పరిస్థితులు లేవు. మంచినీటి వసతులు లేవు. భక్తుల కోసం నిర్మించిన వసతి భవనాల వద్ద తీయకుండా వదిలేసిన చెత్త, వాటి మధ్య పొర్లుతున్న కోతులూ, పందులు, కుక్కలతో దారుణంగా ఉంది. గ్రామ నిర్వహణ ఇంత అధ్వాన్నంగా ఉన్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక ఆళ్లగడ్డ వైపు నుంచి దేవస్థానం వెళ్లే రహదారిని బట్టి రాష్ట్రంలోని రహదార్ల పరిస్థితిని ఊహించవచ్చు. తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు నిత్యం వందలాది వాహనాలలో ఈ మార్గంలో వస్తుంటారు. దేవస్థానికి రహదారులు, గ్రామంలో రోడ్లు, పారిశుద్ధ్యం, భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించడంలో ముందుకు రాని ప్రభుత్వం, ఆలయంపై అజమాయిషీకి మాత్రం సిద్ధమంటోంది.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

ఇరువాదనల విన్న హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ప్రశాంతకుమార్ మిశ్రా, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం 2022 అక్టోబరు 13న తీర్పు ఇచ్చింది. ఒకప్పుడు అహోబిలం మఠం, దేవస్థానం రెండూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉండేవని, మఠానికి సంబంధించిన ప్రధాన కార్యాలయం తమిళనాడులో ఉందని దేశంలోని చాలా దేవాలయాల పరిపాలనను మఠం చూస్తోందని పేర్కొంది. మఠం, దేవస్థానంలో వేర్వేరు ఆచారాలు, సంప్రదాయాలు పాటిస్తున్నారని చెప్పడానికి ప్రభుత్వం వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, అందువల్ల దేవస్థానం రాష్ట్రంలో ఉన్నందున ఏపీ దేవాదాయ చట్టం వర్తిస్తుందన్న ఏజీ వాదన చెల్లుబాటు కాదని తెలిపింది.



# శక్తిమంత రాక్షస యోధుడు ప్రహస్తుడు

రామాయణంలో యుద్ధకాండలో ప్రహస్తుడి పాత్ర వస్తుంది. రావణుడి ఏడుగురు కుమారులలో ఒకడు. రావణుని సేనాధిపతి. తరువాత మహాభారతంలో పురోచనుడిగా దుర్యోధనుని నమ్మకమైన సహాయకుడిగా, లాక్షా గృహ సంఘటనకు కారణమైన వాడిగా పునర్జన్మ పొందాడు. ప్రహస్తుడు నీలుడి చేతిలో మరణిస్తాడు (కొన్ని గ్రంథాలలో లక్ష్మణుడి చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్నాడని ఉన్నది.) లంకానగరపు నాలుగు ప్రముఖ ద్వారాలు, నలుగురి అధీనంలో ఉంటాయి. తూర్పు ద్వారం ప్రహస్తుడి, దక్షిణ ద్వారం మహోదరుడి, మహాపార్శ్వుడి, పడమర ద్వారం ఇంద్రజిత్తు, ఉత్తర ద్వారం రావణుడి అధీనంలో ఉంటాయి. ఎంతోమంది వానరులను సంహరించాక, ప్రహస్తుడు నీలుడి చేతిలో మరణిస్తాడు. అకంపనుడు కూడా మరణించాడని తెలిసిన రావణుడు, ప్రహస్తుని పిలిచి.. 'యుద్ధానికి ముందుకు వెళదామా వద్దా!' అని అడిగినప్పుడు, 'సీతను రాముడికి అప్పగించాలని అప్పుడే చెప్పినా మీరు కుదరదని చెప్పారు. ఇక యుద్ధమే జరుగుతున్నప్పుడు వెనకడుగు ఎందుకు? మీ కోసం నా ప్రాణాలైనా ఇస్తాను' అని యుద్ధానికి బయల్దేరతాడు. 'ధర్మాన్ని ఆశ్రయించాలి, ధర్మాన్ని ఆచరించాలి. సీతమ్మను అప్పగించాల'ని ప్రహస్తుడు ధర్మం చెప్పినా రావణుడు పెడచెవిన పెట్టాడు. 'రోగానికి మందు తెలిసినప్పటికీ, దానిని వాడకపోతే ప్రయోజనం ఏమీ లేనట్లు'గానే ధర్మ విచక్షణ ఉన్నా దానిని ఆచరించకపోతే ప్రయోజనం ఏమీ ఉండదు. ★




❄ 'మొక్క'బడి ❄

# ఆధ్యాత్మిక, ఆరోగ్యాల ఔషధం కర్పూరం

కర్పూరం అనేది మనకి తెలిసినంతవరకు సుగంధంగానూ, కొన్ని వంటకాలలోనూ, హిందువులు పూజా కార్యక్రమాలలో దేవునికి హారతి ఇవ్వడానికి ఉపయోగిస్తారు. ఇది మైనంలా తెల్లగా పారదర్శకంగా ఉండే ఘాటైన వాసన గల పూజాద్రవ్యం.

ఇది రసాయనాలతో కృత్రిమంగా తయారయింది అనుకుంటారు. చాలామంది. కానీ, కర్పూరం చెట్టు నుండి ఉత్పత్తి అవుతుంది అన్నది అక్షర సత్యం. కర్పూరాన్ని ఆ చెట్ల ఆకులు, కొమ్మల నుంచి తయారు చేస్తారు. కర్పూర చెట్ల కాండం మీద గాట్లు పెడతారు. ఆ గాట్ల లోంచి వచ్చే పాలతో కర్పూరం తయారౌతుంది. అలాగే కొన్ని రకాలైన తులసి (కర్పూర తులసి) జాతుల నుంచి కూడా దీనిని తయారుచేస్తారు. కర్పూరం చెట్టు వంద అడుగుల వరకూ పెరిగే సుందరమైన నిత్య హరిత వృక్షం. చక్కని సువాసన కలిగిన పట్ట (మట్ట) కలిగి ఉంటుంది. ఆకులు పొడవుగా ఉండి ఫిబ్రవరి, మార్చి నెలల్లో రాలతాయి. పువ్వులు చిన్నవిగా ఉంటాయి. పండ్లు ముదురు ఆకుపచ్చని రంగులో ఉండి అక్టోబర్‌లో పక్వానికి వస్తాయి. చైనా, జపాన్ దేశాల్లో ఈ చెట్లు విస్తారంగా పెరుగుతాయి. మన దేశంలో నీలగిరి కొండల్లో పెంచుతారు. మైసూర్, మలబార్ ప్రాంతంలోనూ కర్పూరం చెట్లు కనిపిస్తాయి.



కర్పూరంలో చాలా రకాలు ఉన్నాయి. ఒక్కో రకం ఒక్కో విధంగా ఉపయోగ పడుతుంది.

**పచ్చకర్పూరం:** కర్పూరం చెట్టు వేర్లు, మాను, కొమ్మలను నీళ్లలో వేసి మరిగించి, డిస్టిలేషన్ పద్ధతిలో సేకరించే దానిని పచ్చకర్పూరం

# నీకు నువ్వే ఆలోచించు



'డబ్బు లేని భక్తుడికి దూరం నుంచీ, డబ్బున్న వారికీ దగ్గర నుంచీ దర్శనమిస్తుంటావు కదా? ఇది న్యాయమేనా...?' అని ఒకడు ఏ మాత్రం వెరవకుండా దేవుడిని అడిగాడు. ఆతని మాటలకు దేవుడు విరగబడి నవ్వుతూ...

'అమ్మను మించిన దైవం లేదని చెప్పాను. కానీ నువ్వు మాత్రమే కాదు, చాలామంది అసలు అమ్మను పట్టించుకోరు. తండ్రిని మించిన మంత్రం లేదనీ చెప్పాను. కానీ నువ్వు వినిపించుకోలేదు. దేవుడు స్తంభంలోనూ ఉంటాడు. గోడలోనూ ఉంటాడని అని చెప్పాను. కానీ నువ్వేమిటీ..! చాలా మంది నా మాట నమ్మరు.

'పేదలకు సాయం చేయండి... అలా చేస్తే నాకు చేసినట్లే అవుతుందన్నాను. కానీ ఎక్కువ శాతం మంది పేదల వంక కన్నెత్తి కూడా చూడరు. మానవసేవే మాధవసేవ అనే మాట గుర్తు లేదా? నాకైన సమయాన్ని, నాకైన చోటుని, నాకైన పండుగల, నన్ను కొలిచే తీరును... అంతటిని మీరే నిర్ణయిస్తారు. అటువంటప్పుడు నేను నిన్ను చూడటం లేదని అనుకోవడం ఎంత వరకు సబబో నీకు నువ్వే ఆలోచించు... నన్ను చూడటానికి ఎంత డబ్బయినా ఖర్చు పెడుతుంటారు... ఇలా ఖర్చు పెట్టి చూస్తూ నన్నొక వస్తువులా మార్చేశారు.

ఈ స్థితిలో నన్ను నువ్వు ప్రశ్నించడం ఎంత వరకు సముచితమో ఆలోచించు...' అని బదులిచ్చాడు దేవుడు. ★

అంటారు. దీనిని ఔషధ ప్రయోగాలకు వాడుకోవచ్చు. దీనిని ఎక్కువగా వంటలలో వాడతారు. కాటుకని ఈ పచ్చ కర్పూరంతోనే చేస్తారు. అంజనం వేయడానికి కూడా దీనినే వాడతారు.

**హారతి కర్పూరం:** టర్పెన్‌టైన్ నుంచి రసాయనిక ప్రక్రియ ద్వారా తయారు చేసే కృత్రిమ కర్పూరాన్ని హారతి కర్పూరం అంటారు. దీనిని ఔషధ ప్రయోగాలకు వాడకూడదు.

**రస కర్పూరం:** చిన్న పిల్లలకి ఒంట్లో ఉన్న దోషాలు పోవడానికి ఆముదంతో కలిపి కర్పూరం పట్టిస్తారు. దానిని రసకర్పూరం అంటారు.

**భీమసేని కర్పూరం:** సహజంగా మొక్క నుంచి తయారుగా లభించే కర్పూరాన్ని భీమసేని కర్పూరం లేదా అపక్వ కర్పూరం అంటారు. దీనిని ఔషధ ఉపయోగాల కోసం విరివిగా వాడుతూ ఉంటారు. ఇవే కాక చాలా రకాల కర్పూరాలున్నాయి.

కర్పూరం వలన అసంఖ్యాకమైన ఆరోగ్య ఉపయోగాలు ఉన్నాయి. ఆయుర్వేద చికిత్సలో కర్పూరాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అసలు కర్పూర సువాసన పీల్చడంతోనే శారీరక రుగ్మతలన్నీ పోయినట్లు, సేద తీరినట్లు ఉంటుంది. మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

కొన్ని ముఖ్యమయిన ఆరోగ్య లాభాలు

స్వల్ప గుండె సమస్యలు, అలసట సమస్యలకు కొద్ది మొత్తం కర్పూరం వాడితే ఫలితముంటుంది. అన్ని రకాల ఆర్థరైటిస్, రుమాటిక్ నొప్పుల నివారిణిగా, నరాల సంబంధమైన సమస్యలు, వీపు నొప్పికి కూడా ఇది బాగా పనిచేస్తుంది.

పుండ్లు మానడానికి, పిల్లలకు గజ్జి, బొబ్బలు తగ్గడానికి, బ్రాంకయిటిస్, పలు రకాల ఇన్ఫెక్షన్లకు కర్పూరం ఉపయోగిస్తారు.

కర్పూరాన్ని పొడిచేసి, నోటిలో ఉంచుకొని లాలాజలాన్ని మింగుతుంటే అతి దప్పిక తగ్గుతుంది. కాలుష్యాన్ని పోగొట్టి, వాతావరణాన్ని స్వచ్ఛంగా మారుస్తుంది. అంటువ్యాధులు ప్రబలకుండా చేస్తుంది. కళ్లకు మేలు చేస్తుంది కనుకనే కాటుకలో దీనిని వాడతారు. జలుబును, కఫాన్ని తగ్గిస్తుంది.

మానసిక జబ్బులను సైతం పోగొడుతుంది.

రక్తాన్ని శుద్ధి చేసి రక్త ప్రసరణ సవ్యంగా ఉండేలా చేస్తుంది.

అలజడులు, ఆందోళనలు తగ్గించి ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ఇస్తుంది.

పురుగుల మందులు, చెడువాసనల నిర్మూలనకు, బట్టలను కొరికి తినే చెదపురుగులు, నిర్మూలనకు ఉపయోగిస్తుంటారు. ★

దేవరుషి నారదుడు.. వాల్మీకి వ్యాస శుకులకు మార్గదర్శనం చేయించిన ఘనుడు. 'దుఃఖానికి కారణ మేమిటి? అజ్ఞానం ఎలాంటిది? ఈ రెండింటిని వదిలించుకునే ఉపాయం ఏమిటి?' అని ఒక సంద ర్భంలో చింతాక్రాంతుడైన శుకుడుకి తరుణోపాయం చూపవలసిన అవసరం వచ్చింది నారద మహర్షికి. శుకయోగీంద్రుడి మనోగతం నారదుడికి బాగా అవగతమైంది. పరిష్కారం చూపించే బాధ్యత మీద పడింది.

**'శోకాస్తున సహస్రాణి భయాస్తసన శతానిచ దివసే దివసే ముధ మవినాశంతి పండితమ్'**

కుమారా! దుఃఖానికి వెయ్యి కారణాలు. భయానికి వంద కారణాలు. అవి ప్రతిరోజు ఎదురవు తూనే ఉంటాయి. పండితులు (జ్ఞానులు) వాటిని పాటించకూడదు.

**'మృతం వాయ దివానష్టం యో యతీత్మాను శోచతి దుఃఖేన లభతే దుఃఖ ద్వవన రథౌ పరప్యతే'**

గతాన్ని గురించి దినమంతా దిగులుపడే వాడు



## శుకునికి నారదుని మార్గదర్శనం

దుఃఖాన్ని రెండింతలు అనుభవిస్తాడు. వగచివగచి పగలంతా నష్టపోతూనే ఉంటాడు.

**'దుఃఖోపగతే శరీరే మానసే చాప్యుపస్థితే యస్మిన్ న శక్యతే కర్తుం యత్నస్తన్నను చింత్యయేత్'**

ఆపదలో శరీరం, మనసు కుంగుబాటుకు గురి అవుతాయి. ప్రయత్నం కలిసి రానప్పుడు చేయగలిగిం దంటూ లేదు. అందుచేత, దుఃఖపడడం కంటే జరిగిన పొరపాటును సరిదిద్దుకునే మార్గం గురించి ఆలోచించాలి.

పాప విమోచనకు పశ్చాత్తాపం పరమౌషధమని, చేసిన పొరపాటుకు క్షమాపణ చెప్పుకుంటే మనసు కుదుటపడుతుందంటారు. దుఃఖానికి, భయానికి మూలకారణం రాగం, ద్వేషం. అరిషడ్వర్గాలు వాటి సంతానం. వాటన్నిటి బారి నుంచి బయట పడడానికి తైత్తిరీయ ఉపనిషత్తు 'సత్యం వద.. ధర్మం చర' అని చెబుతున్నది. అసత్యం లోలోపల దహిస్తుంది. అధర్మం ఏదో ఒకరోజున బతుకును బజారున పడే స్తుంది. సత్యం ఉన్నచోట ధర్మం ఉంటుంది. అవి జంటపదాలు, జోడు గుర్రాలు. సత్మ ధర్మ పరాక్ర ముడిని భయం గానీ, దుఃఖంగానీ అంటుకోలేవు.

'నిరామయ'




7

నాలుగు రోజుల తర్వాత వంట చేసుకు నేందుకు ప్రయత్నిస్తున్న మిహిరుని మనసులో ఆలోచనలు వేగంగా కదలిపోతున్నాయి. "ప్రతిరోజు వంట చేయడానికి రెండు గడియల సమయం అవసరమవుతోంది. పదార్థాలేమో తినేందుకు కష్టంగా ఉంది. కాలమంతా వంటకే వెచ్చించడం చేత ఇంతవరకూ యవన గురువులను కలవనే లేదు. ఇక విద్యార్జన ఎట్లు? ప్రతి దినం పళ్లు తినడమే మేలా?"

అతని ఆలోచనా ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తూ మాటలు వినిపించాయి.

"మా ఇంట ఉండచ్చును కానీ భుజింపరాదు కాబోలు!"

ఖనా మాటలను విన్న మిహిరుడు ఆమె వంక చూడకుండానే సమాధానమిచ్చినాడు.

"అట్లా కాదు. స్వయంగా వండుకొని తినాలని నియమం".

"ఎవరా నియమం పెట్టినది? ఉల్లంఘిస్తే శిక్ష ఏమిటి?"

నియమం దాటవచ్చునా? పారసీక రాజ్యానికి వచ్చే ముందు ఈ విషయం ఆలోచించనే లేదు. భోజనం సమస్య కావచ్చునన్న ఊహ రాలేదు. సనాతన భారతీయ ధర్మాన్ని అనుసరించని వారింట భుజింపవచ్చునా? ఆపద్ధర్మంగా చేసిన పనులను ప్రాయశ్చిత కర్మ ఉండి ఉంటుంది. స్వగ్రామానికి వెళ్లిన తర్వాత జనకులే పరిష్కారం సూచించెదరు గాక.

మిహిరుని ఆలోచన పూర్తి కాకుండానే గృహ యజమాని అక్కడకు వచ్చి "మీరు మా ఇంటనే మాతో పాటు భోజనం చేయడం మాకు ఆనంద దాయకం" అని పిలిచాడు. మిహిరునికి వేరు మార్గం కనిపించలేదు.

మధ్యాహ్న సంధ్యావందనమైనాక భోజనశాలలో ప్రవేశించిన మిహిరుడు కూర్చుని తన విస్తరి చుట్టూ నీళ్లు తిప్పి ఆపోశనం పట్టాడు. గమనించిన ఖనా "మీకు కూడా నీరు పవిత్రమా?" అని అడిగింది.

మిహిరుడు ఆశ్చర్యంగా ఆమె వంక చూసి, అంతలోనే పరకాంతను పరికింప రాదని గుర్తుకు వచ్చి కళ్లు దించుకున్నాడు.

ఖనా తండ్రి "మీకు ఇదివరలోనే తెలియ చేసినాను కదా. మేము అగ్ని ఆరాధకులం. జలం కూడా మాకు పూజనీయమే" అన్నాడు.

మిహిరుడు "మీ గురించి కానీ, మీ రాజ్యంలోని ధర్మం గురించి కానీ నాకు తెలియదు" అన్నాడు.

గృహ యజమాని "ముందుగా నా గురించి ఇంతవరకూ మీకు చెప్పనందుకూ క్షంతవ్యుడను. నా పేరు డేరియస్? నేను వర్తకుడను. ప్రస్తుతం వర్తకమంతా నా కుమారులు నిర్వర్తిస్తున్నారు" అని చెప్పాడు. ఆపైన వారి నమ్మకాలూ, ధర్మాలూ, భగవంతుని గురించి తెలియజెప్పాడు.

"భగవంతుడు ఒక్కడేనని మేము విశ్వసిస్తాం. మొదటగా మా రాజ్యంలో ధర్మం తెలియజేసిన జరతుష్ట్ర చెప్పిన మాట అదే. అనేక దేవతలు లేరు. ఉన్నదొక్కడే, ఆయన అహురమజ్ద"

"అసురులను మర్దించిన వాడని అర్థమా" అని మిహిరుడనుకున్నాడు.

"అహురమజ్ద అనగా మహోత్తమ జ్ఞాని అని అర్థం. ప్రకృతిలోని అగ్నినీ, నీటినీ అతి పవిత్రంగా భావించి, వాటినెప్పటికీ కలుషితం కానీయం. మనసు, వాక్కు, కర్తలలో మంచి మాత్రమే ఉండాలి. ఎప్పుడూ వితరణ గుణమే ఉండాలి. దానం గొప్ప గుణం. మంచితో చెడును జయించాలి. చెడుకి దేవ అని పేరు."

మిహిరుడు ఉలిక్కి పడి "ఇదేమి? చెడుకి దేవ అని పేరు ఉన్నది. భగవంతునికి అహుర లేదా అసుర అని ఉన్నది. ఇటువంటి ధర్మం ఉండతగునా? ఏల ఉండకూడదు? ఆత్మ లేనేలేదన్న ధర్మాలు, ఆత్మ అనునిత్యమూ మారిపోతూనే ఉంటుందన్న ధర్మాలు, భగవంతుడే లేడన్న వాదాలు, భరతభూమిలో మాత్రం లేవా? ఏ ధర్మమైనా సచ్చిదానందమూర్తిని చేర్చుటకే కదా" అని అనుకుని జరతుష్ట్ర ఉపదేశాలపై దృష్టి సారించినాడు.

* * *

మిహిరుడు తన గృహ యజమాని డేరియస్‌ను అడిగి, గ్రీకులెక్కువగా ఉండే ప్రాంతానికి దారి తెలిసికొని అక్కడకు వెళ్లినాడు. ఆ ప్రాంతవాసుల ద్వారా ఖగోళశాస్త్రం బోధించే గురువు ఇల్లు తెలిసికొని వెళ్లి, తన వివరాలు చెప్పి నమస్కరించాడు.

"నీకు మా గ్రీకుల నమ్మకాలు, సంప్రదాయాలు తెలియవనుకొంటాను. నమస్కారమన్నది దేవతలకే చేయాలి తప్ప మానవులకు చేయరాదు".

"క్షంతవ్యుడను"

"నీవు వచ్చిన పని?"

"తమ వద్ద యవన జ్యోతిషం అభ్యసించవలెనని ఉన్నది. భారతీయ ఖగోళ శాస్త్రంలో కొంత ప్రవేశ మున్నది. మీ నుండి విజ్ఞానం పొందవలెనని నా కోరిక".

"నీకు విద్యను బోధిస్తే నాకు ఏమి ఇవ్వగలవు?"

"నేను ధనహీనుడిని. మీ ఇంట పనిచేసి, మీ రుణమును తీర్చుకొంటాను". గురువు నవ్వి "నా వద్ద దాస దాసీ జనానికి లోటు లేదు. ఇంటిని నీవు గమనించినట్లు లేదు" అన్నాడు.

నిజమే.. ఉజ్జయినిలో తన తండ్రి కుటీరానికి, ఈ భవనానికి పోలిక లేదు. విద్యాబోధన చేసి, ధనమార్జించతలిస్తే ఎంత ఆస్తినయినా సంపాదించ వచ్చును. సనాతన భారతీయ ధర్మమందుకు అంగీకరించదు.

"గురువర్యా, మీ వద్ద విద్య నేర్చుకొనవలెనని ఎంతో ఆశతో దూరం నుండి వచ్చాను. అనుగ్రహింప ప్రార్థన".

గురువు "రేపు రమ్ము. ఆలోచించి, నా నిర్ణయంను చెప్పగలను".

"చిత్తం"

* * *

మిహిరుడు మిగిలిన గురువులను అడిగి

**ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**



తెలిసేది”.

‘ఈమెకు కష్టమైన విషయం చెబితే మంచిది. ఇంకొకసారి నా పనికి అడ్డురాదు’ అని మనసులో అనుకున్న మిహిరుడు “చంద్ర మండలాన్ని పరిశీలించి చూస్తే కుందేలు వంటి ఆకారం కనబడుతున్నది. ఏ నెలలోనైనా, ఏ తిథినాడైనా అదే ఆకారం అదే విధంగా కనబడుతుంది. కారణమేమిటి? చంద్రుడు తన చుట్టూ తాను తిరుగుతూ, భూమి చుట్టూ తిరుగుతున్నాడు. స్వభ్రమణానికీ, భూ పరిభ్రమణానికి ఒక సమయం పడుతుంది. ఈ రెండు గుండ్రని రాళ్లనూ పరిశీలిస్తే విషయం అర్థమవుతుంది” అని చెప్పి, ఒక రాయిని భూమిగా నిలబెట్టి, రెండవ రాయిని చంద్రునిగా భావించమని, మొదటి రాయి చుట్టూ తిప్పి చూపించినాడు.

ఖనా తనకు అర్థమయినదని చెప్పి, లేచి నిలబడి, మిహిరుని చుట్టూ ఒక వృత్తం గీసింది. అతనినే చూస్తూ, అతని చుట్టూ తిరిగింది.

“నాకు అర్థమయినది కదా” అని ఖనా ప్రశ్నించింది. మిహిరుడు అన్యమనస్కంగానే తల ఊపినాడు.

చూడనా అని ఆలోచించి, ఎవరైనా ఇదే సమాధాన మిస్తారని నిర్ణయించుకుని, తన నివాసానికి వెళ్లిపోయినాడు. మరునాడు గురువు దగ్గరకు వెళ్లి ఆశాపూరిత దృక్కులతో నిలబడగా, ఆయన “నీ కోరికను తిరస్కరించేందుకు మనసు అంగీకరించ లేదు. నేను నీకు యవన జ్యోతిషం నేర్పగలను. ప్రతిగా నీవు నాకు భారతీయ జ్యోతిషం తెలియ పరచు” అన్నాడు. మిహిరుడు ఆనందంగా అంగీక రించాడు. పరస్పర విద్యాబోధన ప్రారంభమయింది. సంస్కృత పదాల అర్థం తెలియజేస్తూ, సూర్య సిద్ధాంతాన్ని మిహిరుడు బోధించసాగినాడు. గ్రీకు, సంస్కృత భాషల సామీప్యం గురువుకు ఆశ్చర్య కరమూ, ఆనందదాయకమూ అయింది.

* * *

ఒక నెల తర్వాత ఒక రాత్రి మిహిరుడు ఆరుబయట కూర్చుని పైనున్న నక్షత్రాలు చూస్తూ, వాటి స్థానాలు ఎలా ఉన్నాయో తన వద్దనున్న పత్రంపై రాసుకుంటున్నాడు. అతని వద్దకు వచ్చిన ఖనా ప్రక్కనే కూర్చుండి “మీరు నేర్చుకోవడమేనా? కొంత నాకు నేర్పరాదా?” అన్నది.

మిహిరుడికి తన పని ఆపడం ఇష్టం లేదు. తప్పించుకొనడానికి, “ఖగోళ శాస్త్రం కఠినమైనది. సులభంగా నేర్చుకొనలేము” అని అన్నాడు.

“మీరు నేర్పితే కదా, నాకు వచ్చేదీ, రానిదీ

“శిష్యుల విషయంలో ఇంత నిరాదరణ పనికిరాదు. మీరు నా వంక చూడనే లేదు. ఈసారి గమనించ ప్రార్థన”. అన్న ఖనా వృత్తరేఖపై మిహిరుని ఎదురుగా నిలబడి “నేను తూర్పు ముఖంగా ఉన్నాను చూడండి” అన్నది. మిహిరుడు ఆమె వంక చూశాడు. ఆమె కొంత దూరం వృత్తముపై నడిచి మిహిరుని వైపుగానే నిలబడి “నేను ఉత్తరముఖంగా ఉన్నాను” అని అన్నది. మిహిరుడామె తిరిగిన వైపుగానే తిరిగి చూశాడు. కొంత నడచిన ఆమె తాను పశ్చిమ ముఖంగా ఉన్నాననీ, ఆపైన దక్షిణ ముఖంగా ఉన్నాననీ చెప్పి, భ్రమణం పూర్తయిన తర్వాత అతని ప్రక్కన కూర్చున్నది.

“గమనించారు కదా.. శీఘ్రంగా కాక నెమ్మదిగా తిరుగడం వల్ల నా చుట్టూ నేను తిరగడానికి, మీ చుట్టూ తిరగడానికి ఒకే సమయం పట్టినది. నా చుట్టూ నేను తిరిగినట్లనిపించలేదు. నేను చంద్రుడు, మీరు భూమి.”

మిహిరుడామె వంక ఆశ్చర్యంగా చూశాడు.



అతనికి తెలియకుండగానే, అంతకు ముందెన్నడూ లేని విధంగా మిహిరుని దృష్టి ఖనా ముఖంపై నిలిచిపోయింది. ఎంతటి సౌందర్యవతి ఈమె? సాధారణంగా పారశీక రాజ్య ప్రజలందరూ తెలుపు రంగులోనే ఉంటారు. ఆమె నల్లగా, నీలమేఘ చ్ఛాయలో మెరిసిపోతున్నది. మహాభారత కథానాయిక ద్రౌపది ఈమె వలెనే ఉండేదేమో! వివేకమూ, సౌందర్యమూ గంగా యమునల వలె కలసిపోయి ప్రవహిస్తున్నవి. మంచితనం సరస్వతి వలె ఈమెలో ఉన్నది.

ఎంత వివేకవతి ఈమె? ఒక్కసారి చెప్పినంతనే చక్కగా అర్థంచేసికోవడమే కాక తిరిగి వివరించి చెప్పగలిగినది. స్త్రీలలో ఇంతగా తెలివి తేటలుండునా? మిహిరునికి ఎవరో కొట్టినట్లనిపించింది. ఏల ఉండరాదు? స్త్రీలు పురుషుల కన్నా తక్కువ వారన్న భావమెందుకు? తన ప్రియస్నేహితుడు విక్రమాదిత్యుని మనసును గెలిచిన నారీమణి, ప్రస్తుతం అవంతీ రాజ్య పట్టమహిషి. విలువిద్యలో నిపుణురాలు కాదా? ఏ గొప్పగుణమూ పురుషుల సొత్తు కాదు.

“ఏం మాట్లాడడం లేదు. పాఠం తప్పుగా అర్థం చేసికొన్నావా?”

“లేదు.. వివరణకై ఉపయోగించిన ఉదాహరణ, తెలియజెప్పిన పద్ధతి బాగున్నవి”.

“అయితే మీ వద్ద ఖగోళ శాస్త్రమభ్యసించవచ్చునా?”

“మీ జనకుల అనుమతి ముఖ్యం.”

“అదెంత పని?” అంటూ ఖనా లోనికి వెళ్లిపోయింది.

* * *

మరునాడు భోజన సమయంలో డేరియస్ మిహిరునితో ఖగోళశాస్త్ర మభ్యసించవలెనన్న ఖనా కోరిక గురించి ప్రస్తావించినాడు. “నేను వ్యాపార నిమిత్తం అనేక పర్యాయాలు భరతభూమిలోని అనేక రాజ్యాలకు వెళ్లవలసి వచ్చేది. ఆడపిల్ల కనుక ఖనాను వదలిపెట్టే వీలులేక నేనూ, నా భార్యా మా తోనే తీసికొని వెళ్లేవారం. ఒక్కసారి తక్షశిలలో ఎక్కువ కాలముండవలసివచ్చినది. గురువులను నియమించి సంస్కృత భాషను నేర్పించినాను. మీ జ్యోతిషశాస్త్రం నేర్చుకొనడం ఆమెకు కష్టం కాదనే అనుకొంటాను”.

మిహిరుడు అంగీకరించినాడు. ఖనా తెలివితేటలకు గమనించడం అందుకు ఒక కారణం. డేరియస్ ఇంటిలో వసతి, భోజన సదుపాయం పొందుతున్నందుకు ఈ విధంగా రణం తీర్చుకొను అవకాశం రావడం మరొక కారణం.

మంచి ముహూర్తాన విద్యాబోధన మొదలయింది. గురుప్రార్థన, సూర్యస్తుతి ఖనాకు ముందే తెలిసి ఉండటం మిహిరునికి శుభ సూచకంగా అనిపించింది. ప్రతిదినం సాయం సమయంలో అర గడియసేపు చదువు చెప్పడంతో పాటు తన వద్దనున్న గ్రంథాలను ఆమెకిచ్చినాడు.

ఉదయమే లేచి స్నాన, జప, పూజా కార్యక్రమాలు నిర్వర్తించడం, గ్రీకు ఉపాధ్యాయుని వద్దకు వెళ్లి యవన జ్యోతిషం నేర్చుకొనడం, ఆయనకు భారతీయ జ్యోతిషం నేర్పటం, ఆపైన ఇంటికి వచ్చి మధ్యాహ్న సంధ్యావందనం, భోజనం, సాయం సమయంలో ఖనాకు చదువు చెప్పడం సాయం సంధ్యావందనం, రాత్రి నక్షత్ర పరిశోధన. మిహిరునికి కాలం త్వరగా గడచిపోతున్నది.

* * *

ఒకనాటి రాత్రి ఖనాకు ఆకాశంలోని నక్షత్రాలను చూపుతూ, రాశుల గురించి తెలియచేయవలెనను కున్న మిహిరుడు ఆమెతో కలిసి ఆరు బయటకు వచ్చాడు.

“జ్యోతిశ్శాస్త్రమనగా భవిష్యత్తును తెలియచేసేది అని అనుకునేదానను. ఇన్ని విషయములుంటాయని తెలియదు” అని ఖనా అన్నది.

“జ్యోతి అంటే వెలుగు అని నీకు తెలియును కదా! వెలిగే వాటి గురించి తెలియచేసేది జ్యోతిశ్శాస్త్రం. వెలిగే సూర్యుడు, చంద్రుడు, గ్రహములు, నక్షత్రాలు మొదలైనవన్నీ ఆకాశంలో ఉంటాయి. ఖగోళశాస్త్రమన్న పేరు ఆ విధంగానే వచ్చింది. ఖగోళ శాస్త్రమన్నా, జ్యోతిషమన్నా ఒక్కటే. గ్రహము లెక్కడ ఉన్నవి అన్న దానిని బట్టి ఫలితాలను తెలియజేయడం శాస్త్రంలో చిన్న భాగమే”.

ఖనా అర్థమైనదన్నట్లుగా తల ఊపింది.

“నక్షత్రాల పేర్లు చెప్పు!”

ఖనా వరుసగా ఆ పేర్లు చెప్పింది. వాటిని ఆకాశంలో చూపించేందుకు చేయి ఎత్తిన మిహిరుడు, “అదిగో చూడు. పున్నమి నాటి చంద్రుడు కృత్తికా నక్షత్రంతో సరసమాడుతున్నాడు. అసూయతో ఎర్రబడినదా అన్నట్లుగా రోహిణి ఉన్నది” అని ఆగిపోయినాడు.

ఖనా ముఖంలో మందహాసం వెల్లివిరిసింది, “గురువర్యులు ఖగోళశాస్త్రాన్ని వదలి కవితా మార్గమును ఆశ్రయించినారే.”

మిహిరుడు కదలకుండా నిలిచిపోయినాడు. ఏమిది? తన నోట ప్రేమమయమైన కవిత వచ్చినది. ఆశ్చర్యంగా ఉంది. చాలా కాలం కిందట రాజులకు సాంత్వననిచ్చేది ప్రియా సమాగమమే అని శ్లోకం రాసినప్పుడు విక్రమాదిత్యుడు ఆశ్చర్యం వెలిబుచ్చాడు. ఇంతవరకూ ఏనాడూ తిరిగి తాను కవిత అల్లలేదు. ఈ దినమేమైనది? మనసు తారాచంద్రుల సమాగమం వైపు పోయినదేమి?

కారణమేమిటి? లేక కారణమెవ్వరు అని ప్రశ్నించాలా?

అతనికి తెలియకుండగానే, అంతకు ముందెన్నడూ లేని విధంగా మిహిరుని దృష్టి ఖనా ముఖంపై నిలిచిపోయింది. ఎంతటి సౌందర్యవతి ఈమె? సాధారణంగా పారశీక రాజ్య ప్రజలందరూ తెలుపు రంగులోనే ఉంటారు. ఆమె నల్లగా, నీలమేఘ చ్ఛాయలో మెరిసిపోతున్నది. మహాభారత కథానాయిక ద్రౌపది ఈమె వలెనే ఉండేదేమో! వివేకమూ, సౌందర్యమూ గంగా యమునల వలె కలసిపోయి ప్రవహిస్తున్నవి. మంచితనం సరస్వతి వలె ఈమెలో ఉన్నది. త్రివేణీ సంగమం వలె ఉన్న ఈమెను చేపట్టిన వరుడు అదృష్టవంతుడు.

ఒక్కసారిగా మిహిరుని ఆలోచనా ప్రవాహానికి అతని ధర్మచింతన అడ్డు తగిలింది. పరస్త్రీని గురించి ఇట్టి ఊహలు తనకు తగవు. జగన్మాత అయిన శ్యామలాదేవిని తలపులోనికి తెచ్చుకుని, మనసును మరల్చుకుని అతడు పాఠం చెప్పసాగినాడు.

“ఈనాడు కార్తీకపౌర్ణమి. చంద్రునికి దగ్గరగా చిన్న నక్షత్రాల గుంపు కనిపిస్తున్నది కదా! జాగ్రత్తగా చూస్తే ఆరు నక్షత్రాలను చూడవచ్చును. అవే కృత్తికా నక్షత్ర సముదాయం. ఇటువైపున్న ఎర్రటి నక్షత్రం రోహిణి. అటువైపున్న ఎర్ర నక్షత్రం భరణి. ఇంకా ముందుకు చూస్తే కనబడేది అశ్విని....”

పాఠం సాగిపోతున్నది. **(సశేషం)**

# అడ్డిమార్ గుడ్డిదెబ్బ

పుట్టంగనే ఎవ్వరికి పేరుండదు... ఇర్వై ఒక్క దినాన సుట్టాలను పిలుస్తరు... సంటి పోరన్ని లేకుంటె సంటి పొల్లను తొట్టెల ఏస్తరు. తొట్టెల ఏసే ముంగట పేరు బెడ్తరు. మన పేరుకున్న అర్తమేందో ఎర్క జేస్కోవాలె. పేరు బెట్టెటోల్లు గుడ్క అర్తం ఎర్కజేస్కున్నంకనే పేరు బెట్టాలె. ఒక పొల్లుకు మంజూష అనిపేరు బెట్టింద్రు. మంజూష అనేది పేరు ఇనెతందుక్క మంచిగున్నది. గని మంజూష అంటే సందుక అని అర్తం. అర్తమేందో ఎర్కజేస్కో కుంట పేరు బెడ్తె గిట్లే ఉంటది.

నిమ్మయ్య అనేటి పేరు నాకు ఇచ్చింద్రంగని పిచ్చింది.

"నీకు గీ పేరు ఎందుకు బెట్టింద్ర"ని అడ్గిన.

"చిన్నప్పుడు నిమ్మపండు తీర్గ ఉన్ననట. ఇగ దాంతోని మా తాత నాకు నిమ్మయ్య అని పేరు బెట్టిండు" అని గాడు జెప్పిండు.

మన పేరే గాకుంట మన ఊరికి గా పేరెందు కొచ్చిందో ఎర్కజేస్కోవాలె. పెద్దోల్లు ఎర్కలేకున్నా ఎర్కున్నోల్ల లెక్క ఫోజు గొడ్తరు. చిన్నోల్లే గదేంది, గిదేందని అడ్గుతరు. మా ఊరు భువనగిరి. మన ఊరుకు గీ పేరుందుకొచ్చిందని ఒకసారి మా హనుమాండ్లు కాక నడ్గిన. కాక మా ఎదురింట్ల ఉండెటోడు. గిప్పుడు లేడు. కాలం జేసిండు. మా వూరు పేరు గురించి కాక నాకొక కత జెప్పిండు, ఇంతకుముందు మా వూరు లేకుండెనట. గిప్పుడు మా వురున్న తాన అంత అడివేనట.

ఒక రాజు ఖిల్లా గట్టాలనుకుండు. పెద్ద గుట్ట కోసం లెంకుకుంట లెంకుకుంట గిప్పుడు మా ఊరున్న తాన్కి వొచ్చిండు. గొర్రెలు గాస్తున్న ఒక గొల్లోడు గాయినకు గండ్ల బడ్డడు. గుర్రం మీదికెల్లి దిగకుంటనే..

"వారీ గీదేడైన పెద్ద గుట్టున్నదా?" అని రాజడ్గిండు.

"ఉన్నది మా రాజా!" అని గొల్లోడు అన్నాడు.

"జెర సూబెడ్తవా?"



తెలిదేవర భానుమూర్తి
సీనియర్ జర్నలిస్ట్, 9959150491

"పది దినాలైనంక రాన్రి మా రాజు. మీకు పెద్దగుట్ట సూబెడ్త"

ముద్దత్ కతమైంది. రాజొచ్చిండు. పెద్దగుట్ట గండ్లబడ్డది.

"ముందట గీడ గుట్టలేకుండె గిప్పుడెట్లొచ్చింది. నీగ్గిన మాయలు మంత్రాలొస్తయా?" అని రాజడ్గిండు.

"ముంజాత గుడ్క గీడ గుట్టున్నది మా రాజ" అని గొల్లోడన్నడు.

"ఉంటే నాకెంతుకు గండ్లబడలే"

"ఒక తీగె గుట్టనల్లుకొని ఉండె. గది యాడికెల్లి



లేసిందో గాడ గొడ్డల్తోని నర్కిన. తీగ ఎండెబట్కె గియ్యాల గుట్ట మీక్కండ్లబడ్డది"

"నీకేం గావాల్నో జెప్పు".

"నీ బాంచెన్. నా పేరు భువనయ్య. నా పెండ్లాం పేరు గిరమ్మ. గీడ బడేటి ఊరుకు మా ఇద్దరి పేరొచ్చేతీర్గ భువనగిరి అని పేరు బెట్టుండ్రి మా రాజు" అని గొల్లోడన్నాడు.

"మంచిది.. నువ్వడిగినట్లే జేస్త" అని రాజన్నడు. ఇయ్యాల సుత భువనయ్య పేరు మీద జాత్ర అయితుంటది.

ఒకసారి సినారెతోని ముచ్చట బెడుతుంటె

"తెలిదేవర అంటే ఏందో ఎర్కెనా" అని గాయిన అడిగిండు.

సాఫ్ సీదా – "ఎర్కలేదు సార్" అని అన్న.

"తెలి అంటె తెల్లని, దేవర అంటే దేముడు. తెల్ల గుండేటి దేముడు శివుడు" అని సినారె జెప్పిండు.

నల్గొండ జిల్లాల తెలిదేవర పల్లె అనేటి ఊరున్నది. గా ఊల్లె శివుని గుడి ఉన్నదో లేదో, నాకైతే ఎర్కలేదు.

నా మతిలో ఉంచుకొన్న ఇంకొక సంగతి జెప్త.

ఎన్కట ఇంద్ర సోముడనేటి రాజుండె. గాయిన పేరు మీద ఇంద్రపురి ఏర్పడ్డది. పోంగ పోంగ గది ఇందూరైంది. లష్కర్ కెల్లి మన్మాడ్ దన్క రేల్ పట్టాలే సింద్రు. గప్పుడు నిజాం–ఉల్ క్ ముల్క్ పేరు మీద ఇందూర్కు నిజాంబాద్ అని పేరు బెట్టింద్రు. గని గిప్పుడు సుత శానమంది ఇందూరనే అంటున్నరు.

మేము పన్నెండో తర్గతి దాంక తెల్గు మీడియం లనే సద్వుకున్నం. గా దినాలల్ల మాకు అంగ్రేజ్ల మాట్లాడుడు రాకుండె. ఊర్లె సదువైనంక డిగ్రి సద్వేతందుక్క మేము పట్నమొచ్చినం. అంగ్రేజి రాకుండ బట్కె కాలేజిల మేము పట్నం పోరల తెర్పు బోయెటోల్లం గాదు. గాల్లు మమ్ములను బనాయించేటోల్లు.

ఒకసారి కాలేజీల ఒక పట్నం పోరడు మా ప్రమోద్ తాన్కి వొచ్చిండు.

"వాటీజ్ యువర్ నేమ్" అని అడిగిండు... మావోడు జెప్పిండు.

"వాటీజ్ యువర్ ఫాదర్" అని అడిగిండు. మావోడు సప్పుడు జెయ్యలేదు. గాడు కిసకిసనగిండు జెరసేపైనంక.

''యూనో నల్స్‌ల్యాండ్'' అని మావోడు అడిగిండు.

"వాటీజ్ నల్స్‌ల్యాండ్"

"నల్స్‌బ్యాండ్ ఈజ్ నల్స్‌ల్యాండ్".

ఏమర్తంగాక పట్నం పోరడు ఎడ్డిమొక మేస్కోని బోయిండు. నల్స్ ల్యాండ్ అంటే ఏందో నాగ్గూడ ఎర్కలేదు.

"నల్స్‌ల్యాండ్ అంటే ఏందిరా? గా వూరు యాడుందిరా" అని మావోన్ని అడిగిన. "నల్స్ అంటే నల్లులు. గవి ఉండేటి మంచమే నల్స్‌ల్యాండ్‌రా" అని నగుకుంట మావోడు జెప్పిండు. ★

# అమెరికాను కుదిపే

**జనవరి, 20వ తేదీ..**

జార్జియాలో నివాసం ఉంటున్న 52 ఏళ్ల పీనల్ పటేల్.. తన భార్య రుపన్ బెన్ పటేల్, కుమార్తె భక్తీ పటేల్‌తో ఆ్రటియమ్ ఆసుపత్రికి బయలుదేరాడు. దారి మధ్యలో ముగ్గురు దుండగులు వారిని అడ్డుకొని దారుణంగా కాల్చి పరారయ్యారు. ఈ దాడిలో పీనల్ పటేల్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్య, కుమార్తెలకు గాయాలు తగిలాయి.

**జనవరి 22..**

భారతీయ మూలాలున్న 66 ఏళ్ల వృద్ధుడిని ఒక దుండగుడు కాల్చిచంపాడు. ఈయన ఫిలడెల్ఫియా లోని ఒక గ్యాస్ స్టేషన్‌లో ఉద్యోగి. దొంగతనం కోసం వచ్చిన దుండగుడు కాల్పులు జరపడంతో విధుల్లో ఉన్న ఆయన మరణించాడు. ఈ వృద్ధుడిని పెట్రో సిబారామ్‌గా గుర్తించారు.



**జనవరి 24..**

అర్ధరాత్రి వాషిం గ్టన్‌లోని యాకిమా ప్రాంతంలో ఉన్న ఓ కన్వీనియన్స్ స్టోర్‌లోకి ఒక ఆగంతకుడు ప్రవేశించి కొందరిపై విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ముగ్గురు చనిపోయారు. తర్వాత ఆగంతకుడు తనను తాను కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇవన్నీ అమెరికాలో అమల్లో ఉన్న తుపాకీ సంస్కృతికి ప్రత్యక్ష ఉదాహరణలు. నిజం చెప్పాలంటే అమెరికా సమాజానికి తుపాకీ హింస ఒక అంటు రోగంగా మారింది. ఇందుకు ఆ దేశంలో కొనసాగు తున్న తుపాకీ సంస్కృతే (గన్ కల్చర్) కారణం. 1970లో ప్రముఖ చరిత్రకారుడు రిచర్డ్ హాఫ్‌డాస్టర్ 'అమెరికా యాజ్ ఎన్ గన్ కల్చర్' పేరుతో రాసిన వ్యాసంలో మొట్టమొదటిసారి 'గన్ కల్చర్' అనే పదాన్ని వాడాడు. ఈ తుపాకీ సంస్కృతి ఏటా 40 వేల మందిని పొట్టన పెట్టుకుంటోంది. ఇందులో ఆత్మహత్యలు, హోమీసైడ్‌లు (నరహత్యలు), పోలీసులు కాల్చి చంపడం, పొరపాటున తుపాకులు పేలడం వంటివి కొన్ని. అమెరికాలో ఈ కొత్త సంవత్సరంలో ఇప్పటివరకు తుపాకీ కాల్పుల్లో మరణించిన వారి సంఖ్య 70కి చేరిందంటే పరిస్థితి తీవ్రత అర్థంకాక మానదు.

**2020లో మరణాలు అత్యధికం**

అమెరికాకు చెందిన సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) గణాంకాల ప్రకారం 2020లో తుపాకీ సంబంధ గాయాల వల్ల మర ణించిన వారి సంఖ్య 45,222 కాగా వీరిలో సగం మంది తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసు కున్నవారే కావడం గమనార్హం. 2020లో దేశంలో దాదాపు 19వేల మరణాలు పరస్పరం ఒకరినొకరు కాల్చుకోవడం వల్ల సంభవించినవి. 2019తో పోలిస్తే ఈ సంఖ్య 34% పెరగ్గా, గత దశాబ్దంతో పోలిస్తే 75% పెరిగాయి. 2019-20 మధ్యకాలంలో 19 ఏళ్లలోపు వయస్కుల్లో తుపాకుల కారణంగా సంభవించిన మరణాలు 30%, నల్లజాతి మహిళల్లో పరస్పరం కాల్పుల సంఘటనల్లో మరణించినవారి సంఖ్య 47% పెరిగింది. 2020లో తుపాకులతో కాల్చుకొని మరణించినవారి సంఖ్య 24వేలు. గడచిన మూడు దశాబ్దాల కాలంలో ఇదే అత్యధికం. పై సమాచారం ప్రకారం యూఎస్‌లో సగటున ప్రతిరోజు తుపాకుల వల్ల మరణిస్తున్న వారి సంఖ్య 53. కెనడా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, వేల్స్‌లతో పోలిస్తే ఆమెరికాలో హోమీసైడ్స్ (నరహత్యలు) ఎక్కువ. ఇక సామూహిక కాల్పుల విషయానికి వస్తే గత మూడేళ్ల కాలంలో అమెరికాలో ఇటువంటివి 600 సంఘటనలు చోటుచేసుకున్నాయి. అంటే సగటున రెండు రోజులకోమారన్న మాట. ఇప్పటి వరకు అమెరికాలో జరిగిన అత్యంత దారుణమైన సామూహిక కాల్పుల సంఘటన 2017లో లాస్ వేగాస్‌లో జరిగింది. ఈ సంఘటనలో 50 మంది మరణించగా మరో 500 మంది గాయపడ్డారు.

**చెలామణిలో 390 మిలియన్ తుపాకులు**

స్విస్ దేశానికి చెందిన ఒక పరిశోధనా సంస్థ 2018లో నిర్వహించిన సర్వే ప్రకారం యూఎస్‌లో 390 మిలియన్ తుపాకులు చెలామణిలో ఉన్నాయి. ప్రతి వంద కుటుంబాలకు 120.5 తుపాకులున్నా యంటే అక్కడ గన్ కల్చర్ ఏ స్థాయిలో ఉన్నదో అర్థమవుతుంది 2011లో ఇది 100కు 88మాత్రమే. ఈ డేటాను పరిశీలిస్తే గత కొద్ది సంవత్సరాలుగా యూఎస్‌లో గన్ కల్చర్ విపరీతంగా పెరిగిపోయిం దని అర్థమవుతుంది. ది అన్నల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్ ప్రచురించిన పరిశోధన పత్రం ప్రకారం 2019 జనవరి నుంచి 2021 ఏప్రిల్ మధ్యకాలంలో 7.5 మిలియన్ల మంది యూఎస్‌కు చెందిన వయోజనులు కొత్తగా తుపాకులు పొందినట్లు తెలుస్తోంది. వీరిలో సగం మంది మహిళలు! ఇళ్లలో బయటపడ్డ మొత్తం 11 మిలియన్ తుపాకుల్లో 5 మిలియన్లు పిల్లలవి కావడం గమనార్హం! ఈవిధంగా వేలల్లో తుపాకుల కొనుగోళ్ల కారణంగా దేశవ్యాప్తంగా నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

**అత్యధిక తుపాకుల వినియోగం యూఎస్‌లోనే**

ప్రపంచంలోనే అత్యధికంగా పౌరులు తుపాకులు ఉపయోగించే దేశం అమెరికా. దేశంలో తుపాకుల వల్ల మరణాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జోబైడెన్ ప్రభుత్వం వీటి వినియోగంపై కొన్ని కఠిన నిబంధనలు తీసుకొని రావాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం ప్రతి పది మందిలో నలుగురు తుపాకులు కలిగి ఉన్నారు. అయితే ఇందుకు వీరు చెప్పే కారణం వ్యక్తిగత భద్రత! మొత్తం అమెరికన్లలో 48% మంది తుపాకీ హింస అత్యంత ప్రమాదకరమన్న సంగతిని అంగీకరిస్తున్నారు. తుపాకుల వినియోగంపై కఠిన నిబంధనలు అవసరమన్న వాదనలు పెరుగుతున్న నేపథ్యంలో నిర్వహించిన ఒక సర్వేలో 57% మంది ఆవిధమైన చట్టాలు అవసరమేనని భావించగా, 32% మంది మాత్రం ప్రస్తుతం ఉన్న నిబంధనలు అమలు చేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. పదిశాతం మంది నిబంధనలను మరింత సరళం చేయాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న డెమోక్రాట్స్‌లో 91%మంది తుపాకులకు సంబం ధించి కఠిన నిబంధనలు ఉండాల్సిందేనని కోరు తుండగా 24%మంది రిపబ్లికన్లు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. దేశ ప్రజల్లో అధిక సంఖ్యాకులు గన్ కల్చర్‌కు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ వివిధ రాష్ట్రాలు తుపాకుల నిబంధనలను మరింత సరళం చేస్తూ వస్తుండటం మరో ప్రమాదకరమైన అంశం. ఉదాహరణకు 2021లో టెక్సాస్ గవర్నర్ 'పర్మిట్‌లెస్ క్యారీ బిల్'పై సంతకం చేశారు. రాష్ట్ర ప్రజలు ఏవిధమైన లైసెన్స్ లేదా పర్మిట్ లేకుండానే హ్యాండ్ గన్‌ను చేతిలో పట్టుకొని తిరిగేందుకు ఈ బిల్లు వీలు కల్పించింది. అదేవిధంగా జార్జియా రాష్ట్రంలో కూడా తుపాకులు బహిరంగంగా చేతపట్టు కొని తిరగొచ్చు. ఆ విధంగా అనుమతిచ్చిన 25వ రాష్ట్రం ఇది. ఈ మేరకు గత ఏడాది ఏప్రిల్‌లో చట్టం చేశారు.

# స్తున్న తుపాకీ సంస్కృతి



జమలాపురపు విఠల్‌రావు

అమెరికాలోని అన్ని రాష్ట్రాల్లో తుపాకులపై నిబంధనలు ఒకే మాదిరిగా లేవు. ఫలితంగా తుపాకులు కలిగి ఉన్నవారి సంఖ్య ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కో మాదిరిగా ఉంది. ఉదాహరణకు అత్యధికంగా అలాస్కా రాష్ట్రంలో 61.7% మంది తుపాకులను వినియోగిస్తుండగా డెలావేర్ రాష్ట్రంలో అతితక్కువ అంటే 5.2%మంది వద్ద మాత్రమే తుపాకులున్నాయి.

**శక్తిమంతమైన లాబీయింగ్**

దేశంలో పెరుగుతున్న తుపాకీ సంస్కృతిని నిరోధించేందుకు సాక్ష్యాధారాలతో కూడిన పరిష్కార మార్గాలను కొందరు చూపుతున్నారు. వీటికి తుపాకులు కలిగినవారు కూడా మద్దతు తెలుపుతున్నప్పటికీ, పాలకులు మాత్రం జీవితాలను కాపాడటానికి ఉపకరించే చట్టాలను చేయడానికి ముందుకు రాకపోవడంలో పెద్ద విశేషమేం లేదు. ఎందుకంటే యూఎస్‌లో నేషనల్ రైఫిల్ అసోసియేషన్ (ఎన్ఆర్ఏ) అత్యంత శక్తిమంతమైన లాబీయింగ్ సంస్థ. తన పలుకుబడితో సంస్థ కాంగ్రెస్ సభ్యులను ప్రభావితం చేయగలదు. తుపాకుల నియంత్రణ లాబీలో, ఎన్ఆర్ఏతో పాటు ఇతర సంస్థలు పెద్దఎత్తున ఖర్చుపెట్టాయి. వీటి ప్రత్యర్థులు ఇంతటి స్థాయిలో ఖర్చుపెట్టలేకపోవడంతో గన్ కల్చర్‌కే ఇంకా మద్దతు లభిస్తోంది.

**రాజ్యాంగంలోని రెండో సవరణ**

యునైటెడ్ స్టేట్స్ రాజ్యాంగంలోని రెండో సవరణ తుపాకుల వినియోగానికి రక్షణ కల్పిస్తోంది. 1791లో యూఎస్ ప్రభుత్వం ఈ సవరణ చేయగా, 1869లో నాల్గవ సవరణ చేసింది. ఈ రెండు సవరణలు దేశంలో 'తుపాకీ రాజకీయాల'కు కీలకమని చెప్పాలి. 2008లో యూఎస్ సుప్రీంకోర్టు కూడా ఈ రాజ్యాంగ సవరణ ప్రకారం వ్యక్తులు తుపాకులు కలిగి ఉండటం వారి హక్కు అని స్పష్టం చేసింది. స్వీయరక్షణ, వేట, షూటింగ్ పోటీల కోసం అమెరికన్ పౌరులు తుపాకులను వినియోగిస్తుంటారు. అమెరికా రాజకీయాలు కూడా తుపాకులు ధరించడం హక్కుగా వాదించేవారు, తుపాకుల వినియోగంపై గట్టి నియంత్రణ ఉండాలని వాదించేవారి మధ్య కేంద్రీకృతమై ఉంటాయి. నేరస్తుల దగ్గర ఎప్పుడూ ఆయుధాలు ఉంటాయి కనుక, పౌరులు తుపాకులు కలిగి ఉంటే అటువంటి వారిని సమర్థవంతంగా నిరోధించగలుగుతారని, ఫలితంగా దేశంలో నేరాలు తగ్గుతాయని గన్ కల్చర్ సమర్థకుల వాదన. కానీ వాస్తవం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటోంది. అదే గన్ కల్చర్ వ్యతిరేకులు, సమాజం సురక్షితంగా ఉండాలంటే తుపాకులను నియంత్రించాల్సిందేనని వాదిస్తున్నారు. ముఖ్యంగా ప్రజల వద్దే ఆయుధాలుంటే, ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించడానికి ఇవి అడ్డంకిగా మారతాయన్నది వీరి అభిప్రాయం. అమెరికా సంస్కృతికి ప్రత్యేకమైన ఈ గన్ కల్చర్ వల్ల హింస కూడా ఎప్పటికప్పుడు పెరుగుతుండటం విపరిణామం. విచిత్రమేమంటే ప్రపంచంలో అమెరికా జనాభా 4శాతం కాగా, మొత్తం ప్రపంచంలోని తుపాకుల నిల్వల్లో 46శాతం ఇక్కడే ఉండటం గమనార్హం. ప్రపంచంలోని 25 అగ్రస్థాయి దేశాలకు చెందిన పౌరులకంటే, అమెరికా పౌరుల వద్దనే తుపాకుల సంఖ్య ఎక్కువంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

**కార్ల కంటే తుపాకీ మరణాలే అధికం**

గడచిన నాలుగేళ్ల కాలంతో పోల్చినప్పుడు 2020లో కారు ప్రమాదాల వల్ల మరణించిన వారి సంఖ్య కంటే కూడా తుపాకుల వల్ల మరణాలే అధికం కావడం విచిత్రం. కారు ప్రమాదాల్లో 40,698 మంది మరణిస్తే, తుపాకుల వల్ల 45,222 మంది అసువులు బాసారు. అమెరికాలో సగటున ఒక వ్యక్తి వారంలో ఎనిమిది గంటలు కారులో గడుపుతాడు. కారు అనేది అక్కడి జీవితావసరం. అదే తుపాకీ నిత్యావసరం కాదు. అయినప్పటికీ ఈ మరణాలే అధికంగా ఉండటం విషాదం. ఈ తుపాకుల వల్ల సంభవించే మరణాల్లో స్త్రీల కంటే పురుషుల్లోనే అధికం. ఉదాహరణకు ఒక నివేదిక ప్రకారం హోమీసైడ్ మరణాల్లో స్త్రీల కంటే పురుషుల్లోనే ఐదుశాతం ఎక్కువ. అదేవిధంగా తుపాకుల వల్ల ఆత్మహత్యలు కూడా స్త్రీల కంటే పురుషుల్లో ఏడుశాతం అధికం. ఇక 75 ఏళ్లు దాటిన వృద్ధుల్లో తుపాకులు ఆత్మహత్యలకు దారి తీస్తుండగా, 15–35 ఏళ్ల మధ్య వయస్కుల్లో హోమీసైడ్ మరణాలు ఎక్కువ నమోదవుతున్నాయి. కాగా జాతిపరంగా చూస్తే నల్లజాతి వారిని, తెల్లజాతివారితో పోలిస్తే హోమీసైడ్ మరణాలు 12 రెట్లు ఎక్కువ.

**పెరుగుతున్న బాధితులు**

గత 40 ఏళ్ల కాలంలో యూఎస్‌లో 'గన్ కల్చర్' వల్ల బాధితులైన పౌరుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది తప్ప తగ్గడం లేదు. ఈ కాలంలో మరణించిన యూఎస్ పౌరుల సంఖ్య 1,357,000. ఇదేకాలంలో యూఎస్ సైన్యం పాల్గొన్న యుద్ధాల్లో మరణించినవారి కంటే చాలా అధికం. తుపాకుల కారణంగా చోటుచేసుకునే అకాల మరణాల వల్ల వ్యక్తుల సంభావ్య జీవిత కాలం ఎంతో నష్టపోవడం జరుగుతుంది.

ఈ 'సంభావ్య జీవితకాల నష్టాన్ని' సంవత్సరాల్లో గణిస్తారు. వ్యక్తుల సగటు ఆయు ప్రమాణం 65 సంవత్సరాలనుకుంటే, 2020లో తుపాకుల కారణంగా మరణించిన వారి సంభావ్య జీవితకాల నష్టం 1,131,105 సంవత్సరాలు! ఈ నష్టాన్ని పూడ్చటం సాధ్యమా? తుపాకీ కాల్పుల్లో ఒక వ్యక్తి మరణించిన ప్రభావం అతని కుటుంబం, స్నేహితులు, సన్నిహితులు, వారు నివసిస్తున్న సమాజాలపై అపరిమితంగా ఉంటుంది. అటువంటి బాధితుల వాణిని వినిపించుకునేవారు లేకపోవడం దారుణం. ప్రపంచ దేశాలపై మానవ హక్కుల ఉల్లంఘనల పేరుతో నివేదికలు విడుదల చేస్తూ, హెచ్చరికలు జారీ చేసే అమెరికా, తమ దేశంలో జరుగుతున్న ఈ హక్కుల ఉల్లంఘనపై దృష్టి పెట్టకపోవడం ఆ దేశ గురివింద వైఖరికి నిదర్శనం.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**



# అహంభావి కాదు...

ఏ రంగంలోనైనా ప్రవేశంలానే నిష్క్రమణా హుందాగా ఉండాలంటారు. సినిమా రంగానికి సంబంధించినంత వరకు అలాంటి వారిలో ముందు వరుసలో ఉన్నారు జమున. నాయికిగా నట ప్రస్థానం ప్రారంభించి ఏవో కొద్ది పాత్రలు మినహా నాయికగానే నటనను విరమించుకున్నారు. ఇతరత్రా పాత్రల అవకాశాలు వచ్చినా వదులుకున్నారు. ఆత్మాభి మానాన్ని చంపుకుని ఇష్టం లేని పని చేయవలసిన అవసరం లేదని తరచూ అనేవారు. ఏ విషయంలోనూ రాజీపడని తత్వం. తలెత్తుకుని జీవించడాన్ని పొగరు అనుకుంటే 'ఔను నాకు పొగరే' అని నిర్భయంగా చెప్పగలిగిన నటీమణి. 'చలనచిత్ర పరిశ్రమలో అత్యంత వివాదాస్పద వ్యక్తి జమునే' అని సగర్వంగా చెప్పుకునే వారు. ఈ విషయంలో భానుమతి ఆమెకు స్ఫూర్తి. అందుకే సినిమా రంగంలో ఆమె పెద్ద మేడమ్ కాగా ఈమె చిన్న మేడమ్‌గా చెప్పుకునేవారు. సినిమా జీవితం (రీల్ లైఫ్), వాస్తవ జీవితంలోనూ (రియల్ లైఫ్) పరిపూర్ణత సాధించిన నటీమణి. 'డబ్బు' ముఖ్యమే. 'డబ్బే' ప్రధానం కాదు. దానికోసం అప్రధాన పాత్రలు వేసి ప్రేక్షకుల మదిలోని 'గ్లామర్ క్వీన్' పేరును చెడగొట్టుకో దలచలేదు. మూడున్నర దశాబ్దాల పాటు విభిన్న పాత్రలు పోషించిన నేను నాయికగానే సినిమాలకు స్వస్తి చెప్పి స్వచ్ఛంద సేవలో నిమగ్నమయ్యా' అని చెప్పేవారు. 'ఆమె లేని లోటు సినీ రంగానికి తీరనిది' లాంటి పడికట్టు మాటలు ఆమెకు వర్తించవు. అవకాశాలు వచ్చినా పాత్రలు నచ్చక వదులుకున్నారు కనుక..


సత్యభామగా జమున

జమునాబాయి అనే జమున(జన్మనక్షత్రం రీత్యా ఏదైనా నది పేరు ఉండాలని 'జమున' (యమున)అని పేరు పెట్టారు) విజయనగరం సామ్రాజ్య రాజధాని హంపిలో పుట్టి, దుగ్గిరాలలో పెరిగి రంగస్థలం, వెండితెరపై ఎన్నెన్నో పాత్రలను అవలీలగా, అనాయా సంగా ఆడిపాడేసిన 'ప్రజానటి'. ప్రేక్షకుల నుంచి గ్లామర్ క్వీన్' లాంటి అభినందనలతో పాటు సినీజనం నుంచి 'పొగరు బోతు, మొండిఘటం, పెంకిపిల్ల' లాంటి విమర్శలను ఒకేలా స్వీకరించారు. ఇతరులకు అహంలా కనిపించేది ఆమె దృష్టిలో ఆత్మాభిమానం. 'అవకాశాల కోసం ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టవలసిన అవసరంలేదు. ఏ రంగంలోనైన ప్రతిభే అవకాశాలు కల్పించాలి తప్ప వాటి కోసం దిగజారవలసిన అవసరం లేదు. వ్యక్తిత్వాన్ని కాపాడు కుంటూనే వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి' అన్నది ఆమె ప్రగాఢ విశ్వాసం. దానిని ఆచరించి చూపారు కూడా. ఆస్తికవాదిగా దైవబలం, వ్యక్తిగా ఆత్మవిశ్వాసం, నటిగా ప్రజాబలం కలిగి ఉండడమే తనకు కలసి వచ్చిన అంశాలని చెప్పేవారు.

అన్నిరంగాల మాదిరిగానే చిత్ర పరిశ్రమలోనూ పురుషాధిక్యం స్పష్టంగా కనిపించేదని, దానిని భరించడం కష్టంగా ఉండేదని, అలా అని ఎదుటి వారి తృప్తి, మెప్పుకోసం ఆత్మవంచన చేసుకోరాదని జమున అనేవారు. స్త్రీల పట్ల వివక్షకు నిరసనగా ఒక దశలో నటించకూడదనుకున్నారట. ఇలాంటి పరిస్థితులలో 1960వ దశకంలో అగ్రకథానాయకులు ఆమె పట్ల 'మూగనోము' పట్టి సుమారు మూడేళ్ల పాటు తమ చిత్రాల నుంచి బహిష్కరించినా ఆమె ఏ మాత్రం బాధ పడలేదు, నష్టపోనూలేదు. అవకాశాలూ తగ్గలేదు. కాంతారావు, జగ్గయ్య, హరనాథ్, జేవీ రమణమూర్తి సరసన నటించారు. వారి సినీ భవిష్యత్‌కు పరోక్షంగా మరింత గట్టి పునాదిగా మారారు. ఆమెకు అగ్ర కథానాయకులతో సమానంగా లభిస్తున్న ప్రేక్షకాదరణను గమనించిన నిర్మాతలు, పంపిణీదారులు ఆమె చుట్టూ తిరిగే కథలల్లారు. 'లేతమనసులు' లాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. అగ్ర కథానాయకుల సరసన ఆమె లేని లోటును నిర్మాతలు గుర్తించగా, నిర్మాత చక్రపాణి చొరవ తీసుకుని సయోధ్య కుదిర్చారు. ఆ వెంటనే ఎన్టీఆర్ 'గులేబకావళి కథ'లో జమునను నాయికగా ఎంపిక చేశారు. 'గుండమ్మకథ'లో అక్కినేని నాగేశ్వరరావుకు జోడిగా నటించారు. గత చేదు జ్ఞాపకాలను అందరం మరచిపోయామని, వారితో అనేక విజయవంతమైన చిత్రాలలో నటించ గలిగానని, అనంతర కాలంలో ఎన్టీఆర్‌కు తల్లిగా, భార్యగా (మంగమ్మ శపథం, మనుషులంతా ఒక్కటే) నటించడం గొప్ప అనుభవంగా చెప్పేవారు.

**సత్యభామ**

దాదాపు రెండు వందల చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించిన జమునకు సత్యభామ ప్రియాతి ప్రియమైన పాత్ర. ఇతర నటీమణులు పలువురు ఈ పాత్ర ధరించినా ఆమెది ప్రత్యేక శైలి. అది ఆమె వ్యక్తిత్వానికి కాస్త దగ్గరగా ఉంటుందని విశ్లేషకుల భావన. ఆమె కూడా వారి అభిప్రాయంతో ఏకీభవించే వారు. స్వతః కృష్ణ భక్తురాలైన ఆమె ఆ పాత్రలో రాణించడం కాకతాళీయమే. ఆమెకు ఆ పాత్రంటే ఎంత ఇష్టమంటే సినీ రంగ ప్రముఖులు ప్రకృతి వైపరీత్యాల సహాయనిధి వసూలు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలోనూ సత్యభామ పాత్రనే పోషించారు. దీని తర్వాత 'రాణీ మాలినీదేవి' (పండంటి కాపురం)ని నచ్చిన పాత్రగా చెప్పేవారు. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో వచ్చిన 'మూగ మనసులు'లో పెంకి పిల్ల గౌరి ఆమె నట జీవితంలో ఓ మధుర జ్ఞాపకం. ఆ పాత్ర ప్రేక్షకుల హృదయాలలో సుస్థిరస్థానాన్ని కల్పించింది. హిందీలో అదే సినిమా (మిలన్) జాతీయ స్థాయిలో ప్రేక్షకులను అలరించగా, ఫిలింఫేర్ పురస్కారాన్ని అందుకున్నారు. అగ్రనటులతో నటించాలని ఆశపడే నటీమణులు ఉన్నట్లే జమునకు జోడిగా చేయాలని ఆశించిన నటులూ ఉన్నారు. అలా వచ్చిందే సీతారాం నట దర్శకతంలోని 'బొబ్బిలి యుద్ధం'.

**రంగస్థలం నుంచి వెండితెరకు....**

ఆ తరంలో చాలా మందిలానే జమున రంగస్థలం నుంచే వెండితెరకు వచ్చారు. బుర్రకథ పితామహుడు నాజర్ మల్లికార్జునరావు లాంటి హేమాహేమీలతో పదేళ్ల వయస్సులో 'మాభూమి' నాటకంలో నటించారు. 'నరక కూపమీ నైజాం పాలన' అనే పాటఆలాపన జనంలో ప్రకంపనలు పుట్టించేదట. 'ఖిల్జీ రాజ్యపతనం' నాటకంలోనూ నటించారు. ఈ నాటకాలే ఆమె సినీ రంగ ప్రవేశానికి బాటలే వేశాయి. కొత్త నటీనటులతో సినిమా నిర్మించాలనుకుంటున్న దర్శకుడు

# ఆత్మాభిమాని



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి

డా. గరికపాటి రాజారావు 'పుట్టింటి' చిత్రంలో జమునకు నాయికగా అవకాశం కల్పించారు.

'పుట్టిల్లు'తో సినీ రంగప్రవేశం చేసినా 'అంతా మనవాళ్లే'తో ఆమె నటజైత్రయాత్ర మొదలైంది. 'మిస్సమ్మ' మంచి గుర్తింపునిచ్చింది. విజయా సంస్థలో నటించాలనే కోరిక 'మిస్సమ్మ'తో తీరింది. అందులో వేషం దక్కడమూ నాటకీయమే. తనను సినిమాల్లోకి రావాలని ప్రోత్సహించిన సావిత్రికి చెల్లెలుగా నటించడం మరో ముచ్చట. ఆ సినిమా వారిద్దరికి ప్రత్యేకమైనదే. ముందు అనుకున్న ప్రకారం, 'మేరీ' పాత్రను భానుమతి, ఆమె చెల్లెలు 'సీత' పాత్రను సావిత్రి ధరించవలసి ఉంది. అయితే అనివార్య కారణాలతో భానుమతి తప్పుకోవడంతో ఆమె పోషించవలసిన మేరీ వేషం సావిత్రి పరం కాగా, తాను ధరంచవలసిన 'సీత' పాత్ర జమునకు దక్కింది 'ఏది ఎవరికి ప్రాప్తమో అంతే. నేను మిస్సమ్మలో' నటించకపోవడం వల్ల విచారం లేదు. సావిత్రి అనే చక్కని నటి త్వరగా తెలుగుసినిమాకు రావడానికి దోహదపడ్డాను' అని భానుమతి హుందాగా చెబితే, 'నా పాత్ర మారడం వల్ల జమునతో నటించే అవకాశం కలిగింది' అని సావిత్రి ప్రేమతో అనేవారు. సినిమా బంధం పటిష్టమై తన పెళ్లి సందర్భంగా సావిత్రి సొంత అక్కలా అన్నీ తానై నిలిచిందని చెప్పేవారు జమున. భర్త విద్యావేత్త ఆచార్య రమణారావు సంస్కారి. ఆమె సినీ, రాజకీయ, సామాజిక వ్యాపకాలకు చేయూతనిచ్చారు. 'నటన దైవప్రసాదం. విసుగు పుట్టేంత వరకు నటించు' అన్న ఆయన భరోసాతో పెళ్లి తరువాత సుమారు వంద చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు.

**కళాకారుల పక్షపాతి**

వృద్ధ కళాకారిణుల సంక్షేమానికి జమునలా చొరవ చూపిన వారు లేరనడంలో అతిశయోక్తిలేదు. ఆంధ్రప్రదేశ్ వృత్తికళాకారుల సమాఖ్య చైర్ పర్సన్‌గా వారికి అండగా నిలిచారు. పెద్ద సంఖ్యలో వారికి ఇళ్ల స్థల పట్టాలు ఇప్పించారు. పింఛన్లు, ఇతర ఆర్థిక ఆలంబన కోసం కృషి చేశారు. చెన్నయ్‌లో వృద్ధ కళాకారులకు 'సంఘీభావం' ప్రకటించి, వారితో తరచూ సమావేశమవుతూ వారిలో మనోధైర్యం నింపారు. ఆమె సేవకు మెచ్చిన అప్పటి



సావిత్రితో జమున

ముఖ్యమంత్రి టి. అంజయ్య ఆమెను రాష్ట్ర నాటక సంగీత అకాడమీ అధ్యక్షు రాలిగా నియమించారు.

తనకు సినిమాలో ఓనమాలు నేర్పించిన గరికపాటి రాజారావుకు జమున ఇల్లుకొని పెట్టారు. వారి కుటుంబానికి ప్రతి నెలా కొంత పైకం పంపేవారు. రాజమహేంద్రవరంలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

**చిత్రరంగానికి సామాజిక బాధ్యత**

'పిలక జడతో పదమూడేళ్ల వయసులో వెండి తెరకు పరిచయమైన నేను సినిమా తల్లి ఒడిలో పెరిగాను. నాకు అన్నీ ఇచ్చింది. సమాజంలో నాకు ఒక స్థానం, హోదా కల్పించిన సినిమాలో చోటు



చేసుకుంటున్న విపరీత ధోరణులను విమర్శించవలసి రావడం బాధాకరం అంటూ వర్తమాన ధోరణిపై తన అభిప్రాయాలను విస్పష్టంగా చెప్పేవారు. సినిమా కూడా వ్యాపారమే. అదే సమయంలో ప్రతి నిర్మాతకు సామాజిక బాధ్యత (సోషల్ ఆబ్లికేషన్) ఉండాలనే వారు. పిల్లలు, యువతపై సినిమాల ప్రభావం ఉంటుందనే వారు.

'ఈ తరం నటీనటులలో ఏ కొందరికో తప్ప నటన మీద అంత శ్రద్ధ ఉన్నట్లు కనిపించడంలేదు. ఏదో మొక్కుబడిగా నటిస్తున్నారేమో అన్పిస్తుంది. నటన సహజంగా ఉండాలే తప్ప కృత్రిమంగా కాదు. మొక్కుబడిగా అంతకన్నా కాకూడదు.' అని ఒక ముఖాముఖిలో నిర్మొహమాటంగా వ్యాఖ్యానించారు. ఆహార్యంలో నటీమణులు అనుసరిస్తున్న తీరుపై 'నాడు-నేడు' అనే రీతిలో విశ్లేషించేవారు. 'పనిమనిషి పాత్ర ధరిస్తున్నా ఖరీదైన దుస్తులు. నగలతో ఇవ్వాళ్ల కనిపిస్తున్నారు. పేద స్త్రీకి, పెద్దింటి స్త్రీకి తేడా లేకపోతే ఎలా? స్వరూపంలో, స్వభావంలో, నడకలో, మాటలో అన్నింటిలో తేడా ఉండాలి. అప్పుడే ఆ పాత్ర పండుతుంది. నాలుగు కాలాల పాటు నిలబడుతుంది' అని సుమారు పాతికేళ్ల క్రితమే ఒక ప్రత్యేక ముఖాముఖీలో చెప్పారు.

బయోపిక్‌లపై తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు జమున. బయోపిక్‌లను తీయడం తప్పు కాదని, అయితే కల్పితాలకు పోకుండా ధ్రువీకరణ సమాచారంతో ముందుకు వెళ్లాలనే వారు. హైదరాబాద్‌లో తొలిసారిగా తీసిన చిత్రం (మా ఇంటి మహాలక్ష్మి/1958)లో కథానాయిక. నాటి మదరాసు నుంచి హైదరబాద్ మారిన తొలి కథానాయిక.

సినిమా నిర్మాణం పట్ల ఆసక్తి లేకపోయినా, దర్శకత్వం వహించాలన్నది తీరనికోరికగానే మిగిలిపోయింది. రచయిత్రి డి. కామేశ్వరి నవలను 'డాక్టర్ మమత'గా తీయాలనుకున్నారు. పాటల రికార్డింగ్ లాంటి ప్రాథమిక పని కూడా ప్రారంభమై నిలిచిపోయింది.

**అచ్చిరాని రాజకీయం**

ఆత్మాభిమానం గల ఆమె రాజకీయాలలో అంతగా ఇమడలేకపోయారు. 1980వ దశకంలో తెలుగుదేశం అధినేత ఎన్టీరామారావు ప్రభంజనాన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సినీరంగం నుంచి జమునను అస్త్రంగా ఎంచుకుంది. అప్పటికే సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన ఆమెను ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఆహ్వానించింది. సరిహద్దు రాష్ట్రాలలో పార్టీ తరపున ప్రచారం చేశారు. 1985లో మంగళగిరి నియోజవర్గం నుంచి ఆమె పోటీ చేసినా పార్టీ నాయకులు కొందరి నుంచి సహాయ నిరాకరణ ఎదురై ఓటమి పాలయ్యారు. అటు తర్వాత రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానంలో విజయం సాధించి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. అయితే పట్టుమని పది నెలలు కూడా ఆ పదవిని నిర్వహించలేకపోయారు. 'సినిమాల్లో పురుషాధిక్యం; రాజకీయాలలో మహిళాధిక్యం' మిగిల్చిన చేదు అనుభవాలతో రాజకీయాలకు స్వస్తి చెప్పి స్వచ్ఛంద సేవలో నిమగ్నమయ్యారు. జీవకారుణ్యం పట్ల ఆసక్తి గల ఆమె రాజమండ్రిలో జీవకారుణ్య సంస్థకు భవనం ఇచ్చారు. 86వ ఏట జనవరి 27న అస్తమించిన చలాకీ జాబిల్లి జమున 'గోదారి గట్టు, గట్టు మీన సెట్టు, సెట్టు మీద పిట్ట' ఉన్నంత దాకా ప్రేక్షకుల మదిలో నిత్య 'సత్యభామ'.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# ‘పద్మ’భారతీయం




‘పద్మ’ అంటే విశేషం, బుద్ధి, నిధి. పురస్కారమంటే పెద్దరికం, గౌరవం, ఖ్యాతి. పద్మ పురస్కారాలకు ఎంపిక కావడమన్నది ఈ అన్నింటి సమాహారం. భారత గణతంత్ర దినోత్సవ సందర్భాన ప్రకటించిన పద్మ విజేతలంతా విభిన్న రంగాలవారు. మొత్తం 106 మందిలో ఆరుగురు పద్మవిభూషణులు, తొమ్మిదిమంది పద్మభూషణులు, తొంభై ఒక్కమంది పద్మశ్రీలు. వీరిలో తెలుగువారు పదిమంది అయితే; ఆధ్యాత్మికంగా శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి, రామచంద్రమిషన్ కమలేశ్ డి.పటేల్‌తో కలిపి పన్నెండు పురస్కృతులు. ఆంధ్రప్రదేశ్‌లో – కీరవాణి (చలనచిత్ర సంగీత దర్శకుడు) సహా ఏడుగురు, తెలంగాణ నుంచి ముగ్గురు పద్మశ్రీమంతులు. మహిళామణుల్లో ఆయా పురస్కృతులకు సంబంధించి వివిధ ప్రాంతాలవారైన వాణీజయరాం, సుధా నారాయణ మూర్తి, సుమన్ కళ్యాణ్‌పుర్, రవీనాటాండన్, డాక్టర్ సుజాత రామదొరై, ప్రీతికనా గోస్వామి, హేమప్రభా చుటియా ఉన్నారు. ఒక్కొక్కరు ఒక్కో రంగంలో నిపుణులు. కొందరు పలురంగాల ప్రవీణులు. కళలు, సారస్వతం, విద్య, వైద్యం, పౌరసేవ, శాస్త్రం, వాణిజ్యం, ఇంజనీరింగ్, పరిశ్రమలు, ప్రజా వ్యవహారాలు, క్రీడలు మరెన్నో అంశాల నిష్ణాతులు ఈ విజేతల వరసలోనివారే. పద్మాల పంట పండించుకున్న వీరంతా రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటయ్యే ప్రత్యేక మహోత్సవంలో ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా పురస్కారాల స్వీకర్తలవుతారు. వనితా విజేతల మొత్తం సంఖ్య 19. కీలక అంశాలను ఒకసారి కవితాత్మకంగా అవలోకిస్తే...

**వాణీజయరాం**

*సుమధుర స్వరవాణి – సంగీత*
*చిత్రగీతికల రసతరంగిణి*
*ఐదు దశాబ్దాల ఆ విద్వన్మణి*
*సరిగమల శ్రుతిలయల పద్మభూషణి.*

*తమిళనాట జనించిన కలైవాణి*
*గాత్ర సంపదల నిత్య నవీన అలవేణి*
*బాల్యం నుంచే సుశిక్షణతో*
*తనదైన పటిమ చాటిన రసధుని.*

*కవితల్ని పఠించి, కమనీయంగా ఆలపించి,*
*ఆకాశవాణి వేదికగా తీయదనాలొలికించి*
*కచేరీల బాటపట్టి, విరాట్టుగా ఆవిర్భవించి*
*అంతటా తానై నిండిన సరస్వతి ముద్దులపట్టి.*

*ఆమెది నిత్య ప్రయాణం*
*అది నిరంతర గీత ప్రవాహం*
*తెలుగైనా తమిళమైనా*
*మలయాళ, కన్నడ భాషల్లో నైనా*



వాణీ జయరాం



సుధా నారాయణమూర్తి



*ఏం పలికినా, ఏది పాడినా*
*తనదాక ఝరి, వీనుల విందైన మాధురి.*
*వేలాది పాటల తేనెల ఊటలతో*
*ఆబాలగోపాలాన్నీ మైమరపించిన*
*వాణీజయరాం.... ‘పద్మ’ మణిహారం!*

**సుధామూర్తి**

*విద్యా విజ్ఞాన వికాస సాహితీవేత్త*
*అణువణువునా సేవాభావన నిండిన మాత*
*నేతృత్వమైనా దాతృత్వంలోనైనా*
*తనకు తానే సాటి అనిపించుకున్న వనిత.*

*వృత్తి జీవితం శాస్త్ర సాంకేతికమైనా*
*ప్రవృత్తిలో వితరణ గుణసంపన్న*
*ఆశ్రమాలు స్థాపించి, ఆశ్రయాలు కల్పించి*
*ఎందరెందరినో ఆదుకున్న అగ్రగణ్య*
*పల్లెల బాగుదల, చదువుల పెంపుదల*
*ఆశయాలుగా పరిశ్రమించిన అనన్య*
*చెక్కు చెదరని స్ఫూర్తి సుధామూర్తి*
*గ్రంథాలయ విస్తరణోద్యమ దీప్తి*

కర్ణాటక ప్రభుత్వ పాఠశాలల్లో అనేకం
ఆమె సేవా నిరతితో అయ్యాయి ధన్యం.
ఎంత ఎదిగినా ఎంతో ఒదిగే తత్వం
నిరాడంబర జీవనానికి తానే ఒక నిదర్శనం.

**సుమన్ కళ్యాణ్‌పుర్**

మహారాష్ట్రలో స్థిరపడిన గానలతిక
సంగీత కళారంగాల్లో ఎదురేలేదిక
అనేక భాషల్లో ఎన్నెన్నో పాటలతో
ప్రతి ఒక్కరినీ మురిపించిన మాలిక
దేశ విదేశాల్లో భారతీయ సంస్కృతిని
గొంతుకతో పరివ్యాప్తంచేసిన నాయిక
తన మెడలోని పూలహారంలో
పద్మభూషణ చేరికతో తనదే ఇక వేదిక.

**రవీనా టాండన్**

అందచందాల ఖజానా
సేవా సహాయాల నజరానా
ముందుండి ఆదుకోవడంలో

వైజ్ఞానిక అంశాల సలహాదారుగా
సృజనమండలిలోని బృంద సభ్యురాలిగా
ఆ సేవ నిరుపమానం, ఆ శక్తి సామాన్యం.
పద్మ పురస్కార ప్రకటనతో
అయింది వృత్తి జీవితం చరితార్థం.

**ప్రీతికనా గోస్వామి**

అతి సామాన్య కుటుంబాన పుట్టి
ఉపాధి కోసం కుట్టుపనిలోకి అడుగిడి
నిపుణత చూపి ఆకట్టుకున్న అతివ
అవగాహనలో, పనివేగంలో
సాటిలేని మేటిగా నిలిచిన లలన,
తాను నేర్చిన కళాప్రక్రియను
వేలమందికి నేర్పించిన ప్రజ్ఞాధురీణ
పద్మశ్రీకారంతో వెలుగొందుతున్న తాను
స్వప్నసాకారంలో ప్రథమం
విధి నిర్వహణే తనకు ప్రధానం.



సుమన్ కళ్యాణ్‌పుర్ | రవీనా టాండన్ | సుజాతా రామదురై | ప్రీతికనా గోస్వామి | హేమప్రభా ఛుటియా

ఎప్పుడూ మిన్నగా ఉండే అంగన.
తెలుగుతో పాటు ఇతర భాషల చిత్రాల్లో
రాణించి మెప్పించిన అన్నులమిన్న
అడుగిడిన ప్రతీ రంగాన
తనకంటూ తనదంటూ
బోధన, సాధన, శోధన
సాంస్కృతిక సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ
పడతుల సాధికారత, బాలికా విద్యా విస్తారత
లక్ష్యాలుగా ఉన్న విలక్షణ మహిళామణి
నవత, సమత, మమతల రసధుని
సంపాదించినదానిలో అగ్రభాగాన్ని
సేవారంగానికే కేటాయించిన జనజీవని.

**సుజాతా రామదొరై**

గణిత సిద్ధాంత కర్త, విస్తృత స్థాయి వక్త
ఆచార్యురాలిగా, పరిశోధక ప్రముఖురాలిగా
దేశవిదేశాల్లో పేరొందిన వ్యవహర్త
పాఠాల, ప్రయోగాల, శోధన విధుల్లో
ప్రతిభా సామర్థ్యాలు కనబరచిన కర్త.

**హేమప్రభా ఛుటియా**

చేనేతను ఊతం చేసుకొన్న కళాప్రభగా
ఈ అసాం స్త్రీది మహత్తర విభవం
జగద్విఖ్యాత భగవద్గీతను
వందలాది అడుగుల వస్త్రంపైన నేసిన ప్రాభవం,
మొదట సంస్కృతంతో సాగించి
అటు తర్వాత ఆంగ్లంలోకి అనువదించి
వస్త్రాలమీద కనువిందుగా దిద్ది తీర్చిన పనితనం.
ధార్మిక,కళాత్మకతలను మేళవించిన వైనం
అఖిలావనికీ మేలిమి సందర్భం.

సకల ప్రోత్సాహం, సమున్నత పురస్కారం ఎవరినైనా ఉత్తేజ పరుస్తాయి. మరిన్ని ఆవిష్కరణలకి దారితీసి, సరికొత్త కళాకాంతులను జాతికి ప్రసాదిస్తాయి. కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రకటించి బహూకరిస్తున్న పురస్కృతులు ఆయా ప్రక్రియలకు సరైన గుర్తింపూ గౌరవాలు. మన చరిత్ర, సంస్కృతి, నాగరికతలకి పట్టం కడుతున్న పద్మ పురస్కారాలు జాతి జనతకు ఖ్యాతి కిరీటాలు, మణిమయ మకుటాలు. ఇవే దేశాన్ని వెలిగిస్తాయి. చూస్తున్నాం, వింటున్నాం కదా! అందరం అందాం... మేరా భారత్ మహాన్. ★



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

# సెక్యులరిజం ముసుగు కింది చరిత్రకు సాంత్వన 'ఆవరణ'

ఆయన నవలలన్నీ మేధోసాగరం నుంచి ఎగసిపడే అందమైన అలల వంటివి. వాటికి స్వీకరించిన ఇతివృత్తాలన్నీ వైవిధ్యభరితమైనవి. అనితర సాధ్యమైన రచనా శైలి ఆయన సొంతం. భాషా పటిమ, రసానుభూతులతో ఉండే ఆ నవలలన్నీ పాఠకుల చేత ఏకబిగిన చదివించే గుణమున్నవే. ఆయన విఖ్యాత కన్నడ భాషా రచయిత సంతేశివర లింగణ్ణయ్య (ఎస్ఎల్) భైరప్ప. ఒక జాతి ప్రాచీన సాహిత్యం, చరిత్ర వర్తమానంతో సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉంటాయి. ఎందుకంటే అవి ఆ జాతి ఆత్మ ఔన్నత్యానికి సంబంధించినవి. ఆ సంపదను తృణీకరించడం, వక్రీకరించడం, అవమానించడం గురించే భైరప్ప తపన అంతా. వేగంగా సాగిపోయే కాలంలో సంప్రదాయం



ఎస్ఎల్ భైరప్ప

ప్రమేయం ఏమిటో చెప్పే నవల 'వంశవృక్ష'. కులవ్యవస్థలోని పలు అంతరాలను ఆవిష్కరిస్తుంది 'దా టు'. సీతా సాధ్వి దృష్టికోణం నుంచి శ్రీరాముడిని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నమే 'ఉత్తరకాండ' నవల. మహాభారత మహాకావ్యాన్ని పూర్తి సామాజిక కోణంనుంచి పునర్లిఖించి, దానికి 'పర్వ' అని పేరు పెట్టారు. ఎనిమిదో శతాబ్దపు భారతదేశంలో సంశయంలో పడిన సంస్కృతిని గురించి చర్చించిన నవల 'సార్థా'. బాధామయమైన తన బాల్యాన్ని భైరప్ప 'గృహభంగ' పేరుతో నవలీకరించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అత్యవసర పరిస్థితి విధించే వరకు భారతీయ సమాజంలో సర్వవ్యాప్తమైన పతనం మీద నిశిత వ్యాఖ్య 'తంటు' నవల. 'తబ్బాలియు నానీడె మాగాణె', 'అంచు', 'సాక్షి', 'ఆవరణ' వంటి పాతిక వరకు నవలలు భైరప్ప అందించి, భారతీయ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. మట్టివాసన వేసే భారతీయమైన సంప్రదాయాలు అడుగంటి నెహ్రూ యుగంలో కమ్యూనిజం, ద్వేషం నుంచి కొత్త సమాజం ఆవిర్భవిస్తుందన్న వాదించే మార్గాలు సాహిత్యంలో చొరబడినప్పుడు వాటిని నిరోధించే ప్రయత్నం చేసిన వారిలో భైరప్ప ఒకరని విమర్శకుల అభిప్రాయం. సామాజిక బాధ్యత పేరుతో ప్రతిభ, పాండిత్యం మరుగున పడినాయి. రచనకు విలువ కట్టేందుకు నెహ్రూకు ప్రీతిపాత్రమైన అంశాలు పడికట్టు రాళ్లయినాయి. వాటిలో తూగిన రచనలే రాజ్యమేలాయి. వాటి రచయితలే పురస్కారాలకు అర్హులయ్యారు. ప్రధాని పదవిలో నరేంద్ర మోదీ ఉన్నారు కాబట్టే నాకు పద్మభూషణ్ పురస్కారం దక్కిందని సాక్షాత్తు భైరప్పగారే 'డెక్కన్ హెరాల్డ్' (జనవరి 26, 2023) ఆంగ్లపత్రికతో జరిపిన ముఖాముఖీలో పేర్కొనడం అందుకే.

భైరప్ప రచనల తాత్త్వికత, ఆయన అక్షరాల నిండా గుబాళించే భారతీయ విలువలు, ముఖ్యంగా వీటిని ఏ వేదిక మీదనైనా ప్రకటించగలిగే ఆయన నిర్భీకత ఈ దేశాన్ని చాలాకాలం ఏలిన రాజకీయ పార్టీనీ, దానినే అంటకాగిన పరాన్నజీవులైన రచయితలని ముమ్మాటికీ భయపెట్టేవే. ఆయన రచనా విధానం ఏ ప్రత్యేక సాహిత్య పాయకు సమాంతరంగా సాగలేదు. అదొక స్వేచ్ఛాధార. అభ్యుదయం, దళిత సాహిత్యం, సామాజిక బాధ్యత వంటి గీటురాళ్లతో కొలవడం సాధ్యంకాని శైలి ఆయనది. కానీ ఈ అంశాలన్నీ ఆయన రచనలలో వెలుగొందినవేనన్న మాట విస్మరించలేం. మీరు గంభీరమైన, నిష్కపటమైన రచనా వ్యాసంగం చేయాలంటే అందుకు జ్ఞానం కావాలని చెప్పారాయన. ఇప్పటికాలం చాలామంది రచయితలకు సుతరామూ ఇష్టంలేని మాట ఇదే. భారతీయ తత్త్వశాస్త్రంతో పరిచయం, నిజమైన పరిశోధనా దృష్టి ఇవన్నీ ఉంటేనే గంభీర రచనా వ్యాసంగం సాధ్యం అంటారాయన. ఈ మాటలు చాలామంది రచయితలు విననివి. ఆ మాట కూడా ఆయనే చెప్పారు, 'ఇవేవీ ఇప్పటి రచయితలకు పట్టడం లేదు' అని (ఆర్గనైజర్, ఆగస్ట్ 22,2020).

'పురస్కారాలు రావచ్చు రాకపోవచ్చు. కానీ ఒక రచయితకు నిజమైన పురస్కారం ఏదీ అంటే, అతడు మరణించిన తరువాత కూడా ఆ రచన బతికే ఉండాలి. అసలు ఏ రచయితకు ఏ పురస్కారం వచ్చింది అన్న ప్రశ్న పాఠకులకు పట్టనే పట్టదు. వారు ప్రేమించేది ఆ రచనని. కన్నడలో కుమారవ్యాస ఉన్నాడు. ఆయన మరణించిన 500 వందల ఏళ్ల తరువాత కూడా ఆయన 'కుమార వ్యాస భారత'ను ప్రతి గ్రామంలోను చదువుకుంటున్నారు. అంతటి సారం నా రచనలలో ఉంటే అదే నాకు అతి పెద్ద పురస్కారం. మిగిలినవన్నీ రచయితను ఆనందింప చేసే పురస్కారాలు మాత్రమే.' అన్నారు 92 ఏళ్ల భైరప్ప (జనవరి 26, డెక్కన్ హెరాల్డ్). రచయితగా ఆయన షష్టిపూర్తి చేసుకున్నారు.

మన పురాణేతిహాసాల మీద, అందులోని విలువల మీద భైరప్ప రచనలలో విశేష గౌరవం కనిపిస్తుంది. అవన్నీ కాలగర్భంలో కలిసిపోయినవిగా కాకుండా, వర్తమాన సమాజపు విలువలకు పునాదులుగానే భైరప్ప పరిగణించారు. వాటిని కాలిక స్పృహతో విశ్లేషించే వినూత్న ప్రయత్నం చేస్తారు కూడా. మహాభారతం, రామాయణం జరిగాయా, నిజమా? అని ప్రశ్నించే వారైనా వాల్మీకి, వ్యాసాదుల ఉనికినీ, కాలాన్నీ గుర్తించి తీరాలి. అలా వ్యాసుడి కాలం నాటి సామాజిక పరిస్థితులనే తీసుకుని, భారతగాథకు అన్వయిస్తూ 'పర్వ' నవల రాశారు. ఇది ఎన్నో పునర్ముద్రణలకు నోచుకుంది.

ద్రౌపదికి ఐదుగురు భర్తలు అని చెబుతుంది భారతం. హిమాలయాల దగ్గరి కొన్ని గ్రామాలలో ఇప్పటికీ అలాంటి ఆచారం కొనసాగడం భైరప్ప స్వయంగా గమనించారు. అసలు అంపశయ్య అంటే




ఏమిటి? దాని మీదకు చేరిన భీష్మాచార్యులవారు అంతిమ క్షణాలను గడిపిన తీరు ఏమిటి? గీతాబోధ కురుక్షేత్రంలో కాకుండా, ఒక పక్కన నరనారాయణుల మధ్య జరిగిన తాత్త్విక చర్చగానే మనం 'పర్వ'లో చదువుతాం. ధృతరాష్ట్రుడి నూర్గురి సంతానం గురించి కూడా మనకు ఒక వినూత్న విశ్లేషణ కనిపిస్తుంది. డాక్టర్ కొండేపూడి లక్ష్మీనారాయణ దీనిని అదే పేరుతో తెనిగించారు.

మొదటే చెప్పినట్టు భైరప్ప రచనలన్నీ మేధోవాదం నుంచి ఎగసిన అందాల అలలే అయినా, గాయపడిన మధ్య యుగ భారతీయ సమాజపు మహా దుఃఖం అక్షరరూపం దాల్చి ఉత్తుంగ తరంగంలా ఎగసిపడి నట్టు అనిపిస్తుంది 'ఆవరణ' నవల. ఉదారవాదం, సెక్యులరిజం పేర్లతో చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే పనిగా పెట్టుకున్న ఒక వర్గం మేధావులూ, రచయితలూ ఈ అలలో కొట్టుకు పోయిన మాట వాస్తవం. పాఠకులకు ఇదొక అలలా కాదు, నేరుగా ముఖాన్ని ముట్టడించిన వడగళ్ల వానే అనిపిస్తుంది. అందుకే ఈ నవల మీద అంత వివాదం లేచింది. ఎంత వివాదం ఉన్నదో, ఒక రచనగా అంత ఆదరణకు కూడా ఇది నోచుకున్నది. చారిత్రక వాస్తవాల మీద సెక్యులరిజం పేరుతో జరిగిన పెను దాడిని భైరప్ప ఈ నవల ద్వారా పాఠకుల ముందుకు తెచ్చారు. నీ చరిత్రనూ, నీ సంస్కృతినీ, ధర్మాన్నీ నువ్వే దగా చేస్తున్నావని ఉదారవాదులకు భైరప్ప చెంప చెళ్లుమనిపించే తీరులో విశ్లేషిస్తారు.

'ఆవరణ: ఒక ముసుగు' పేరుతో ఈ నవలను భైరప్ప వెలువరించారు. ఇక్కడ ఆవరణ అంటే సత్యాన్ని దాచిపెట్టే మాయాజాలం. అల్ప సంఖ్యాకు లను బుజ్జగించడానికి పూర్వికుల వ్యథను, నిస్సహాయతను, ధార్మిక పోరాటాన్ని చులకన చేసిన శిబిరం, భారతీయతను తృణీకరించే రాజకీయ వాదం–రెండు అవాంఛనీయ శక్తులు ఏకమై చరిత్రకు మసిపూసేందుకు పూనుకున్న మాట నిజం. మేధోపరంగా, చరిత్ర రచన కోణం నుంచి ఇదెంత దగాయో చెప్పే గొప్ప యత్నమే 'ఆవరణ'.

భారతదేశంలో సనాతనులు 'హిందూ మూలాలు వెతుకుతున్న'ట్టు నిందలు ఎదుర్కొంటున్న సమయమే ఈ నవలారంభం. అంటే అయోధ్య రామజన్మ భూమిలో కట్టిన బాబ్రీమసీదు కూల్చివేసిన ఐదువారాల తరువాత. అలా హిందూ మూలాలు వెతుక్కుంటూ పోతే దేశ ఐక్యత ఏమైపోతుందన్నదే ఉదారవాదుల సందేహం. దీని కోసం ప్రభుత్వ అధికారులు కనిపెట్టిన దివ్య ఔషధం ప్రతి మనసు లోను సహిష్ణుతను నింపడం. అందుకోసం హంపి మీద ఒక డాక్యుమెంటరీ నిర్మించిపెట్టమని చిత్ర దర్శకుడు అమీర్; అతడి భార్య, చిత్రానువాదకురాలు రజియాను నియమిస్తారు. వాస్తవంగా హంపీ నగరాన్ని ముస్లింలు నాశనం చేశారు. కానీ ఈ డాక్యుమెంటరీలో 'అల్ప సంఖ్యాకులను గొప్పగా చూపించేందుకు' ఎక్కువ వాటా ఇవ్వాలన్నది ప్రభుత్వ 'అలిఖిత' ఆదేశం. ఈ పనికి ముస్లిం అయినందుననే తనని ప్రభుత్వం ఎన్నుకున్నదన్న నమ్మకం అమీర్‌కు ఏదో ఒక మూల లేకపోలేదు. డాక్యుమెంటరీకి రచనను అందించే క్రమంలో రజియా ఎదుర్కొన్న మానసిక సంఘర్షణే ఈ నవలకు చోదకశక్తి. అది సంఘర్షణ నుంచి జనించిన సత్యాన్వేషణ. అదే ఇతివృత్తం కూడా. ఐదుపదులు నిండిన రజియా తను లవ్ జిహాద్ వలకు ఎలా చిక్కినదీ, తిరిగి హిందూత్వ వైపు ఎలా జరిగినదీ, అందుకు దోహదం చేసిన పరిస్థితులు ఈ క్రమంలో ఉంటాయి. ఇక్కడ రచయిత గతాన్నీ, వర్తమానాన్నీ మాట్లాడిస్తూ, కేవలం పరిచయకర్తగానే కనిపిస్తారు. 'ఈ నవలలో చారిత్రక విషయాల్ని ప్రస్తావించేటప్పుడు నేను ఎలాంటి జోక్యం చేసుకోలేదు' అన్నారాయన.




మీరు మతం మారవచ్చు, కానీ మీ మూలాలు మారలేదు అన్నది ముస్లింలకు ఎందరో పెద్దలు, విజ్ఞులు చెప్పినమాట. హంపిలో ధ్వంసమైన ఉగ్ర నరసింహ విగ్రహం రజియాను తన గతం దగ్గరకి తీసుకుపోయినట్టు రచయిత చిత్రించడం అలా గుర్తు చేసే ప్రయత్నమేననిపిస్తుంది. కర్ణాటకలోని ఒక గ్రామం. ఆ ఊరివారే నరసప్ప గౌడ. ఆయన కుమారుడు నరసింహ గౌడ. వీరి కులదైవం నరసింహుడే. ఆ ఊళ్లోని గుడిలోను హంపి ఉగ్ర నరసింహుని పోలిన విగ్రహమే ఉంది. వీరిలో నరసింహ గౌడ కూతురు లక్ష్మి. హంపి ఉగ్ర నరసింహుని చూస్తే తన మనసులో కలవరం ఎందుకో అప్పటికి ఆమెకు అర్థం కాదు. వామపక్షాల విద్యార్థి, సాంస్కృతిక విభాగంలో సభ్యుడు అమీర్. తనకు మతం మీద నమ్మకం లేదంటూనే తన సహ విద్యార్థిని లక్ష్మికి దగ్గరయ్యాడు. ఆమెను మతం మారమంటాడు. ఎందుకు? 'సమాజం మారి బీదల పాలిట మత్తు మందు అయిన మతం అన్నిచోట్లా నాశనం అయ్యే రోజు ఎంతో దూరంలో లేదు. అందుకే ఈ స్ట్రాటజీ' అన్నాడు అమీర్. దీనికి నరసింహ గౌడ చెప్పిన మాట– అంత ప్రేమే ఉంటే అతడే హిందువుగా మారవచ్చు. అప్పుడు నేనే కాళ్లు కడుగుతాను. అలాగే, నీ కడుపున పుట్టిన బిడ్డ అతని బిడ్డ. ఏదో ఒక తరంలోని వాడు మన దేవాలయాన్ని పగలగొట్టి నాశనం చేస్తాడు. ఆ పాపం నీకు తగులుతుంది... మొగలు పాదుషా జహంగీరు, అతని కొడుకు షాజహాన్ హిందూ తల్లుల కడుపున పుట్టినా అధికారంలోకి రాగానే హిందూ దేవాలయాలను పడగొట్టారు. పడగొట్టాలని వారి మతం చెబుతూంటే వారలాగే నడవాలిగా...' అన్నాడు. ఏ కాలం నాటి మాటలు నాన్నా అంది ఆమెలోని 'పురోగామి' ఆవేశం. ప్రొఫెసర్ శాస్త్రి అనే వీర అభ్యుదయవాది,

(ఆవరణ తెలుగు అనువాదం : అరిపిరాల సువర్ణ, ప్రస్తుతం సాహిత్యనికేతన్‌లో లభిస్తోంది.)

అంతర్జాతీయ ఉదారవాది ఈ పెళ్లి చేస్తాడు. ఇతడు, లక్ష్మి ఒక ఊరివారే. కానీ అనతికాలంలోనే లక్ష్మి వంటి మీద బురఖా వచ్చింది. గొడ్డు మాంసం తినక మత గురువుల ఆగ్రహానికి గురైంది. ఈ ఒక్కదానికి అంగీకరించు అని అమీర్ అంటూ ఉంటే అన్నింటికి రాజీ పడిపోతూనే బతికింది. నజీర్ అనే కొడుకును కన్నది. లక్ష్మి రజియా అయింది. 'నేను వచ్చి చేరిన ఈ మత ధర్మాలలో ఉన్నంత కఠిన నియమాలు వదిలేసి వచ్చిన మతంలో లేనేలేవు' అనే నిర్ధారణకు వచ్చింది. మూడు దశాబ్దాల తరువాత ఆమెకు వెనక్కి తిరిగి చూసుకునే సందర్భం వస్తుంది–తండ్రి మరణ వార్తతో. అది కూడా హంపి చిత్రీకరణలో ఉండగానే.

గ్రామంలో శేషశాస్త్రి, ఆయన భార్య అచ్చమ్మ లక్ష్మిని చాలా సాదరంగా ఆహ్వానిస్తారు. శేషశాస్త్రి, నరసింహ గౌడ స్నేహితులు. ఇంతకీ ఈ శేషశాస్త్రి కుమారుడే ప్రొఫెసర్ శాస్త్రి. ఇంగ్లండ్ వెళ్లి శ్వేత జాతీయురాలిని పెళ్లి చేసుకుని వచ్చాడు. లక్ష్మి తన తండ్రి గదిలో ఒక చరిత్ర నిధినే చూస్తుంది.

**ఢిల్లీలో జరిగిన పెద్ద సదస్సులో లక్ష్మి/రజియా చరిత్రకారుల మీద, ఉదారవాదుల మీద తిరుగుబాటు చేస్తుంది. జాతీయ సమైక్యత పేరుతోనే చరిత్ర మీద, హిందూ సంస్కృతి మీద బాహాటంగా జరుగుతున్న దాడి మీద లక్ష్మి చేసిన ప్రతిదాడి ఇది. కానీ ఆమె వాదన ఏదీ పత్రికలలో రానివ్వలేదు. ఈ నవలలోని అంశాలు సమకాలికమే అనిపిస్తాయి. అదే మైనారిటీల బుజ్జగింపు. మార్క్సిస్టు భావాల చరిత్రకారుల అదే దగా. ముస్లింలలో అదే ఆధిపత్య భావన. వీటన్నిటినీ గొప్ప మానవతా స్పృహతో, తర్కబద్ధంగా, చారిత్రక ఆధారాలతో ఆవిష్కరించారు భైరప్ప.**

అమీర్, ప్రొఫెసర్ శాస్త్రి హంపి పతనానికి చెప్పిన విషయాలు ఎంత బూటకాలో తన తండ్రి పుస్తకాలు చదివి రాసుకున్న వ్యాఖ్యానాలే చెబుతాయి. ఒక వాస్తవ చరిత్రను రాయాలని ఆయన కోరిక. విజయ నగరంలో ముత్యాలు, రత్నాలు రాశులు పోసి అమ్మే వారంటే ఇక్కడ పేదల రక్తాన్ని ఎంతగా పీల్చారో అర్థం కావడం లేదా అంటాడు అమీర్. ముస్లింలు మనం అనుకున్నంత క్రూరులుకారన్నది ప్రొఫెసర్ శాస్త్రి వాదం. వైష్ణవంమీద కోపంతో, శైవులే ముస్లింలకు సహాయపడి దాడి చేయించారని అంటాడు శాస్త్రి. ఇందుకు ఉదాహరణ వైష్ణవాల యాలు నాశనం కావడం, శివాలయాలు క్షేమంగా ఉండడమే అంటాడు. అలా హంపి విధ్వంసంలో ముస్లిమల పాత్రను తగ్గించడమే వీళ్లందరి లక్ష్యం. కానీ తండ్రి సేకరించిన పుస్తకంలో ఒకదానిలో ఎన్ని శివాలయాలు అప్పుడు ధ్వంసం చేశారో కూడా ఉంది. తండ్రి అస్థికల నిమజ్జనం కోసం లక్ష్మి ప్రాయశ్చిత్తం చేసుకుంది. ఇక గొడ్డుమాంసం ముట్టరాదన్నది అందులో భాగం. ఈ నిర్ణయం పట్ల అమీర్ స్పందన ఒక స్త్రీగా లక్ష్మిని దారుణంగా కుంగ దీస్తుంది. పూర్తిగా శాకాహారి అయిన స్త్రీ దగ్గర పడుకోవడానికి ఏం ఉంటుంది అంటాడు.

టిప్పుసుల్తాన్ గురించి కూడా ఒక డాక్యు మెంటరీ తీయాలి కాబట్టి మరొక రచన చేయమని స్వగ్రామంలో ఉన్న లక్ష్మికి చెబుతాడు అమీర్. చాలామంది ఉదారవాదులు, మేధావులు టిప్పుకు జాతీయ నాయకుడు హోదా కట్టబెట్టడం ఎంత అవాంఛనీయమో కూడా తండ్రి పుస్తకాల ద్వారా గ్రహిస్తుంది. టిప్పు కలలు ఎంత దారుణమైనవో, ఎంత క్రూరమైనవో ఆమెకు అర్థమవుతుంది.

నవలలోని ప్రతి మలుపు, ప్రతి చావు ఘట్టం చాలా పెద్ద విషయాన్ని వెల్లడించడం కనిపిస్తుంది. అచ్చమ్మగారు మరణించారు. అమ్మ అంతిమ దర్శనం కోసం వచ్చిన ప్రొఫెసర్ శాస్త్రి గుండు గీయించుకుని అంత్యక్రియలు చేయడానికి ఒప్పుకోడు. అలా చేస్తే తన మార్క్సిస్టు మేధావి ఇమేజ్‌కు పెద్ద నష్టమని ఈ చైనా భక్తుడి నమ్మకం. ఆఖరికి ఆమె అల్లుడు అంత్యక్రియలు నిర్వహించాడు. ఆ అస్థికలు పట్టుకుని లక్ష్మి వెంట రాగా అచ్చమ్మగారి అల్లుడు, కూతురు కాశీ వెళ్లారు. తండ్రి సేకరించిన పుస్తకాలలో కనిపించిన కాశీ పతనం, ఉత్తర భారతంలో ముస్లిం దాడుల గురించి ప్రత్యక్షంగా చూడాలన్నదే ఆమె కోరిక. ప్రొఫెసర్ శాస్త్రికి ఎక్కడో ఒక న్యూనతా భావం.

అందుకే పట్నా విశ్వవిద్యా లయంలో ఉపన్యాసం పేరుతో వెళ్లి, గయలో పిండం పెట్టాలని చూస్తాడు. ఈ పనిని పట్నా సభతో వచ్చే డబ్బుతో కానివ్వాలని అనుకుంటాడు. అక్కడ క్షురకుడు చేసిన పనితో నిశ్చేష్టుడయ్యాడు. పిండం పెట్టాలంటే జుట్టు తీయాలంటాడు పురోహితుడు. ఏదో శాస్త్రానికి నాలుగు వెంట్రుకలు తీయమంటే క్షురకుడు మొత్తం తీసేస్తాడు. నాలుగో, ఐదో వెంట్రుకలు తీయాలంటే బార్బర్ షాపుకి వెళ్లాలి గాని, ఇక్కడ సాధ్యంకాదని, సంప్రదాయోల్లంఘనకు పాల్పడడం తమకు సాధ్యం కాదని చెబుతాడు క్షురకుడు. ఇక కాశీలో రిక్షా ఎక్కిన లక్ష్మికి మరొక అనుభవం. రిక్షావాలా పేరు విశ్వనాథశర్మ. సంస్కృతం చదువుకున్నాడు. కానీ తాను బెంగళూరు మేధావుల సభలలో, చర్చలలో విన్నదానికీ తాను చూస్తున్నదానికి ఉన్న వ్యత్యాసం ఆమెకు తెలుస్తుంది. కాశీ దండయాత్ర వేళ పట్టకారుతో బ్రాహ్మణుల నోళ్లు తెరిచి ముస్లింలు ఉమ్మిన ఘట్టాల గురించి విశ్వనాథ శర్మ చెబుతాడు.

ఇక్కడ జ్ఞానవాపి మసీదు ఎలా పుట్టిందో రచయిత చెప్పిన తీరు పాఠకులను వెంటాడే విధంగా ఉంటుంది. ఒక రాజస్తాన్ రాజ్యం మీద ముస్లింల దాడి, జౌహర్ వ్రతం, యువరాజును మతం మార్చడం, లైంగికంగా ఉపయోగించుకోవడం, అతడు చేతులు మారడం, అంతిమంగా కాశీని ధ్వంసం చేయడానికి వచ్చిన బృందంలో ఉండడం చదువుతాం. నాటి ముస్లిం దురాక్రమణదారుల లైంగిక విశృంఖలతో ఎంత ఘోరమో ఇదంతా చెబుతుంది. ఇవన్నీ విదేశీ చరిత్రకారుల రచనల నుంచి తీసుకున్న సమాచారంతో ఇచ్చినవే.

నిజమే, ఔరంగజేబు దేవాలయాలను పగల గొట్టాడు. ఎందరో విదేశీ ముస్లిం పాలకులూ అదే పనిచేశారు. ఇందుకు అవసరమైన సైనికులను వారేమీ అరేబియా నుంచీ, మధ్య ఆసియా నుంచీ తీసుకురాలేదు. ఇక్కడి ఆలయాలను ధ్వంసం చేసే పని చేసిపెట్టినది హిందువులు, రాజపుత్రులే. తన ధర్మాన్ని తామే నాశనం చేసుకుంటున్నామన్న స్పృహ, తన సోదరులను తామే పరమతంలోకి మార్పించేం దుకు దారులు వేస్తున్నామన్న సంగతి వీళ్లకు ఎందుకు లేకపోయిందో కదా! అని రచయిత వాపోతారు. నిజానికి బ్రిటిష్ హయాంలో జరిగిందీ ఇదే. జలియన్ వాలా బాగ్ కాల్పులకు ఆదేశించినవాడు డయ్యర్, కాల్చిన వాళ్లు భారతీయులు. కాబట్టి దురన్యాయం మీద ఆగ్రహంతో అన్వేషణ సాగించిన వైనం ఈ నవలలో దర్శనమిస్తుంది. అంతిమంగా నజీర్ ప్రొ. శాస్త్రి అల్లుడయ్యాడు. ఈయన శ్వేతజాతి భార్య కొడుకు దిగంత పల్లెలోని తాతగారితో అనుబంధం పెంచుకోవడం మరొక మలుపు.

ఢిల్లీలో జరిగిన పెద్ద సదస్సులో లక్ష్మి/రజియా చరిత్రకారుల మీద, ఉదారవాదుల మీద తిరుగుబాటు చేస్తుంది. జాతీయ సమైక్యత పేరుతోనే చరిత్ర మీద, హిందూ సంస్కృతి మీద బాహాటంగా జరుగుతున్న దాడి మీద లక్ష్మి చేసిన ప్రతిదాడి ఇది. కానీ ఆమె వాదన ఏదీ పత్రికలలో రానివ్వలేదు. ఈ నవలలోని అంశాలు సమకాలికమే అనిపిస్తాయి. అదే మైనారిటీల బుజ్జగింపు. మార్క్సిస్టు భావాల చరిత్రకారుల అదే దగా. ముస్లింలలో అదే ఆధిపత్య భావన. వీటన్నిటినీ గొప్ప మానవతా స్పృహతో, తర్కబద్ధంగా, చారిత్రక ఆధారాలతో ఆవిష్కరించారు భైరప్ప. పద్మభూషణ్ అందుకున్న ఈ మహా రచయితకు త్వరలోనే జ్ఞానపీఠ్ కూడా వస్తుందని ఆశిద్దాం. ★

# దేవరకొండలో విరాట్ హిందూ సమ్మేళనం






**దేవరకొండ** : ఆర్‌ఎస్ఎస్ నాలుగో సర్ సంఘచాలక్ పరమపూజనీయ రాజేంద్ర సింహాజీ శతజయంతి సందర్భంగా జనవరి 29న పట్టణంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో విరాట్ హిందూ సమ్మేళనం జరిగింది. మొదట పురవీధులలో పథసంచలనం నిర్వహించారు. సమ్మేళనానికి ముఖ్యవక్తగా తెలంగాణ ప్రాంత కార్యకారిణి సదస్యులు అన్నదానం సుబ్రహ్మణ్యం హాజరై ప్రసంగించారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత గోపిరెడ్డి అనిల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నల్గొండ విభాగ్ సంఘచాలక్ గార్లపాటి వెంకటయ్య, దేవరకొండ నగర సంఘచాలక్ తాడిశెట్టి సుదర్శన్, నల్గొండ జిల్లా కార్యవాహ బంటు జనార్దన్, జిల్లా సహ కార్యవాహ జూలూరు శేఖర్, నగర కార్యవాహ కల్లోల సంతోష్ రెడ్డి హాజరయ్యారు. 308 గణవేషధారి స్వయంసేవకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవగాహనా శిబిరం



**దేవరకద్ర** :పదవతరగతి వార్షిక పరీక్షల నూతన ప్రశ్నావళిపై సేవాభారతి – పాలమూరు జిల్లా శాఖ దేవరకద్రలో ఒకరోజు అవగాహన శిబిరం నిర్వహించింది. జనవరి 28న స్థానిక శ్రీనివాసగార్డెన్ ఫంక్షన్‌హాలులో జరిగిన ఈ శిబిరానికి చుట్టుప్రక్కల 22 ప్రభుత్వ, ఇతర పాఠశాలల నుంచి 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నిపుణులైన ఉపాధ్యాయులు ఆయా విషయాలలో శిక్షణ ఇచ్చారు.

ఇలాంటి కార్యక్రమం చింతలకుంటలో కూడా జరిగింది. ఇందులో ఎమ్ఈఓ లక్ష్మణ్‌సింగ్, ఉపాధ్యాయ సంఘం నాయకులు నాగరాజు, సేవాభారతి ప్రాంత కార్యదర్శి సుబ్రహ్మణ్యం, విభాగ్ ప్రచారక్ శివశంకర్, సేవాభారతి పాలమూర్ విభాగ్ అధ్యక్షులు సింగిరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. 297 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థుల సమ్మేళనం



**గుంటూరు** : వృత్తి విద్యా కోర్సుల కళాశాలల విద్యార్థుల సమ్మేళనం జనవరి 29న గుంటూరులో జరిగింది. 166 మంది విద్యార్థి, విద్యార్థినులు పాల్గొన్న ఈ సమ్మేళనానికి ఆంధ్రప్రదేశ్ సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్ ముఖ్యవక్తగా హాజరయ్యారు. విద్యార్థినులకు సేవికాసమితి కార్యకర్తలు మార్గదర్శనం చేశారు.





**పాలమూర్** : ఊట్కూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనవరి 29న ఊట్కూరు ఖండ సమ్మేళనం జరిగింది. వక్తగా తెలంగాణ ప్రాంత ప్రచారప్రముఖ్ అమర్‌నాథ్, అతిథిగా జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు శెట్టి రమేశ్. 350 మంది గణవేషధారి స్వయంసేవకులు పాల్గొన్నారు.



# బీఆర్‌ఎస్‌తో

**ఎనిమిదో నిజాం ముకర్రం జా అంత్యక్రియలు అధికార లాంఛనాలతో జరిగాయి. ఇది అత్యంత అనావశ్యకమైన చర్య. అంతేకాదు హైదరాబాద్ సంస్థానాన్ని ఏలిన ముస్లిం పాలకులకీ, 14వ శతాబ్దం నుంచి తెలంగాణ ప్రాంతాన్ని ఏలుతున్న సామాజిక వర్గానికీ మధ్య ఇప్పటికీ బంధం కొనసాగుతున్నదని చెప్పడానికి ఈ చర్య అద్దం పడుతున్నది. ఆజాదీ కా అమృతోత్సవాలు, తెలంగాణ విముక్త అమృతోత్సవాలు జరుగుతున్న సందర్భంలోనే ముకర్రం జా అంత్యక్రియలను భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అధికార లాంఛనాలతో జరిపించడం చర్చనీయాంశంగా మారింది.**

నిజాం పాలకులంటే విదేశీ తెగకు చెందిన ముస్లింలు. వీళ్ల పాలన అంతా హిందువులను అణచివేయడంలోను, దోపిడీ చేయడంతోనే సాగింది. అందుకే హిందువులు ఈ పాలకులను తీవ్రంగా ద్వేషించేవారు. మతం మారిన స్థానికులకి పదవులు కట్టబెట్టి పాలకులు తమ పబ్బం గడుపుకునేవారు. హైదరాబాద్ సంస్థానానికి అంతిమ ఘడియలు సమీపించిన సమయంలో కూడా ఒక కుట్ర జరిగింది. ఆగస్ట్ 15, 1947న భారత్ రెండుగా చీలిపోయిన తరువాత ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఈ సంస్థానాన్ని భారత యూనియన్‌లో కలిపేందుకు నిరాకరిస్తూ పెద్ద ఎత్తున పేచీ పెట్టాడు. ఫలితమే సైనిక చర్య. అదే ఆపరేషన్ పోలో. ఎట్టకేలకు సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో అంతర్భాగమైంది. కాశిం రజ్వీ నాయకత్వంలో ఏర్పడిన రజాకార్లు, మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ మతోన్మాదులు నిజాం వెనుక నిలబడి హైదరాబాద్ సంస్థానం భారత సమాఖ్యలో విలీనం కాకుండా చేయాలని శతవిధాలా ప్రయత్నించారు. ఆ క్రమంలోనే చరిత్ర కనీవినీ ఎరుగని రీతిలో హిందువులమీద ఇక్కడ హత్యాకాండ సాగింది. హైదరాబాద్ సంస్థానం విముక్తమైన తరువాత కేంద్ర ప్రభుత్వం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు రాజ్‌ప్రముఖ్ హోదా ఇచ్చింది.

మళ్లీ ఎనిమిదో నవాబు అంత్యక్రియలు, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వ అత్యుత్సాహం దగ్గరకు వద్దాం. పైన పేర్కొన్నట్టు ఈ చర్య కేవలం ముస్లిం పాలకులకూ, ఆనాటి పాలక వర్గానికీ మధ్య ఉన్న అనుబంధాన్ని బహిర్గతం చేస్తుంది. ఎనిమిదో నవాబు ముకర్రం జా జీవితం నిండా వివాదాలే. అతడి నలుగురు భార్యలతో కూడా వివాదాలు ఉన్నాయి. వీరంతా విదేశీయులే. ఇతడికి భారత్ మీద ఉన్న ప్రేమాభిమానాలు ఏ పాటివో చెప్పడం కూడా కష్టమే. ఇతడి శేషజీవితం మొత్తం, నిజానికి జీవితంలో ఎక్కువ భాగం కూడా భారత్‌లో జరగలేదు. చాలావరకు టర్కీలోనే నివసించారు. ఇంతకీ ముకర్రం జా తల్లి టర్కీ దేశీయురాలే. ఏ విధంగా చూసినా ప్రస్తుతం ఏలుతున్న భారత రాష్ట్ర సమితికి కాశిం రజ్వీ వారసులైన ఏఐఎంఐఎంతో బంధం గురించి బాహాటంగా వెల్లడించకపోయినా ఈ అంత్యక్రియలు ఆ రెండు పార్టీల మధ్య బంధం బండారాన్ని బట్టబయలు చేసిందని అందరి అభిప్రాయం.

ఎనిమిదో నవాబు ముకర్రం జా జీవితం నిండా వివాదాలే. అతడి నలుగురు భార్యలతో కూడా వివాదాలు ఉన్నాయి. వీరంతా విదేశీయులే. ఇతడికి భారత్ మీద ఉన్న ప్రేమాభిమానాలు ఏ పాటివో చెప్పడం కూడా కష్టమే. ఇతడి శేషజీవితం మొత్తం, నిజానికి జీవితంలో ఎక్కువ భాగం కూడా భారత్‌లో జరగలేదు. చాలావరకు టర్కీలోనే నివసించారు. ఇంతకీ ముకర్రం జా తల్లి టర్కీ దేశీయురాలే.



పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉండగా 1972 ప్రాంతంలో జరిగిన ఒక ఘటన ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ముస్లింలలో మిగిలిపోయిన ఆధిపత్య భావనకు అదొక రుజువు. ఈ ఘటనలో పీవీతో పాటు ఉన్న మరొక వ్యక్తి నాటి ఎంఐఎం నాయకుడు సలాహుద్దీన్ ఒవైసీ. ప్రస్తుత హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ తండ్రి అన్నమాట. సలాహుదీన్ ముస్లింలకు ప్రభుత్వం కల్పించవలసి ఉన్న ప్రయోజనాల ఒక జాబితా పట్టుకుని ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. ఆ జాబితా చిన్నదేమీ కాదు. చాలా కోరికలతో నింపేశారు దాన్ని. ఆ జాబితాను పీవీ ఏగాదిగా నాలుగుసార్లు చూశారు. ఆ తరువాత, 'సలాహుద్దీన్ గారూ! మీరు చాలా పెద్ద నాయకులు. మంచి పండితులు కూడా. అయినా ఒక విషయం ఇందులో చేర్చడం మరచి పోయారేమిటి?' అన్నారట పీవీ. సలాహుద్దీన్ ఒక్క నిమిషం ఆశ్చర్యపోయి, ఆ మరచిపోయినదేమిటి ముఖ్యమంత్రి గారు అని అడిగాడట. దానికి పీవీ ఇచ్చిన జవాబు, 'మీరు నిజాం పరిపాలనను పునరుద్ధరించాలన్న మాట చేర్చనే లేదు'. ఇది జరిగి దశాబ్దాలు గడిచిపోయి ఉండొచ్చు గానీ, ఇప్పుడు మాత్రం బీఆర్ఎస్, ఎంఐఎం మైత్రి బహిరంగ రహస్యం అంటే తప్పేమీ కాదు.

ఇంకా ఏం అర్థమవుతుందంటే, ప్రస్తుతం



**డా. త్రిపురనేని హనుమాన్ చౌదరి**
ఐటి రంగ నిపుణులు, సలహాదారు



# రజ్వీ కల సాకారం

తెలంగాణను ఏలుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అసలు చోదకుడు, వ్యూహకర్త, కేసీఆర్కూ, ఆయన ప్రభుత్వానికి ముఖ్య సలహాదారు మరెవరో కాదు, ప్రస్తుత ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీయే. ఇంతకంటే ఆసక్తికరమైన అంశం ఖమ్మం సభ. జనవరి 18న జరిగిన బీఆర్ఎస్ ఖమ్మం సభకు హాజరైన వారు ఎవరు? కేరళ ముఖ్యమంత్రి కామ్రేడ్ పినరయ్ విజయన్, ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా వచ్చారు. వీరంతా కరడుగట్టిన మోదీ వ్యతిరేకులే కదా! అసలు సెప్టెంబర్ 17వ తేదీని విముక్తి దినోత్సవంగా కాకుండా, జాతీయ సమైక్యతా దినంగా జరపమని కేసీఆర్కు సలహా ఇచ్చినవారే అసదుద్దీన్. ఈయన ఆశయం ఒక్కటే. కేంద్ర ప్రభుత్వం బల హీనంగా ఉండాలి. ఈ సూత్రానికి అనుగుణంగానే కేసీఆర్ ఖమ్మంలో కొందరు ప్రాంతీయ పార్టీల నాయకులను పోగేశారు.

నిజాం పాలనాకాలమంటేనే హిందువులను అనంతమైన బాధలకు గురిచేసిన కాలం. మరీ ముఖ్యంగా కాశిం రజ్వీ చేతికి సర్వాధికారాలు వచ్చిన తరువాత వారి పరిస్థితి మరింత దుర్భరంగా మారిపోయింది. అసఫ్‌జాహిల పతాకం ఎర్రకోట మీద ఎగరాలని రజ్వీ తరుచూ రంకెలు వేస్తూ ఉండేవాడు. కానీ ఈ రక్తపిపాసి కల నెరవేరలేదు. చూడబోతే ఇప్పుడు రజ్వీ కలను టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ అనే జాతీయ పార్టీగా మార్చి కేసీఆర్ నిజం చేయడానికి ఉద్యుక్తుడవుతున్నారని అనిపిస్తుంది. కేంద్ర ప్రభుత్వం బలహీనం కావాలన్న తన కోరిక కూడా దీనితో నెరవేరుతుందని అసదుద్దీన్ నమ్మవచ్చు. బీఆర్ఎస్ దూరంగా ఉన్నందువల్ల 74వ గణతంత్ర వేడుకలు సంప్రదాయబద్ధంగా జరగక పోవడం అవాంఛనీయమే కాదు, మేం భారత్ యూనియన్‌కు అవతల ఉంటాం అంటూ ఏడో నిజాం జూన్ 6, 1947న చేసిన ప్రకటనను గుర్తు చేసేదే. ఏమైనా తన ప్రమాదకర ఆలోచనలు అమలులో పెట్టడానికి చూస్తున్న ఎంఐఎంకు బీఆర్ఎస్ ఒక ఆయుధం కాకూడదని ఆశిద్దాం. ★

# వందేమాతరం అంటే అల్లాహు అక్బర్ అన్నారు

వందేమాతరం అని నినాదం ఇస్తే, దానికి 'అల్లాహు అక్బర్' అంటూ జవాబు ఇచ్చిన దుర్ఘటన అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో ఈ గణతంత్ర దినోత్సవంలో జరిగింది. దీని మీద ఇప్పుడు పెద్ద ఎత్తున రగడ మొదలయింది. బీబీసీ అనే జాత్యహంకార సంస్థ తయారు చేసిన డాక్యుమెంటరీ మీద సెక్యులరిస్టులు, ఉదారవాదులు చూపిస్తున్న శ్రద్ధ ఇలాంటి వాటి మీద కూడా చూపిస్తే మంచిది.

అలీగఢ్ విశ్వవిద్యాలయం అనేది భారత గడ్డ మీద కేన్సర్



కురుపు వంటిదని ఎప్పుడో తేలిపోయింది. ఎన్‌సీసీ యూనిఫారాలలో ఉన్న కొందరు వందేమాతరం, భారత మాతాకీ జై అని నినాదం ఇస్తే, ఎన్‌సీసీ యూనిఫారాలలోనే ఉన్న భావి భారత మతోన్మాదులు వెంటనే అల్లాహు అక్బర్ అంటూ నినదించడం దేశంలో చీదర పుట్టిస్తున్నది. పతాకాన్ని ఆవిష్కరించిన వెంటనే ఇలాంటి పనికి పాల్పడ్డారు మతోన్మాదులు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కాగానే జిల్లా అధికార యంత్రాంగం స్పందించడం శుభసూచకం. ఇలా గణతంత్ర దినోత్సవంలో మత నినాదాలు ఇచ్చిన వారి మీద చర్య తీసుకుంటామని విశ్వవిద్యాలయం ప్రోక్టర్ కూడా హామీ ఇచ్చారు. దర్యాప్తు పూర్తయిన తరువాత మిగలిన చర్యలు కూడా ఉంటాయని ఆయన చెప్పారు. అల్లా హు అక్బర్ నినాదమే కాకుండా నారా ఏ తక్బీర్ అన్న నినాదం కూడా మతోన్మాదులు వినిపించారు. నిజానికి డిసెంబర్, 2022 నుంచి కూడా ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. కొందరు 'గుర్తు తెలియని' విద్యార్థులు అదే పనిగా కశ్మీర్ నుంచి వచ్చిన విద్యార్థుల మీద దాడులకు పాల్పడుతున్నారు. ఈ విషయం మీద కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు కూడా లేఖ వెళ్లింది. ★

నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు

# బీబీనగర్‌లో

హైదరాబాద్–విజయవాడ రైల్వే మార్గంలో, హైదరాబాద్‌కు 80 మైళ్ల దూరంలో బీబీనగర్ ఉంది. నిజాంకు సంబంధించిన ఒక బేగం పేర నెలకొన్న గ్రామమది. ఒకరోజు బీబీనగర్ రైల్వే ప్లాట్ ఫారంపై సుమారు 12 మంది యువకులు 'భారత్ మాతాకీ జై', 'స్టేట్ కాంగ్రెస్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. స్టేషన్‌లోని జనం బయటకు వచ్చి చూశారు. పరిచయమున్న వ్యక్తులే ఆ నినాదాలు చేసేది. నాడు బీబీనగర్‌లో బియ్యం కొరత ఉండేది. రోజూ జనగామ వెళ్లి బియ్యం సంచులు మోసుకొచ్చే యువకులే ఆ రోజు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ రోడ్డు వైపు పరుగెడుతున్నారు. ఇంతలో ఎదురుగా రెండు లారీలు, ఒక జీపు కనపడ్డాయి. వాటిలో నుండి సాయుధులైన రజాకార్లు దిగి నినాదాలు చేస్తున్న యువకులను తరమడం ప్రారంభించారు. యువకులంతా బీబీనగర్ గ్రామంలోనికి పరుగు లంఘించారు. వారిలో లవంగం అచ్చయ్య కూడా ఒకరు. ఆయన ప్రత్యక్ష సాక్షి కూడా. ఆయన చెప్పిన విషయాల ఆధారంగానే ఖండేరావు కులకర్ణి ఈ విషయాలు మనకు చెప్పగలిగారు.

ముస్త్యాలపల్లి రజాకార్ల నాయకుడు చోటేమియా.. రజ్వీ గౌరవార్థం జనవరి 10, 1948న పెద్ద ఎత్తున విందు ఏర్పాటు చేశాడు. మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షుడు, కాయదేసిద్దిక్, ఫీల్డ్ మార్షల్ ఆలీ జనాబ్ కాశీం రజ్వీ ఆ విందుకు హాజరయ్యాడు. రజ్వీ పలుకుబడి హైదరాబాద్ సంస్థానంలో అప్పటికే అన్ని మూలలకు వ్యాపించింది. చివరికి రియాసత్ ప్రధాని మీర్ లాయక్ ఆలీ కూడా అతని సిఫార్సు వల్లే పదవిలోకి వచ్చాడు. మిర్జా ఇస్మాయిల్, నవాబ్ ఛత్రి లాంటి ప్రధానమంత్రులు రజ్వీ ఒత్తిడి వల్లే పదవి నుంచి తొలగిపోయారు.

భువనగిరి తాలూకాలో రజ్వీకి కుడి భుజంగా చోటేమియా పని చేస్తున్నాడు. రజ్వీ రజాకార్ల కోసమే రోజుకు మూడు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నాడు. అలాంటి రజ్వీ తన విందుకు రావడం చోటేమియాకు గర్వకారణమైంది. కాబట్టి ఘనంగా విందు ఏర్పాట్లు చేశాడు. ఈ విందుకు కొలిపాక తాహశీల్దారు, మోత్కూర్ గెద్దం అమీన్, భోనగిరి డిప్యూటీ కలెక్టర్, గూడూర్ మీర్ ఖాదర్ ఆలీఖాన్, సికింద్రాబాద్ హాజీ, వీరితోపాటు వేల సంఖ్యలో రజాకార్లు కూడా హాజరయ్యారు.

నాడు సంస్థానంలో బియ్యం కొరత ఉంది కాబట్టి విందులపై ఆంక్షలున్నాయి. అయితే రజాకార్లపై మాత్రం ఏ ఆంక్షలూ లేవు. విందుకు కావలసిన బియ్యం, కోళ్లు, పాలు, నెయ్యి గ్రామం మీద పడి దోచుకు వచ్చారు. చోటేమియా ఇచ్చిన విందు ముగించుకుని సాయంత్రం 4 గంటలకు 'ఆజాద్ హైదరాబాద్, షాహే ఉస్మాన్ జిందాబాద్, కాయదేమిల్లత్ సిద్దిక్ కాశీం రజ్వీ జిందాబాద్' అని నినాదాలు చేస్తూ హైదరాబాద్‌కు తిరుగుముఖం పట్టారు. సరిగ్గా అదే సమయానికి బీబీనగర్ యువకుల నుండి రైల్వే ప్లాట్ ఫారంపై 'భారత్ మాతాకీ జై' అనే నినాదం వినబడింది. రజాకార్లు తట్టుకోలేకపోయారు. వారిని తరమడం మొదలు పెట్టారు. రైల్వే స్టేషన్ మాస్టర్ ఆంజనేయులు ఇంట్లోని 30 తులాల బంగారం ఎత్తుకుపోయారు. ఆయన వెంటనే రైల్వే పోలీసులకు ఈ విషయాన్ని తెలియ జేశాడు. రజాకార్లు అంతటితో ఆగలేదు. గ్రామంలోకి చొరబడి గుడిసెలకు నిప్పు పెట్టారు. ఇళ్లు తగులబడి పోతున్నాయి. గ్రామస్తులను బెదర గొట్టడానికి గాల్లోకి కాల్పులు జరిపారు. ప్రజలు భయపడి తలుపులు బిగించి లోపల దాక్కున్నారు. స్వయంగా కాశీం రజ్వీ గ్రామంలో చొరబడ్డాడు. తన పర్యవేక్షణలోనే ధనవంతుల ఇళ్లు దోచుకున్నారు. 'పట్టండి, కొట్టండి, నరకండి' అనే కేకలతో వాతావరణం నిండి పోయింది. రత్తమ్మ అనే టీచర్ ఇంట్లోకి దూరి తుపాకీ చూపి ఆమె కడియాలు, ఉంగరాలు, వెండి దోచుకున్నారు. పురుషోత్తమాచారి ఇంట్లోకి వెళ్లి బంగారం, వెండి దోచుకుపోయారు. వ్యాపారస్తుడైన వైశ్య శివయ్యను విపరీతంగా కొట్టి ఆయన ఆస్తిని కూడా దోచుకున్నారు. తరువాత బంగారు రాజయ్య ఇల్లు దోచుకోగా ఆయన పరిగెడుతూ నూతిలో పడిపోయాడు. బంజరి బాలయ్య ఇంట్లోని నగలు దోచుకుని అతన్ని బాగా కొట్టారు. ఇంకా ఎంతో మందిని తాళ్లతో కట్టేసి రజ్వీ ముందు వరుసగా నిలబెట్టారు. ఫీల్డ్ మార్షల్ కాశీం రజ్వీ కళ్ల ఎదుట బీబీనగర్ పట్టపగలే దోపిడీకి గురైంది. దాదాపు అన్ని ఇళ్లలోని డబ్బు, వెండి, బంగారు నగలు దోచేశారు. అనేక మందిని మాన భంగం చేశారు. రెండు గంటల పాటు పిశాచాలు రాజ్యమేలాయి. ఆ తరువాత కట్టేసిన వారిని విడిచి పెట్టి నినాదాలు చేసుకుంటూ అందరూ వెళ్లి పోయారు. రాత్రి పది గంటలప్పుడు మళ్లీ లారీల చప్పుడు వినబడింది. హెడ్‌లైట్ల వెలుగు చీకటిని చీల్చుకుంటూ వచ్చింది. స్టేషన్ మాస్టర్ ఆంజనేయులు పంపిన టెలిగ్రాం వర్తమానానికి సమాధానంగా రైల్వే పోలీసులు ఆస్తి నష్టం



నాడు సంస్థానంలో బియ్యం కొరత ఉంది కాబట్టి విందులపై ఆంక్షలున్నాయి. అయితే రజాకార్లకు మాత్రం ఏ ఆంక్షలూ లేవు. విందుకు కావలసిన బియ్యం, కోళ్లు, పాలు, నెయ్యి గ్రామం మీద పడి దోచుకు వచ్చారు. చోటేమియా ఇచ్చిన విందు ముగించుకుని సాయంత్రం 4 గంటలకు 'ఆజాద్ హైదరాబాద్, షాహే ఉస్మాన్ జిందాబాద్, కాయదేమిల్లత్ సిద్దిక్ కాశీం రజ్వీ జిందాబాద్' అని నినాదాలు చేస్తూ హైదరాబాద్‌కు తిరుగు ముఖం పట్టారు. సరిగ్గా అదే సమయానికి బీబీనగర్ యువకుల నుండి రైల్వే ప్లాట్ ఫారంపై 'భారత్ మాతాకీ జై' అనే నినాదం వినబడింది.


కాశీం రజ్వీ



కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

# రజాకార్ల దోపిడి..

జరక్కుండా చూడటానికి వచ్చారు.

పోలీసులు పటేల్, పట్వారీలను పిలిపించి తాము ఆదేశించిన విధంగా చెప్పించుకుని రిపోర్టు రాశారు. దీని సారాంశం బీబీనగర్‌పై తీవ్రవాదులు దాడిచేసి లూటీలు, హత్యలు, మానభంగాలు చేశారని ఉంది. తరువాత పటేల్ ఎ. లక్ష్మీకాంతరెడ్డి తాము గత్యంతరం లేక అబద్ధమాడామని ప్రజల దగ్గర వాపోయాడు. ఆ మరునాడే గూఢచారి విభాగంవారు వచ్చి వాస్తవాల్ని కనిపెట్టి రిపోర్టును పైకి పంపారు. కానీ ఎవ్వరూ పట్టించుకోలేదు. 'అచట పాపము, దౌర్జన్యమావరించి తెలుగుదేశాన నెత్తురుల్ చిలికి వేసె, మత పిశాచము పేదల కుతుకలు నమిలి ఉమ్మి వేసెను పిప్పి, లోకమ్ము మీద, నా తెలంగాణా కోటి రతనాలు' అని దాశరథి అభిప్రాయపడ్డారు.

బీబీనగర్‌పై దాడి చేసిన తీవ్రవాదులను శిక్షిస్తామని రజాకార్లు బయలుదేరి తమ వెంట పటేల్ ఎ. లక్ష్మీకాంతరెడ్డిని తీసుకెళ్లి తీవ్రవాదులను చూపమని బలవంతం చేశారు. దారి పొడవున కనపడిన ప్రతి గ్రామస్తున్ని విపరీతంగా కొట్టారు. ఈలోగా ఆ ప్రాంత నాయకుడు పాపిరెడ్డిని చూపమని బలవంతం చేశారు. లక్ష్మీకాంతరెడ్డి చూపించలేదు. దీంతో అతని ఇల్లు తగులబెట్టారు. ఈ లోగా పాపిరెడ్డి కాల్పులు జరిపాడు. రజాకార్లు ఎదురు దాడిచేసి 500 రౌండ్లు కాల్చారు. చివరకు భయపడి రజాకార్లు ఎంకిర్యాల గ్రామంలో తలదాచుకున్నారు. కొంచెం వ్యవధి తరువాత రజాకార్లు కొండమడుగు గ్రామాన్ని లూటీ చేసి అనేక మందిని చావబాదారు.

తయ్యబ్ రజ్వీ కొంతకాలం తరువాత తనకు తీవ్రవాదుల ఆచూకీ లభించిందని చెప్పి పెద్ద దళంతో బీబీనగర్ క్యాంపు నుండి బయలు దేరాడు. లక్ష్మీకాంత రెడ్డిని కూడా తన వెంట తీసుకెళ్లి మార్గమధ్యంలో అతన్ని హతమార్చాలనుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మీకాంతరెడ్డి తప్పించుకొని పారిపోయాడు. తయ్యబ్ రజ్వీ బ్రాహ్మణపల్లిలో ప్రవేశించి అక్కడ రామచంద్రా రెడ్డి కోసం గాలించగా అతడు దొరకలేదు. అతని ఇల్లు కూడా తగుల బెట్టారు. ఎందరినో చిత్ర హింసలు పెట్టి, చంపి అక్కడే పూడ్చిపెట్టారు. తీవ్రవాదుల్ని వెతికి పట్టుకొని చంపి పూడ్చిపెట్టామని బయట ప్రచారం చేసుకు న్నారు. తరువాత రోజు నిజనిర్ధారణ కోసం సబ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఖాన్, డీఐజీ నాయబ్ నాజర్ బ్రాహ్మణపల్లికి వచ్చి ఆ పూడ్చిన శవాలను బయటకు తీసి, పరీక్షించగా వారు తయ్యబ్ దగ్గర పని చేసే చాకలి, మంగలి, హరిజనులని తేల్చారు. ఈ హత్యలకు కారణమైన తయ్యబ్‌ను ఏం చేయలేక పోలీసులను ట్రాన్స్‌ఫర్ చేయించారు. దీని వెనుక మల్లయ్య అనే వ్యక్తి తోడ్పాటు ఉన్నట్లు తేల్చారు. అతడ్ని గ్రామస్తులే చంపేశారు. తన బంటు అయిన మల్లయ్యను హత్య చేయడాన్ని తయ్యబ్ తట్టుకోలేక పోయాడు. లక్ష్మీరెడ్డి వల్లే మల్లయ్య మరణించాడని ఊహించుకొని అతన్ని, మాలీపటేల్ జగ్గారెడ్డిని చితకబాది చివరకు నడవలేని స్థితిలో గ్రామ చావిడిలో వదిలిపెట్టి వెళ్లిపోయాడు.

ఇస్లాం అసఫియా సామ్రాజ్యాన్ని స్థాపించాలని కలలు కన్న నిజాం 1947 తర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకొని ఘనత వహించిన (హిజ్ మెజెస్టీ) ప్రభువుగా మారిపోయాడు. స్వతంత్ర ప్రతిపత్తి కోరిన ప్రజలపై క్రూర దమనకాండ జరిపించాడు. ముస్లిం మత ప్రాబల్యం పెంచి ఇత్తెహాదుల్ సంస్థ అండతో, రజాకార్ల సహాయంతో తన అధికారాన్ని కాపాడు కోవాలనుకున్నాడు. దీనికి బ్రిటిష్ ప్రధాని చర్చిల్ కూడా అండగా నిలిచాడు. స్విట్జర్లాండ్ పద్ధతిలో హైదరాబాద్ సంస్థానం బఫర్ స్టేట్‌గా కొనసాగ వచ్చునని అభిప్రాయపడ్డాడు. కాశీం రజ్వీ చివరికి నిజాం తలపై భస్మాసుర హస్తంలా పరిణమించాడు. రజ్వీ ఉక్కు మనిషి సర్దార్ పటేల్‌ను కలిసి హైదరా బాద్ స్వతంత్రంగా ఉంటుందని చెప్పాడు. దీనికి సమాధానంగా పటేల్ 'ఆత్మహత్య చేసుకోవాలని అనుకునేవాన్ని ఎవరూ ఆపలేరు' అన్నారు. దీంతో రజ్వీ కోపంతో ముస్లింలను రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేశాడు. ఢిల్లీ రాజధానిని వశపరుచుకొని ఎర్రకోటపై అసఫ్ జా జెండా ఎగురవేస్తానని ప్రకటించాడు. కాని పోలీస్ యాక్షన్ చేపట్టగానే మూడు రోజుల్లో నిజాం లొంగిపోయాడు. కాశీం రజ్వీని ప్రత్యేక న్యాయస్థానం విచారించింది. గూఢచారి విభాగాధిపతి నర్సింగ్ ప్రసాద్ కృషి వలన స్పష్టమైన ఆధారాలు, సాక్ష్యాలు దొరికాయి. ఫలితంగా కాశీం రజ్వీ తాను చేసిన నేరాలకు కఠిన శిక్షలు అనుభవించి, విడుదల అయ్యాక పాకిస్తాన్ పారిపోయాడు. తయ్యబ్ రజ్వీ ఆచూకీ దొరకలేదు. ★



కథ

"ప్రశ్నిస్తే కేసులు పెడతారా? చట్టాల్ని గౌరవించరా?'' అన్నాడు పరమేష్ ఆక్రోశంగా.

"బ్రిటిష్ రోజుల కన్నా పరిస్థితి దారుణంగా వుంది." అన్నాడు స్వరూప్.

ఆ రోజే బెయిల్ మీద బయటకి వచ్చారు ఇద్దరూ.. "ఈ పరిస్థితికి అడ్డు కట్ట వేయాలి." అన్నాడు పరమేష్.

"హక్కులు సాధించకుండా రాజీ పడిపోతే భావితరాలు మనల్ని క్షమించవ్." అన్నాడు స్వరూప్.

ప్రభుత్వ రంగంలోని ఒక ఉక్కు పరిశ్రమలో పని చేస్తున్నారు ఇద్దరూ. ఆరోజు మళ్లీ కార్మికులతో సమావేశం అయ్యారు. "ఎంతమందిని జైల్లో పెడతారు? మనం వెనక్కి తగ్గితే ఫ్యాక్టరీ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళితే ఇక పారదర్శక నియామకాలు కూడా వుండవు." అన్నాడు మరో ట్రేడ్ యూనియన్ లీడర్ శ్రీనివాస్.

"ఆఖరికి కారుణ్య నియామకాలు కూడా ఉండవు. ప్రభుత్వ రంగంలోనే ఫ్యాక్టరీ కొనసాగేలా మరింత చురుగ్గా మనం పని చేయాలి.." చెప్పాడు పరమేష్. "అవసరమైతే మరింత ఎక్కువ పనిచేసి నిరసన తెలుపుదాం." అన్నాడు స్వరూప్. "వద్దు.. సమ్మె ప్రకటిద్దాం. మన సత్తా చాటుదాం.'' అన్నారెవరో. ఆరోజుకి సమావేశం ముగిసింది.

* * *

"మా తమ్ముడి కూతురు ప్రసవించింది. వెళ్లి నాలుగు రోజులు వుండి వస్తాను. మీరు ఫ్యాక్టరీ గొడవల్లో వున్నారు కదా?" అంది శారద. "నువ్వు వెళితే నా తిండీతిప్పలూ ఎవరు చూస్తారు." అన్నాడు పరమేష్,

"అలాగంటే ఎలా? మన అమ్మాయి కాలేజీ ఫీజులకని చాలాసార్లు మా తమ్ముడు సాయం చేశాడు కదండీ.? ఇప్పుడు మనం సాయం చేయకపోతే ఎలా?" అంది శారద.

"అప్పుగానే కదా మనం తీసుకున్నాం? రేపు రిటైరయ్యాక మొత్తం అప్పు తీర్చేద్దాంలే." అన్నాడు పరమేష్.

"మీరు అప్పు తీర్చడం తర్వాత సంగతి.. ఇప్పుడు పోక తప్పదు." అంది. "మీ తమ్ముడి వ్యవహారం పక్కనపెట్టు" అన్నాడు. "అవేం మాటలండీ.?" అంది. "దాన్నో ఇష్యూ చేయకు.." చెప్పాడు.

"ఇష్యూ చేయాలని మీరే డిసైడ్ అయినట్టున్నారు" అంది కాస్త కోపంగా శారద. "శ్రీహరిని నేను కన్విన్స్ చేస్తాలే.." చెప్పాడు.

"ఇదేం మీ ఫ్యాక్టరీ వ్యవహారం కాదు కన్విన్స్ చేయడానికి." అంది. చురుగ్గా చూశాడు. "ఇది మన బాధ్యత.."అంది. "బాధ్యతలు, హక్కుల గురించి నాకు నేర్పకు." అన్నాడు.

"వాడి మీద మనకేదో హక్కులున్నట్టు వెళ్లి మీ తమ్ముడ్ని అడిగి తీసుకు రమ్మని ప్రతీసారి చెప్పారు కదా?" అంది.

"నీకా హక్కు వుంది? మీ నాన్న సంపాదించిన ఆస్తి అంతా మీ తమ్ముడు ఒక్కడే ఎంజాయ్ చేస్తున్నాడు" అన్నాడు.

"నాన్న వాడికి ఆస్తి ఇచ్చాడా?" అంది విస్తుపోయి చూస్తూ. భర్త వింతగా చూస్తుంటే..

"ఒక 'బోర్డ్' ఇచ్చాడు. వాడూ వాడి భార్య సుమతీ రాత్రింబవళ్లు కష్టపడి హోటల్ని పెంచారు.

వంటగదిలో మగ్గిపోయి సుమతి ఏకంగా అనారోగ్యం పాలయ్యింది. అదేం స్టార్ హోటల్ అనుకున్నారా?" అంటూ వుంటే మళ్లీ అడ్డుపడి "సుబ్బయ్య హోటల్ అంటే ఆ ఏరియా అంతా పెద్ద క్రేజ్. దాన్నే 'గుడ్విల్' అంటారు. అదే మీ నాన్న మీ తమ్ముడికి ఇచ్చిపోయిన ఆస్తి. ఆ గుడ్విల్ తోనే మీ తమ్ముడు హోటల్ నడిపాడు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇప్పటికీ మీ నాన్నను కలవరిస్తూ వుంటారు. ఆయనకున్న క్రెడిబులిటీ పునాదిపైనే మీ తమ్ముడు సంపాదన పరుడయ్యాడు." అంటూ వుంటే శారద మళ్లీ అడ్డు పడి..



# 19(1)ఏ

శరత్‌చంద్ర



“మంచి పేరుతో పాటు కావల్సినంత చెడ్డపేరు కూడా పోగు చేసి పోయాడు మా నాన్న. మద్యం అలవాటుతో పాటు సంపాదించినదంతా ‘సానికొంప’లకే ధార పోశాడు. మా అమ్మ పడిన కష్టాలు నాకే తెలుసు. అయినా హక్కులతో పాటు బాధ్యతలు కూడా వుంటాయని మీరే అంటుంటారు కదా. మా తమ్ముడి కూతురికి సర్వీస్ ఇవ్వడం ఇప్పుడు నా బాధ్యత.” అంది కాస్త కఠినంగా,

“ఇంట్లో పడి వుంటేనే నీకు ఇంత నోరు పెరిగింది. జాబ్‌కు పంపించి వుంటే ఆ నోరు ప్రకాశం బ్యారేజ్ అంత అయ్యి వుండేది.” అన్నాడు పరమేష్. “నేనేం ఇంట్లో తిని కూర్చోలేదు. ఇంటి చాకిరి చేయడంతోనే నాకు రోజంతా గడిచి పోతుంది. మొన్నటివరకు ఇంట్లో వాషింగ్ మిషన్ లేదు. గ్రైండర్ లేదు. మిక్సీలేదు. ఆఖరికి పనిమనిషి కూడా లేదు. ఇంటి చాకిరి చేయడం ఉద్యోగంతో సమానం కాదా? పైగా మీ యూనియన్ సభ్యులు వస్తే టీ, కాఫీలూ...వెట్టి చాకిరి అంటే అది నాదే..” నిలదీసింది. “మాటకు మాట సమాధానం బాగానే చెబుతున్నావ్.’’ అన్నాడు వ్యంగ్యంగా. “ట్రేడ్ యూనియన్ నాయకుడి భార్యను కదా? కాస్త నాకూ పోరాట పటిమ, భాషా పరిజ్ఞానం ఉంటాయి కదా!” అంది నవ్వడానికి ట్రై చేస్తూ..“సర్లే నీ డైలీ సీరియల్స్ తెలివితేటలు నా దగ్గర చూపకు. ఊరికి పంపే ప్రసక్తి లేదు..” అన్నాడు. “ఇప్పటి వరకూ మిమ్మల్ని అణిచి పెడుతున్న ప్రభుత్వానికీ.. మీకూ తేడా ఏముంది.?” అడిగింది.

“అదీ, ఇదీ ఒకటి ఎందుకు అవుతుందీ. ఫ్యాక్టరీ మూత పడితే ఇప్పటి ఉద్యోగులకే కాదు భావితరాలకు నష్టం,” అన్నాడు.

“నాది కూడా ఇదే సమస్య. రేపు నాకో, నా కూతురికో ఏదైనా కష్టం వస్తే మాకూ వుండే దిక్కు మా తమ్ముడే. అప్పుడు ఏం ముఖం పెట్టుకొని సాయం అడుగడానికి వెళ్తాం ?” అంది.

“అంత అవసరం రాదులే. నువ్వూ నేను బ్రతికి ఉన్నాంగా. మన బిడ్డ ఆలనా పాలనా మనమే చూసుకుందాం” అన్నాడు.

* * *

“మీకు ‘సారీ’ కూడా చెప్పబోవడం లేదు. పర్మిషన్ కూడా అడగట్లేదు. లాభనష్టాలు పక్కన పెడితే మా తమ్ముడింటికి వెళ్లడం, వాడి కూతురికి సాయం చేయడం నా ధర్మం అనిపించింది అందుకే వెళు తున్నాను. మన పనిమనిషి వసంతకి చెప్పాను. నే వచ్చేవరకూ అది మీకు వండి పెడుతుంది. ఎప్పుడన్నా తను రాకపోతే ‘స్టౌ’ మీద అన్నం పెట్టుకొని కర్రీస్ తెచ్చుకోండి. లేదనుకుంటే హెరీటల్ సర్వీస్ మీకు అందుబాటులోనే వుంటుంది కదా? ఈ నాలుగు రోజుల కోసం మన అమ్మాయిని పిలిపిద్దాం అనుకున్నా కానీ తనకి ఏవో ప్రాక్టికల్ పరీక్షలు వున్నాయట.”– శారద. ఉదయం తాను లేచేసరికి ఉత్తరం రాసి వెళ్లిన భార్య తీరు పరమేష్‌కు కోపం తెప్పించింది.

ఫోన్ మీదకు చెయ్యి వెళ్లింది కాని చెయ్యాలని పించలేదు. హక్కులు గురించి తరచూ మాట్లాడే తన మాటలే శారదలోని మరో మనిషిని బయటకు తీసు కొచ్చాయా? ఈ ధిక్కారానికి కారణమేంటి?

ఆలోచనలో ఉండగానే యూనియన్ లీడర్ శ్రీనివాస్ ఫోన్ చేశాడు. "కామ్రేడ్. మీరు వెంటనే రండి. ఇంపార్టెంట్ మీటింగ్ "చెప్పాడు.

"వస్తున్నా కామ్రేడ్.." చెప్పి ఫోన్ పెట్టేసి స్నానం చేసి బయల్దేరాడు. పరమేష్ వెళ్లేసరికి హాల్లో అందరూ సమావేశం అయ్యి ఉన్నారు. మర్యాద పూర్వకంగా కొందరు లేచారు. ఢిల్లీ నుండి వచ్చిన ట్రేడ్ యూనియన్ లీడర్ ద్వివేదిని పరిచయం చేశాడు శ్రీనివాస్. "మీరు ప్రొడక్షన్ ఆపితేనే ప్రభుత్వం దిగి వస్తుంది.." చెప్పాడు ద్వివేది. "ఇప్పటి వరకూ కంపెనీ నష్టాల గురించే ప్రభుత్వం చెబుతుంది. ఈ సాకు చూపించి లాకౌట్ కూడా ప్రకటిస్తారు" చెప్పాడు పరమేష్. "వాళ్లు ప్రకటించాలని డిసైడ్ అయితే మీరు ఉత్పత్తి పెంచినా అదే పని చేస్తారు." చెప్పాడు ద్వివేది. ఏం చెప్పాలో అర్థం కాలేదు పరమేష్‌కి."మీరు సమ్మె మొదలు పెట్టండి. పార్లమెంట్లో మేం నిరసన గళం విన్పిస్తాం." చెప్పాడు ద్వివేది. శ్రీనివాస్, స్వరూప్ సహా మెజారిటీ సభ్యులు సమ్మెకు ఓటు వేయడంతో తను కూడా "ఊ.." అనక తప్పలేదు. దీక్షా శిబిరం పర్యవేక్షణ బాధ్యతలను కమిటీ పరమేష్‌కి అప్ప చెప్పింది. ఇంటికి వచ్చేసరికి నీరసించి పోయేవాడు పరమేష్. శారద లేని లోటు స్పష్టంగా కన్పించేది. శారద ఫోన్ చేసింది కానీ పరమేష్ ఫోన్ లిఫ్ట్ చేయ లేదు. "బావగారు ఒక్కరే ఇబ్బంది పడుతుంటారు వెళ్లక్కా" చెప్పాడు తమ్ముడు శ్రీహరి.

"పర్వాలేదు లేరా.. నాలుగు రోజులకి ఏమవు తుంది? శ్యామలకి పిల్లాడికి నీళ్లు పోయడం రాదు, ఉగ్గుపోయడం రాదూ, ఆఖరికి సాంబ్రాణి వెయ్యడం కూడా రాదు." అంది శారద నవ్వుతూ.



"విశ్వసనీయత కోల్పోయారు కాబట్టి మిమ్మల్ని సర్వీస్ నుండి ఎందుకు తొలగించకూడదు? అని ప్రభుత్వం మాకు నోటీసు ఇచ్చింది. భార్యగా నువ్వూ విశ్వసనీయత కోల్పోయావు కాబట్టి నీక్కూడా నోటీసు ఇస్తున్నాను. నువ్వు కూడా కోర్టులో నీ వాదన వినిపించుకోవచ్చు." అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ. అది గుర్తు చేసింది కూతురికి. "నాన్నకేమైనా పిచ్చా.." అంది ప్రవల్లిక కోపంగా. "పిచ్చయితే అంత పెద్ద ట్రేడ్‌లీడర్ ఎలా అవుతాడు? పురుషాధిక్యం" అంది శారద.

* * *

పోలీసులు దీక్షా శిబిరాన్ని ధ్వంసం చేశారు. శిబిరంలో వున్న శ్రీనివాస్‌ను హాస్పిటల్‌కు తరలించారు. శిబిరం నిర్వాహకుడిగా వున్న పరమేష్‌పై కేసులు నమోదు చేసి జైలుకి పంపారు. పది రోజుల తర్వాత బెయిల్‌పై వచ్చాడు పరమేష్. జైలుకి వెళ్లాల్సి వచ్చిందన్న బాధ కన్నా తన మాట వినకుండా శారద వెళ్లిందన్న బాధతో రగిలిపోయాడు. ఇద్దరి మధ్య అగాధం పెరుకుపోయింది. భార్యతో మాట్లాడడం మానేశాడు. శారద పెద్దగా పట్టించుకోలేదు. ఒకరోజు అతడు నోటీసుతో వచ్చాడు.

"మనం ఇక కలిసి జీవించలేం.." నోటీస్ ఇచ్చి చెప్పాడు. శారద ఖంగుతిన్నది.

"నేను చేసిన తప్పేంటి?" అడిగింది పీలగా. "ధిక్కారం.." అన్నాడు.

"మా తమ్ముడి బిడ్డకి సాయం చేయడం నేరమా?" అడిగింది బలహీనమైన స్వరంతో. "తెలివైన దానివేగా నీ ఆర్గ్యుమెంట్స్ కోర్టులో చెప్పుకో.." చెప్పాడు వ్యంగ్యంగా పరమేష్.

బాధాతప్త హృదయంతో మళ్లీ పుట్టింటికి చేరింది శారద. తమ్ముడు శ్రీహరి అక్కను అక్కున చేర్చుకున్నాడు. "బావగారి కోపం తాటాకు మంట లాంటిదిలే అక్కా" ఓదార్చాడు.

హాస్టల్లో వుండి చదువుతున్న కూతురు ప్రవల్లిక వచ్చింది. "ఏంటమ్మా.. నాన్న ఇలా చేశాడు?" అడిగింది. "ధిక్కారం పేరుతో ప్రభుత్వం మీ నాన్నను జైలుకి పంపింది. తన మాటను వినలేదని ప్రభుత్వంకి నకలు లాంటి మీ నాన్న నన్ను పుట్టింటికి పంపాడు" అంది నవ్వుతూ.

"అది ఇది ఒకటి ఎలా అవుతుందమ్మా." అంది ప్రవల్లిక.

"నిజమే..! ఇది నాకు జైలు కాదు. దేవాలయం.." అంది. భర్త మాటలు గుర్తొచ్చాయ్.

"విశ్వసనీయత కోల్పోయారు కాబట్టి మిమ్మల్ని సర్వీస్ నుండి ఎందుకు తొలగించకూడదు? అని ప్రభుత్వం మాకు నోటీసు ఇచ్చింది. భార్యగా నువ్వూ విశ్వసనీయత కోల్పోయావు కాబట్టి నీక్కూడా నోటీసు ఇస్తున్నాను. నువ్వు కూడా కోర్టులో నీ వాదన వినిపించుకోవచ్చు." అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ. అది గుర్తు చేసింది కూతురికి.

"నాన్నకేమైనా పిచ్చా.." అంది ప్రవల్లిక కోపంగా.

"పిచ్చయితే అంత పెద్ద ట్రేడ్‌లీడర్ ఎలా అవుతాడు? పురుషాధిక్యం" అంది శారద.

"కుటుంబంతోటే సజావుగా సంబంధాలు నెలకొల్పుకోలేని వాడు యూనియన్ లీడర్ ఎలా అవుతాడమ్మా?" అంది ప్రవల్లిక. "ఆయన లీడరో కాదో కాలం తెలుపుతుంది." అంది. కూతురు అలాగే చూస్తూ వుండడంతో

"ఇక నాతో జీవితం వద్దనుకొని కోర్టు ద్వారా భరణం ఇవ్వాలనుకుంటున్నాడట" అంది.

ప్రవల్లిక నిర్ఘాంతపోయి చూస్తుండడంతో "మీ మావయ్యతో అదే అన్నాడంట.." చెప్పింది శారద. తన మొఖంలో ఏ భావం లేదు. "నీకు మద్దతుగా నేను లీగల్ ఫైట్ చేస్తాను మమ్మీ.." అంది ప్రవల్లిక.

"ముందు నువ్వు ఇంజనీరింగ్ పూర్తి చేసి లైఫ్‌లో సెటిల్ కామ్మా." చెప్పింది శారద.

"నాన్నలాంటి వాడే కదమ్మా జీవితంలోకి వచ్చేది. మనకు స్వేచ్ఛ ఎక్కడుంది?" అంది బాధగా ప్రవల్లిక.

తండ్రిని కలవకుండానే కాలేజీ క్యాంపస్‌లో వున్న హాస్టల్‌కి నేరుగా వెళ్లింది ప్రవల్లిక.

కోర్టులో వాదనలు మొదలయ్యాయి.

* * *



''భర్తంటే గౌరవం లేనప్పుడు తనతో జీవించాల్సిన అవసరం నాకు లేదు" శారదా అడ్వకేట్ అరుణ క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో చెప్పాడు పరమేష్. అతడి న్యాయవాది సారంగపాణి జోక్యం చేసుకొని

"ఎస్ మిలార్డ్ నా క్లయింట్ పరమేష్ సతీమణి శారదది ధిక్కార స్వభావం. భర్త కష్టాల్లో వుండగా అతడి మాటలను ధిక్కరించి పుట్టింటికి వెళ్లింది.." చెప్పాడు న్యాయవాది.

''పుట్టింటికి వెళ్ళడం తప్పా" అడిగాడు న్యాయమూర్తి. "వెళ్ళడంలో తప్పులేదు . ధిక్కారం అనేది భార్యగా అవిధేయతే. ఈ విషయం పీనల్ కోడ్‌లో ఉండక పోవచ్చు. దీనికి శిక్షగా మీరు భరణం విధిస్తే చెల్లించడానికి నా క్లైంట్ సిద్దం. విడాకులు మంజూరు చేసి నాక్లైంటికి రిలీఫ్ ఇవ్వాల్సిందిగా ప్రార్థన" చెప్పాడు న్యాయవాది.

"కంపెనీ కష్టాల్లో వున్నప్పుడు ప్రభుత్వాన్ని ధిక్కరిస్తూ సమ్మెకు దిగడం ఏం న్యాయం? అందుకే వీరి దీక్ష న్యాయ సమ్మతం కాదని తీర్పు ఇవ్వాల్సిందిగా న్యాయస్థానాన్ని కోరుకుంటున్నాం. వీరి అవిధేయతని గుర్తించి సర్వీస్ నుండి తొలిగించా లని ప్రభుత్వం భావిస్తుంది. వీరికి రావాల్సిన బకాయిలను నిర్ణీత గడువులోనే కోర్టు వారి ద్వారా చెల్లిస్తాం. ఇందుకు తగు ఆదేశాలు కోరుతున్నాం?" తను పని చేసే ఫ్యాక్టరీ విషయంలో ప్రభుత్వం తరవున అటార్నీ జనరల్ చేసిన వాదనలు గుర్తొచ్చాయ్ పరమేష్‌కు.

''నేను మాట్లాడొచ్చా..'' లేచి నిలబడింది ప్రవల్లిక.

"మీరెవరు?"అడిగాడు ఆ ఫ్యామిలీ కోర్టు న్యాయ మూర్తి. "నేను శారదగారి కుమార్తెను." చెప్పింది.

"మీరేదయినా చెప్పదలిస్తే బోన్లో నిలబడి చెప్పండి." ఆదేశించాడు న్యాయమూర్తి. ప్రవల్లిక స్వరం సరి చేసుకుంది... "ఆర్టికల్ '19(1) ఏ' ప్రకారం దేశంలో బ్రతుకుతున్న ప్రతి మనిషికి 'ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ అండ్ ఎక్స్‌ప్రెషన్' వుంది. అది మా అమ్మకు కూడా వుంది. ఏదైనా తను నిర్భయంగా మాట్లాడ వచ్చు. సదరు ఆర్టికల్ వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించింది అని మా నాన్న పరమేష్ గారు తనవైపు నుండి వాదనని వినిపిస్తూ తన అరెస్టుని నిరసిస్తూ కార్మికుల తరపున కేసుఫైల్ చేశారు." అని ఒక కాపీ కోర్టుకి సమర్పించింది. "ఆయనకు స్వేచ్ఛ వున్నట్టే మా అమ్మకు కూడా వుంటుంది కదా! తను పుట్టింది పెరిగింది మావయ్య ఇంట్లోనే. అది తనకి పుట్టిల్లు. పెళ్లయినంత మాత్రాన బంధాలు తెగిపోవు. బాధ్యతలు మరుగున పడవు. తమ్ముడు కష్టకాలంలో వున్నాడని అతడి కూతురు ప్రసవానంతరం అండగా నిల్చేందుకు మా అమ్మ వెళ్లింది. అది తప్పెలా అవుతుంది సర్." అడిగింది. పరమేష్ వైపు లాయర్ సారంగపాణి ఎంటరై "కార్మికులకుండే హక్కు కుటుంబ సభ్యుల మధ్య వుండే 'బంధం' రెండూ ఒకటే ఎలా అవుతాయి యువరానర్. ఈ అమ్మాయిది అర్థం లేని వాదన." అన్నాడు.

న్యాయమూర్తి అతని వాదన తోసి పుచ్చి ప్రవల్లిక వైపు చూసి "నువ్వు చెప్పమ్మా.." అన్నాడు.

"మా నాన్నది 'ఇగో' ప్రాబ్లమ్. మేల్ డామినేషన్. తనకు మాత్రమే రాజ్యాంగం కల్పించిన హక్కులు వున్నాయ్ అనుకుంటున్నాడు. అదే హక్కులు మా అమ్మకు కూడా వున్నాయని మర్చిపోతున్నాడు. అందువల్ల ఈ విడాకులు పిటీషన్ తిరస్కరించా ల్సిందిగా వేడుకుంటున్నాను." చెప్పింది. శారద తరపు లాయర్ అరుణ ప్రవల్లిక వైపు అభినందనగా చూసింది. వాద ప్రతివాదనలు జరిగాయి. కోర్టు కేసు వాయిదా పడింది.

"చాలా చక్కగా మాట్లాడావ్. 'లా' చదవకుండానే లాయర్ వయ్యావు." అంది నవ్వుతూ అరుణ.

"అమ్మకోసం చట్టాలు తిరగేసాను మేడమ్. 19(1) ఏ క్లాజ్ నన్ను చాలా ఆకర్షించింది. మా డాడీ ఇదే క్లాజ్ వాడాడు అని మీడియా ద్వారా తెలిసింది. వ్యక్తి స్వేచ్ఛ హరించబడితే అది మంచి సమాజం ఎలా అవుతుంది?

ఒక ఫ్యాక్టరీలో పని చేసే నాన్న తన హక్కుల సాధనకోసం సమ్మె చేస్తే లేని తప్పు మానాన్న మాటలు కాదని అమ్మ తన స్వీయ బాధ్యతల్లో భాగంగా పుట్టింటికి వెళితే తప్పెలా అవుతుంది? పెళ్లయితే మాత్రం పుట్టింటితో వున్న అన్ని బంధాలు తెంచుకోవాలా? వ్యక్తి స్వేచ్ఛని హరించడానికి కుటుంబంలో కూడా ఎవరికీ హక్కు లేదు." అంది భావోద్వేగంగా కోర్టు ఆవరణలోనే. పరమేష్ కూతురు దగ్గరకి వచ్చాడు. శారద కాస్త దూరంగా వెళ్లి తండ్రీకూతుళ్లను గమనిస్తూనే వుంది. "నువ్విలా చేయడం బాగలేదురా బంగారం. అమ్మ మీద మాత్రమే నీకు ప్రేమ వుందా? ఈ నాన్న మీద లేదా?" అన్నాడు నిష్టూరంగా "మీరు ట్రేడ్ యూనియన్ లీడరు. బయట ఏ హక్కుల కోసం పోరాటం చేస్తున్నారో అదే హక్కులు ఇంట్లో వాళ్లకి కూడా వుంటాయని తెలిసి కూడా హరిస్తు న్నారు." అంది.

''నేను చేసే పోరాటం మన కుటుంబంకి మరిన్ని సౌకర్యాలు కల్పించడం కోసమే. ఫ్యాక్టరీ నిలిస్తే నాకు ప్రమోషన్ వస్తుంది. జీతం పెరుగు తుంది. భావితరాలకు ఉపయోగం." చెప్పాడు.

"ప్రభుత్వం కూడా మీ నుండి విధేయత కోరుకుంటుంది. ఈలోపే మీ హక్కుల కోసం ఉద్యమం మొదలు పెట్టారు. మీ అవసరాలు మీవి. ఇక్కడ కూడా అమ్మ అవసరం అమ్మది." అంది.

"అదీ ఇదీ ఒకటి ఎలా అవుతుంది? పెళ్లి కానంత వరకే ఆడపిల్లకు పుట్టింటితో బంధం వుంటుంది." అన్నాడు.

''అదే పుట్టింటికే మీ అవసరాల కోసం పంపిస్తారు. ఇదెక్కడి న్యాయం? ఉద్యోగి కానంత వరకూ మీరూ నిరుద్యోగే! జాబ్‌లో చేరాక మీకు కూడా కోడ్ ఆఫ్ కాండక్ట్ వుంటుంది కదా? మరి మీరు దాన్నెందుకు ధిక్కరించారు?

"మేం చెప్పినట్టు వినాలి అని ప్రభుత్వం అంటే మీరు వూరుకుంటున్నారా? జైల్లో పెడితే వ్యక్తి స్వేచ్ఛ వుందని మీరు '19(1) ఏ' ఆర్టికల్ని మీరు వాడుకోవడం లేదా? ఇదే హక్కు కోసం మా అమ్మ పోరాటం చేస్తే తప్పేముంది.?" అని నిలదీసింది.

"మీ అమ్మ నిన్ను బాగా చెడిపేసింది." అన్నాడు కోపంగా.

"లేదు అమ్మ నా కళ్లు తెరిపించింది. నేను డిగ్రీలో చేరి లా కోర్సు చదువుతాను అంటే నా ఆలోచన లనూ, అభిరుచులని పట్టించుకోకుండా మీ ఇష్టం మేరకే బి.టెక్ చేర్పించారు. ఫస్ట్ క్లాస్ డిగ్రీలో పాసయిన అమ్మ- ఉద్యోగం చేస్తాను అంటే ఒప్పుకోకుండా వంటింటికే పరిమితం చేశారు" అని కాసేపు ఆగి..

"బై డాడీ నేనూ, అమ్మా ఇక మీ జీవితంలో వుండం." అని ప్రవల్లిక ముందుకు సాగింది. ఏం మాట్లాడలో అర్థం కాలేదు పరమేష్‌కి. ★



# రాజకీయ 'వేదాంత శిల్పి' అరవిందులు

గౌతమ్ చౌబే



అరవిందులు బాల్యదశలోనే పాశ్చాత్య విద్యాభ్యాసం చేసి నిష్ణాతులయ్యారు. వారి ధోరణి భారతీయ సనాతన ధర్మసిద్ధాంతానికి అనుగుణంగా, మన స్వాతంత్య్రోద్యమంలో నిర్మాణాత్మకమైన పాత్ర పోషించింది. 1893లో 21వ ఏట ఇంగ్లండు నుంచి భారత్‌కు తిరిగి వచ్చారు. కనీసం తన మాతృ భాష బెంగాలీలో మాట్లాడే పరిస్థితికైనా నోచుకోలేదు. అందుకు కారణం లేకపోలేదు. ఏడేళ్ల వయసులోనే దేశం వదిలేసి లండన్ నగరంలోని సెయింట్స్ పాల్ పాఠశాల, ఆ తర్వాత కేంబ్రిడ్జ్ కళాశాల వలస విద్యాకేంద్రాల ప్రవాసం తప్పనిసరి అయింది. కింగ్స్ కాలేజీలో ఆయన ప్రతిభా పాటవం పరాకాష్టకు చేరింది. తదుపరి, రెండు దశాబ్దాలు తన దేశభక్తిని నిరూపించుకునే అవకాశం కలిగింది. స్వాతంత్ర్య సమర యోధుడిగా ముందంజలో ఉన్నారు. అరవిందులు 1910లో పాండిచేరి వెళ్లే నాటికి భారత జాతీయ ఉద్యమంలో ఒక ఆదర్శ మార్గదర్శిగా గుర్తింపు పొందారు. గాంధీజీ సహా ఎందరో ఉద్యమ నాయకులు ఆయన అనుయాయులుగా, ఆయన అడుగుజాడలో నడవగలిగారు.

వలస వారసత్వం, బానిసత్వం లాంటి జీవ, భావ, దాస్యాల నుంచి విముక్తి పొందే మార్గాన్వేషకులలో అరవిందులు ప్రథమ తాంబూలం అందుకున్న మాట వాస్తవం. ఇంగ్లండు నుంచి తిరిగి వచ్చిన అనతి కాలంలోనే ఆయన స్వదేశీయ, వారసత్వపు వేగుచుక్కగా, ఒక ధ్రువ నక్షత్రంగా ఊపు అందుకోవడం అంతుపట్టని వింత సంఘటన. పాశ్చాత్య పర్యావరణంలో చిక్కుబడ్డ ఆయన హృదయ క్షేత్రంలో వలస వారసత్వపు వ్యతిరేక భావన ఎలా మొలకెత్తిందో తెలుసుకోవలసిన అవసరం ఉన్నది.

ఆంగ్ల మానసపుత్రుడు భావదాస్యపు శత్రువు ఎలా కాగలిగాడు? అన్న ప్రశ్నకు సమాధానం కావాలి. అది కోల్‌కతాలోనే బయటపడింది. అరవిందుల ఆగమ సమయానికి బంగాళాలో (వంగభూమి) మూడు రకాల రాజకీయ సైద్ధాంతిక విజ్ఞాన కేంద్రాలు రూపుదిద్దుకున్నాయి. మొదటిది రాజారామమోహన్‌రాయ్ నేతృత్వంలో, ఆయన అనుయాయి రవీంద్రనాథ్ టాగోర్, ప్రతిపాదించిన సమన్వయ సిద్ధాంతం. తూర్పు పడమరల కలయిక కోసం భారత్–బ్రిటిషువర్గాలు ఏకమై తమ రాజకీయ బాంధవ్యాన్ని మరింత దృఢపరచుకోవడానికి వీలుగా అవగాహన, అవసరం. అందుకు తగ్గ మార్పులు, చేర్పులు, చాలనుకున్న మితవాదం అలా గూడు కట్టింది. రెండవది, మైఖేల్ మధుసూదన్ దత్తా, అరవిందుల తండ్రి డాక్టర్ కృష్ణధన్‌ఘోష్ 'ఆంగ్లేయ ప్రభుత్వం భారతదేశానికి ఒక వరం' అని వాదించారు. పాశ్చాత్య, క్రైస్తవ, అనన్యభక్తి, కేవలం శరణాగతి ధ్యేయంగా దత్తా క్రైస్తవ తీర్థం పుచ్చుకుని జీవితాంతం గ్రీకు, ఆంగ్ల సాహిత్య భజన మండలిని కొనసాగించారు. డాక్టర్ ఘోష్ ఏడేళ్ల పసి ప్రాయపు అరవిందుల పాటు తమ పుత్ర సంతానాన్ని ఇంగ్లండుకు పంపారు. పైగా ఇంగ్లీషు నేర్వడానికి ఒక గాడ్ ఫాదర్‌ను ఏర్పాటు చేసి, భారతీయ వాసన లేకుండా కట్టుదిట్టం చేశాడు.

మూడవది, బంకించంద్ర ఛటర్జీ, స్వామి వివేకానంద ప్రతిపాదించిన భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనం. ప్రపంచం భారతదేశం నుంచి పాఠం నేర్చుకోవలసినది చాలా ఉన్నది. నైతికంగా పతనమైన పాశ్చాత్య ఖండానికి పరమ ఔషధం తత్త్వజ్ఞానం, ఆ జ్ఞానవిజ్ఞానమే గార్హిత్వం అసంఖ్యానికి మార్గదర్శనం చేయించగలదని, దాస్య శృంఖలాలను ఛేదించగలదని గళమెత్తారు.

దేశమాత శక్తి స్వరూపిణిగా, దేశభక్తుడు సన్యాసిగా వెలసిన ఈ భారతం, కేవలం నిర్జీవమైన ఒకే భౌగోళిక– రాజకీయ విభాగం కాదు. అది ఒక సమైక్య జీవన విధానపు దారిదీపం. ఒక కరుణామయి కటాక్ష వీక్షణంతో మాతృత్వం పొంగులెత్తిన ఒక భవ్యజీవన దివ్య సాక్షాత్కారం. 'దేశం ఒక మహాశక్తి, అన్ని శక్తుల సంకలనం' అంటారు అరవిందులు. దేశభక్తుల కోసం వెలసిన దైవ మందిరం అని, దేశభక్తుడు ఒక దివ్య ఆయుధం అని ఆయన అభిప్రాయం. ఆనందమఠంలోని సన్యాసిని స్వాతంత్ర్య సమర రంగంలో ఒక సాహస వీరుడిగా నిలబెట్టారు ఈ తృతీయ వర్గీయులు. 'వందేమాతరం' పత్రికలో అరవిందులు, 1907లో 'రాజకీయ వేదాంతం' అన్న శీర్షికతో వివేకానందుల అనుష్ఠాన వేదాంతాన్ని విపులీకరించి, ఆచరణ యోగ్యమైన రాజకీయ విధానంగా తెరపైకి తెచ్చారు. మానవత్వపు ప్రతిరూపమే దైవంగా వివేకానందుడు భావించారు. దేశమే ఆ దైవం విస్పష్ట ప్రతిరూపంగా అరవిందులు ప్రతిష్ఠించారు. దేశాన్ని సంరక్షించడానికి మహాకాళి లాంటి నూతన సన్యాస వర్గం ప్రాణత్యాగానికి వెనుకాడకుండా ముందుకు రావాలని ఆకాంక్షించారు.

అత్యంత నిగూఢం, సారవంతం అయిన జాతీయ విజ్ఞాన సంపదను, వనరులను, సమీకరించి సాధించగల అరవిందులు సాహసచర్య, ఆయనను సామాన్య ప్రజానీకానికి మరింత చేరువ చేసింది. రాజకీయ స్వేచ్ఛతోపాటు ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం, సాధనా మార్గం, ప్రపంచానికి చాటి చెప్పగలిగారు. ఆధ్యాత్మిక జగత్తుకు భారతమాత కులదైవంగా, వలస బానిసత్వం పాలిటి కాళికగా, కొలువు తీర్చి సాంస్కృతిక రంగాన్ని ప్రభావితం చేయడమే ఆయన పరమ గమ్యం. రాజకీయ స్వాతంత్ర్యం ఆ మహాయజ్ఞంలోని ఒక ముఖ్యాంశం. ఆ విధంగానే, భావితరాలు ఎంతటి త్యాగానికైనా సిద్ధమై, దేశభవిష్యత్ కోసం పోరాడే వీరరక్షక భటులై నవభారత నిర్మాతలుగా వెలుగుదారి చూపాలని అభిలషించారు.

'ఆర్గనైజర్' నుంచి

అను: వీఆర్వీ

# భారత మహిళా క్రికెట్‌కు మహర్దశ

ఐపీఎల్ ఆలోచనతో భారత మహిళా క్రికెట్ రొట్టె విరిగి నేతిలో పడింది. ఫ్రాంచైజీలు, ప్రసారహక్కుల వేలం ద్వారా బీసీసీఐకి 5 వేల 500 కోట్ల రూపాయలు దక్కాయి. భారత మహిళా క్రికెటర్లు సైతం కోట్ల రూపాయలకు పడగలెత్తనున్నారు. ప్రపంచంలోనే అత్యంత భాగ్యవంతమైన భారత క్రికెట్ బోర్డు.. ఐపీఎల్ నిర్వహణతో వేల కోట్ల రూపాయలు ఆర్జిస్తోంది. భారత క్రికెట్ నిత్య కల్యాణం పచ్చతోరణంలా వెలిగిపోతోంది. గత 15 సీజన్లుగా ఐపీఎల్‌ను అత్యంత విజయవంతంగా నిర్వహించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ క్రికెటర్లను కుబేరులుగా మార్చిన బీసీసీఐ.. మహిళా క్రికెటర్ల జీవితాలను సైతం మార్చేయటానికి రంగం సిద్ధం చేసింది.



మహిళా ఐపీఎల్ ప్రారంభ (2023) సీజన్ కోసం నగారా మోగింది. ప్రసారహక్కులు, ఫ్రాంచైజీల బిడ్ల ద్వారా ఐపీఎల్ నియంత్రణ మండలి కళ్లు చెదిరే మొత్తాలను సంపాదించింది. మొత్తం ఐదు (అహ్మదాబాద్, ముంబై, బెంగళూరు, ఢిల్లీ, లక్నో ) ఫ్రాంచైజీల వేలం కోసం సీల్డ్ కవర్ బిడ్లను ఆహ్వానించిన ఐపీఎల్ బోర్డుకు ఊహించనంత ఆదాయం వచ్చిపడింది. మొత్తం ఐదు జట్ల కోసం ఐదేళ్లకు గాను 4 వేల 669.99 కోట్ల రూపాయల ధర పలికింది. తన ధనబలంతో రకరకాల వ్యాపారాల నుంచి మీడియా సంస్థల వరకూ కబళిస్తూ వస్తున్న అదానీ గ్రూపు కన్ను చివరకు మహిళా ఐపీఎల్ పైనా పడింది. అహ్మదాబాద్ ఫ్రాంచైజీ కోసం అదానీ స్పోర్ట్స్ లైన్ సంస్థ రికార్డు స్థాయిలో 1289 కోట్ల రూపాయలతో బిడ్ వేసి విజేతగా నిలిచింది. ముంబై ఫ్రాంచైజీ హక్కులను ఇండియా విన్ సంస్థ 912.99 కోట్ల రూపాయలకు సొంతం చేసుకొంది. రాయల్ చాలెంజర్స్ సంస్థ బెంగళూరు ఫ్రాంచైజీ కోసం 901 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సొంతం చేసుకుంది. ఢిల్లీ, లక్నో ఫ్రాంచైజీలకు 810 కోట్ల రూపాయలు, 757 కోట్ల రూపాయలు ధర పలికింది. బెంగళూరు ఫ్రాంచైజీ యజమానిగా రాయల్ చాలెంజర్స్ ప్రయివేట్ లిమిటెడ్, ఢిల్లీ ఫ్రాంచైజీ ఓనర్‌గా జెఎస్ డబ్ల్యు జీఎమ్మార్ క్రికెట్ ప్రయివేట్ లిమిటెడ్, లక్నో ఫ్రాంచైజీకి కాప్రి గ్లోబల్ హోల్డింగ్స్ ప్రయివేట్ లిమిటెడ్ వ్యవహరిస్తాయి.

## ప్రసార హక్కుల ద్వారా...

2008లో పురుషులకు ఐపీఎల్‌ను ప్రారంభించిన బీసీసీఐ.. గత 15 సీజన్లుగా కాసుల పంట పండించుకుంటూనే వస్తోంది. 8 జట్ల నుంచి 10 జట్లకు ఐపీఎల్‌ను విస్తరించింది. అంతటితో ఆగకుండా మహిళలకూ ఐపీఎల్‌ను నిర్వహించాలన్న నిర్ణయం జాక్ పాట్‌లా మారింది. మహిళా ఐపీఎల్ మీడియా హక్కులను ముఖేశ్ అంబానీకి చెందిన వైకామ్ 18 మీడియా సంస్థ దక్కించుకుంది. వచ్చే ఐదేళ్ల కాలానికి ఈ సంస్థ మీడియా ప్రసార హక్కులను రూ.951 కోట్ల ధరకు కైవసం చేసుకొంది. ఒక్కో మ్యాచ్‌కు రూ.7.09 కోట్లు చెల్లించనుంది. పురుషుల జట్టుతో సమాన వేతనం తర్వాత.. మహిళల క్రికెట్ మహర్దశకు ఇదే అతిపెద్ద, కీలకమైన అడుగు. మార్చి 5 నుంచి 23 వరకు మహిళల ఐపీఎల్ తొలి సీజన్ జరగనుంది. సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న మహిళా క్రికెటర్లకు రూ.50 లక్షలు, రూ. 40 లక్షలు, రూ.30 లక్షల బేస్ ప్రైజ్, మిగతా వాళ్లకు రూ. 20 లక్షలు, రూ.10 లక్షలు కనీస ధరను బీసీసీఐ ప్రకటించింది. త్వరలోనే క్రికెటర్ల వేలం కార్యక్రమం సైతం జరుగనుంది.



**క్రీడా కృష్ణ, 84668 64969**

సీనియర్ జర్నలిస్ట్

## ఐసీసీ ఆదేశాలతో కొత్త ఊపిరి..

క్రికెట్లో పురుషులు, మహిళలు అన్న వివక్షకు చోటు లేదని, పురుషులతో సమానంగా మహిళలకూ సదుపాయాలు, వేతనాలు కల్పించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి తన సభ్య దేశాలకు హుకుం జారీ చేసింది. ఐసీసీ ఆదేశాలతో మహిళా క్రికెట్‌ను సైతం బీసీసీఐ తనకు అనుబంధంగా చేర్చుకోవడంతో.. ప్రోత్సాహం, ఆదరణతో పాటు ప్రచారం కూడా గణనీయంగా పెరిగింది. పురుషులతో సమానంగా శిక్షణ, ఇతర సదుపాయాలను కల్పిస్తోంది.

## వార్షిక కాంట్రాక్టులతో..

ఇప్పటి వరకూ అరకొరగా వేల రూపాయలు మాత్రమే మ్యాచ్ ఫీజులుగా అందుకొంటున్న భారత మహిళా క్రికెటర్లకు బీసీసీఐ తొలిసారిగా వార్షిక కాంట్రాక్టు విధానం ప్రవేశపెట్టింది. క్రీడాకారుల ప్రతిభ, అనుభవం ప్రాతిపదికగా గ్రేడ్-ఏ ప్లేయర్లకు ఏడాదికి 50 లక్షల రూపాయలు, గ్రేడ్-బీ ప్లేయర్లకు 30 లక్షల రూపాయలు, గ్రేడ్-సీ ప్లేయర్లకు 10 లక్షల రూపాయలు చెల్లిస్తూ వస్తోంది. ఇది కాక, టెస్టులు, వన్డేలు, టీ-20 మ్యాచ్‌లకు అదనంగా మ్యాచ్ ఫీజు అందిస్తూ వస్తోంది.

ప్రస్తుతం రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత పురుషుల జట్టుకు బీసీసీఐ చెల్లిస్తున్న మ్యాచ్ ఫీజులనే ఇక నుంచి హర్మన్ ప్రీత్‌కౌర్ నాయకత్వంలోని భారత మహిళా క్రికెటర్లకు చెల్లించాలని నిర్ణయించింది. ఐదు రోజుల టెస్ట్ మ్యాచ్ ఆడిన ఒక్కో మహిళా ప్లేయర్‌కు 15 లక్షల రూపాయలు, వన్డే మ్యాచ్‌కి 6 లక్షల రూపాయలు, టీ-20 మ్యాచ్‌కు 3 లక్షల రూపాయలు మ్యాచ్ ఫీజుగా చెల్లించనున్నారు. బోర్డు వార్షిక కాంట్రాక్టులు, మ్యాచ్ ఫీజులు, ఐపీఎల్ వేలం మొత్తాలతో మహిళా క్రికెటర్లు సైతం కోట్లకు పడగలెత్తబోతున్నారు. పురుషులతో సమానంగా మహిళా క్రికెట్ మ్యాచ్‌లు పట్టుగా, ఉత్కంఠభరితంగా సాగుతూ జనాదరణ పొందాలని కోరుకుందాం. ★

# స్వతంత్ర భారత రాజకీయ

స్వతంత్ర భారతదేశ చరిత్రలో రాజకీయంగా, సామాజికంగా కీలక మలుపులకు కారణమైన ఘటనలు చాలా కనిపిస్తాయి. ఇందిరాగాంధీ హత్య, ఆర్థిక సంస్కరణలు, అయోధ్యలో వివాదాస్పద కట్టడం కూల్చివేత ఆధునిక భారత రాజకీయాలను మలుపు తిప్పాయి. ఒకటి రాజకీయ వ్యవస్థకు కుదుపు నిచ్చింది. రెండోది భారత ఆర్థిక వ్యవస్థను నిల బెట్టింది. మూడవది హిందూత్వ కేంద్ర బిందువుగా భారత రాజకీయాలను మలిచింది. ఆ మూడు సందర్భాలలోను కేంద్రంలో ప్రముఖ స్థానంలో ఉన్నవారు పీవీ నరసింహారావు.



**విలక్షణ పి.వి. నరసింహారావు గారి జీవిత చరిత్ర**

**రచన:** డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి
**ప్రతులకు:** నీల్‌కమల్ పబ్లికేషన్స్, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్,
ఫోన్: 80199 18182.
**పే:** 308, **వెల:** రూ.395/-

ఉన్నారు. ఆయన పండిత రాజకీయవేత్త. రచయిత, వక్త. పరిపాలనా దక్షుడు. ఆజాదీ కా అమృతోత్సవాల సందర్భంగా చరిత్రలో చోటు దక్కని ఎందరో మహానుభావులను తలుచుకునే అవకాశం కల్పించినట్టు, పీవీ అనే ఆ రాజకీయ మౌనికి చరిత్రలో ఉన్న స్థానం గురించి ప్రపంచానికి తెలియచెప్పే పనిని డాక్టర్ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి తీసుకున్నారు. దాని ఫలితమే 'విలక్షణ పి.వి.: నరసింహారావుగారి జీవితచరిత్ర' పుస్తకం.

పీవీనీ, ఆయన దేశానికీ, ఆర్థిక వ్యవస్థకూ అందించిన సేవను స్మరించుకోవడం ఒక అవసరం. 1962లో నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో చేరిన పీవీ తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. జనతా పార్టీ ఆవిర్భావం, కాంగ్రెస్ పతనం తరువాతనే ఆయన ఢిల్లీ రాజకీయాలకు వెళ్లారు. మొదటిసారి లోక్‌సభకు వెళ్లగానే ఆయనకు పబ్లిక్ ఎకౌంట్స్ కమిటి చైర్మన్ పదవి వరించింది. తనకు ఢిల్లీతో, అయినా ఆయనకు అదనంగా వచ్చిన ప్రతిష్ట ఏదీ కనిపించదు. అందుకే ఎన్నో త్యాగాలు చేసి, సుదీర్ఘకాలం భారత స్వాతంత్ర్యోద్యమంతో నడిచిన చాలామంది వలెనే పీవీకి కూడా చరిత్రలో తగిన చోటు దక్కలేదు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఢిల్లీ రాజకీయాలకు చేరుకున్న ఈ 'బృహస్పతి'కి ప్రతి దశలోను రాజకీయ రాహువు, ఎదురీత రూపంలో కేతువు వెంటాడుతూనే నిజానికి తాను జీవితాంతం అంటిపెట్టుకుని ఉన్న కాంగ్రెస్ తోనూ అనుబంధం తీరిపోయిందని భావిస్తున్న తరుణంలో 1991లో దేశ ప్రధాని పదవిని అలంకరించారు పీవీ. అంతకు ముందు రక్షణమంత్రిగా, ఆర్థికమంత్రిగా, విదేశాంగ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినవారే. ఈ శాఖలను ప్రధాని పదవితో సమానమైనవిగా చెబుతారు. ఆ విధంగా చూస్తే పీవీ రాజకీయ జీవితంలో విజయాలదే సింహభాగం. అపజయాలు నగణ్యం. ఈ అంశాలన్నింటినీ బాలశ్రీనివాసమూర్తి 27 అధ్యాయాలలో వివరించారు.

పీవీ జీవితం, సేవల మీద వెలువడిన గ్రంథాలలో ఇదే మొదటిదని అనుకోనక్కరలేదు. చాలా పుస్తకాలే వచ్చాయి. అజోవిభో వారు వేసిన విశిష్ట సంచిక అలాంటిదే. ఇక 'లోపలి మనిషి' వారి ఆత్మకథాత్మక నవలగానే ప్రసిద్ధమైంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం వెలసిన తరువాత ఆయన నాగపూర్‌లో చదువుకున్నారు కాబట్టి ఆ దశలో ఎంతో కొంత ఆర్‌ఎస్ఎస్ పరిచయం జరిగి ఉండవచ్చునని రచయిత అభిప్రాయం. అలాగే రాజకీయ జీవితం లోకి ప్రవేశించిన తరువాత స్వామి రామానందతీర్థ, పండిత రాజకీయనేత, ఉద్యమకారుడు బూర్గుల రామకృష్ణారావుల శిష్యరికం ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. 'పీవీ ప్రథమ ప్రధాని పండిట్ నెహ్రూను అభిమానించారు. ఆయన రచనల్ని లోతుగా చదివారు. నెహ్రూ ఆలోచనా విధానాన్ని ఆకళింపు చేసుకున్నారు. అయితే ఆయన ప్రభావం తీక్షణ స్థాయిలో పీవీపై ప్రసరించినట్టుగా భావించలేము. కానీ నెహ్రూ కుమార్తె ఇందిరాగాంధీ ఆలోచనలు మాత్రం పీవీని బాగా ప్రభావితం చేశాయి' (పే 27) అంటారు రచయిత. కానీ లోపలి మనిషిలో ఇందుకు విరుద్ధమైన చిత్రణ కనిపిస్తుంది. నెహ్రూ మరణం తరువాత దేశం ఏమైపోతుందని కలత పడినవారిలో ఆనంద్ (నవలా నాయకుడు, నిజానికి పీవీ పాత్రే) ఒకరు. అలాగే నెహ్రూ ఛాయను కూడా భారతీయ వ్యవస్థ మీద నుంచి ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా అంతర్థానం కావాలని ఆమె ఆశించినట్టు కూడా పీవీ చిత్రించారు. ఈ ప్రస్తావన ఈ గ్రంథంతో సంబంధం లేనిదే అయినా, పీవీ సునిశిత రాజకీయ మేధస్సును, తాను పరిశీలించిన ఇద్దరు తొలి ముఖ్య ప్రధానుల గురించి ఆయనకు అంచనా ఏమిటో సులభంగా అవగాహన చేసుకోవచ్చు.

అదేం చిత్రమో ఆది నుంచి దిగ్గంతాలతోనే పీవీ పోటీ పడ్డారు. 1952లో జరిగిన భారత తొలి సార్వత్రిక ఎన్నికలలో ఆయన బద్దం ఎల్లారెడ్డి (పీడీఎఫ్), జువ్వాడి గౌతమరావు (సోషలిస్టు పార్టీ)లతో తలపడి ఓడిపోయారు. ఆ ఓటమి నుంచి ఆయన పాఠాలు నేర్చుకుని రాష్ట్ర రాజకీయాలకు పరిమితమై ఎదిగారు. ఢిల్లీ రాజకీయాలకు ఆయన ఒక రాజకీయవేత్తగా వెళ్లారా, రాజకీయ పరిశీలకునిగా వెళ్లారా, లేకుంటే చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా అక్కడ ఉన్నారా అన్నది సందేహం వచ్చే విధంగా ఆయన ప్రస్థానం ఉంది. ప్రధానిగా విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ హయాం గురించి వివరించడం అలాంటిదే. దేశంలో ఆర్థిక సంస్కరణల అవసరం ఆ హయాంలోనే పీవీ గమనించారని అనిపిస్తుంది. జనతా పాలన, చరణ్‌సింగ్ రాక, మళ్లీ ఇందిర ఎంపిక, ఆమె హత్య, ఢిల్లీ అల్లర్లు, రాజీవ్ ప్రధానమంత్రిత్వం, అయోధ్య ఉద్యమం, బీజేపీ పరిణామ క్రమం– వీటన్నిటికీ పీవీ ప్రత్యక్ష సాక్షి. ఆయన తెర వెనుక పనిచేయగలరు. తెర మీదకూ రాగలరు. పీవీ పార్టీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పుడు నాటి ప్రధాని ఇందిరకు

కావలసిన చాలా కీలక ఉపన్యాసాలు ఆయన తయారుచేసినవేనని అంటారు. అవి ఆమెకు చాలా పేరు తెచ్చాయి. తరువాత ఆయన విదేశాంగ మంత్రి అయిన తరువాత కాంగ్రెస్ వర్గాలే గగ్గోలు పెట్టే చర్య తీసుకున్నారు. అది భారత విదేశాంగ వ్యవహారాల నుంచి అలీన విధానానికి స్వస్తి పలకడం. అది నెహ్రూ ఆత్మను కూడా క్షోభింప చేస్తుందని భావించినవారు ఉన్నారు. అలాగే లుక్‌ఈస్ట్ విధానం. ఇజ్రాయెల్ వైపు మొగ్గు. లుక్‌ఈస్ట్ ఉద్దేశం చైనాను నిలువరించడం. వీటిని పీవీ కాలానుగుణంగా దేశ ప్రయోజనాల కోసం సంస్కరిస్తే, సొంత పార్టీ మాత్రం నెహ్రూ పట్ల అపచారంగా ప్రచారం చేసింది. అయినా పీవీ వెనక్కి తగ్గలేదు. కాలం కూడా పీవీకే గెలుపును కట్టబెట్టింది. ఆయన దృష్టి కాలపరీక్షకు నిలిచేదని రుజువైంది. అసలు ఏ మంత్రిత్వ శాఖను తీసుకున్నా పీవీ సంస్కరణలకు ప్రాధాన్యం ఇచ్చారు. కొన్ని సందర్భాలలో అవి తన పదవికి ఎసరు పెట్టాయి కూడా. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన తెచ్చిన భూసంస్కరణలు అంతిమంగా ఆయనను పదవి నుంచి దించడానికి ఎదురుచూస్తున్న వారి పంట పండించాయి.

పీవీ నిశ్చయంగా కాంగ్రెస్ పార్టీలో కనిపించే మిగిలిన నాయకుల వంటివారు కాదు. ఆ పార్టీని నమ్మి, పెంచిన సెక్యులరిజానికీ, పీవీ ఆలోచనలోని సెక్యులరిజానికీ చాలాదూరం ఉందని రచయిత అంటారు. ఇందుకు కారణం నాగపూర్ జీవితం, ఆర్ఎస్ఎస్‌తో పరిచయం ఉన్న కారణం కావచ్చునేమోనని (పే 24) రచయిత చెబుతారు. అదేమో కానీ,

# ...ాలపై చెరగని ముద్ర

అర్జున్‌సింగ్ వంటి సెక్యులరిస్టు కాదు పీవీ. ఒకటి వాస్తవం ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా, తరువాత జనసంఘ్, బీజేపీ నేతగా ఎదిగిన మరొక పండిత రాజకీయవేత్త అటల్ బిహారీ వాజపేయితో మాత్రం ఆయన సాన్నిహిత్యం లోతైనదే. ఆర్థికంగా దివాలా అంచున ఉన్న దేశంలో మైనార్టీ ప్రభుత్వం కూడా పడిపోయి, మళ్లీ ఎన్నికలు వస్తే జరిగేదేమిటో అంతటి నేత ఊహించగలరు కాబట్టే కొన్ని 'పనులు' చేసి తన ప్రభుత్వాన్ని ఐదేళ్లు నడిపించారు. దీనిని చరిత్ర అర్థం చేసుకోవలసి ఉంది. భారత ప్రత్యక్ష రాజకీయాల తత్వాన్ని పీవీ అంత బాగా గ్రహించినవారు ఉన్నారా అంటే అనుమానమే.

కేవలం రాజకీయ జీవితాన్ని వివరిస్తే పీవీ జీవిత చరిత్రకు న్యాయం చేసినట్టు కాదు. అందుకే తమ ప్రాంతంలో ఏర్పాటయిన హరికథకు రావలసిన హార్మోనిస్టు రాకుంటే, ఆ బాధ్యతను తీసుకుని విజయవంతం చేసిన పీవీ గురించి కూడా రచయిత ఈ పుస్తకంలో ఉదహరించారు. అలాగే పీవీ సాహిత్య సేవ ఏ మహోన్నత భారతీయ సాహిత్యవేత్తకు తీసిపోయేది కాదు. వేయి పడగలు నవలను హిందీ వారికి పరిచయం చేసినవారు పీవీయే.

స్వతంత్ర భారత చరిత్రలో పీవీ స్థానాన్ని అంచనా వేయడం నిజానికి కష్టం. ఆయనకు ఉన్న బహుముఖ ప్రజ్ఞే ఇందుకు కారణం. అంత పెద్ద కాంగ్రెస్ పార్టీలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకోగలరు. స్వతంత్ర భారత రాజకీయ చరిత్రలో ఆయన స్థానం మందాకిని వంటిది. కానీ పీవీ ఎంతో ఆత్మ స్థైర్యంతో చెప్పిన మాటే నిజం. అది– 'మరణానంతరం కూడా తాను జీవించే ఉంటాను' అంటూ ప్రధానిగా పదవీ స్వీకారం చేసిన తరువాత పీవీ తన ప్రసంగంలో చెప్పారు. అదే నిజం. ఈ ప్రయత్నమే డాక్టర్ బాలశ్రీనివాసమూర్తి తన పుస్తకంలో నిజాయతీగా చేశారు. ★

## 'బహుభాషలు నాలుకపై నాట్యమాడుతున్నా మౌనాన్ని ఆశ్రయించిన సిద్ధయోగి'

'రాజకీయ బలిపీఠాన్ని నెత్తిన మోసిన/ వెంకట నరసింహ వామన స్వరూపమతడు' అన్నారు కవి నూటెంకి రవీంద్ర. నిజమే పీవీ అంటే స్వతంత్ర భారత రాజకీయ బలిపీఠం కింద కుంగిపోయినట్టే కనిపిస్తారు. అంతేకాదు, 'భారత జాతీయ రత్నమై వెలిగే ధ్రువతార అతడు' అని (లోపలి మనిషి) కూడా కవి వర్ణించారు. పీవీ రాజకీయ జీవితంలోని ఆటుపోట్లు ఇలాగే ఉన్నాయి. శ్రీ పీవీ శత జయంతి కమిటి నిర్వహించిన కవితల పోటీలో తొలి బహుమతి పొందిన కవిత ఇది. పీవీ వంటి పండిత రాజకీయవేత్త శత జయంతికి జరిగిన ఈ ప్రయత్నం మెచ్చదగినది. ఆయన రాజకీయ జీవితం ఎంత లోతైనదో, ఆయన సాహిత్యాభిలాష, సాహితీసేద్యం కూడా అంతే లోతైనవి. 143 కవితలతో 'కాలాతీతుడు' పేరుతో ఈ సంకలనం వెలువరించారు. ఈ కవితలన్నీ పీవీ వ్యక్తిత్వాన్నీ, ప్రతిభా సామర్థ్యాలనీ ఆవిష్కరించే ప్రయత్నం చేశాయి కూడా.'నోటుపైన కనపించే భాషలను/నాలుకపై నాట్యం చేయించి'నవారు పీవీ అంటూ బలగం లేని బలమైన నాయకుడు కవితలో గుండేటి రమణ వర్ణించడం చక్కగా ఉంది. ఇంతకు మించిన చమత్కారం 'పీవీ ఠీవి'లో మంజుల సూర్య చేశారు. 'బహు భాషలు నాలుకపై నాట్యమాడుతున్నా /మౌనాన్ని ఆశ్రయించిన సిద్ధయోగి' అన్నారామె. కానీ ఆయన కార్యశీలి. జీవితంలో మాటలు కాదు చేతలే చూపారు. 'తెగిన ఆర్థిక దారానికి ఒడుపుగా వేసిన ముడి' అతడు అంటూ ఆయన ఆర్థిక సంస్కరణల సారాన్ని చక్కగా కవిత్వీకరించారు డాక్టర్ కాంచనపల్లి గోరా. సాహిత్యప్రియులైనవారు, అందునా స్వయంగా కలం పట్టగల రాజకీయనేతలు కనపడడం అరుదు. అలాంటివారిని పదిమందిని తీసుకుంటే మొదటి నలుగురు లేదా ఐదుగురిలో మన పీవీ కూడా ఉంటారు. అలాగే విజ్ఞత, రాజనీతిజ్ఞత కలిగిన నేత మీద, ఆయన విధానాలు, చింతనలు ఆధారంగా కవిత్వం రాయడం కష్టం. కానీ ఆ ప్రయత్నం ఈ పుస్తకంలో జరిగింది. నిజాం రాజ్యంలో ఆయన పోరాటం దగ్గర నుంచి, విదేశాంగ విధానం వరకు, ఆర్థిక సంస్కరణల వరకు కవిత్వంలో చెప్పి ఒక ప్రత్యేక తరహా కవిత్వాన్ని ఇందులో మనకు కవులంతా చూపించారు. ఇది పీవీకి మంచి నివాళే. కానీ అక్షరాలతోనే ఇంకా మంచి నివాళి ఆయనకు సమర్పించవలసిన అవసరం మాత్రం ఉంది.




**కాలాతీతుడు**
**శ్రీ పీవీ నరసింహారావుగారి శతజయంతి కవితాంజలి**
**సం:** సురభి వాణీదేవి, మామిడి హరికృష్ణ, హరనాథ్ కారుప్రోలు,
**ప్రతులకు:** అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో, ఇంకా, తెలంగాణ సాహిత్య అకాడెమి, రవీంద్ర భారతి కాంప్లెక్స్, హైదరాబాద్. 140-29703142.
**పే.:** 211, **వెల:** రూ.300/-

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## శ్రీ స్తంభాద్రి లక్ష్మీనారసింహస్వామి ఆలయం - ఖమ్మం



తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం పట్టణం నడిబొడ్డున ఎత్తయిన గుట్టపై ఈ ఆలయం కొలువుదీరింది. ప్రహ్లాదుడిని రక్షించేందుకు నరసింహస్వామి స్తంభంలో నుంచి బయటకు వచ్చారని కథనం. ఆ స్తంభాన్ని కలిగి ఉన్న ప్రాంతం ఇదే కాబట్టి స్తంభాద్రి, స్తంభశిఖరి, కంభంమెట్టు అని పిలిచి.. కాలక్రమంలో అది ఖమ్మంగా ఏర్పడిందని చెబుతారు. పూర్వం మౌద్గల మహర్షి ఈ ప్రాంతంలోనే శ్రీహరి గురించి తపస్సు చేశాడు. అప్పుడు శ్రీహరి లక్ష్మీసమేత నారసింహుడిగా ప్రత్యక్షమై ముని కోరిక మేరకు ఇక్కడే భక్తుల దర్శనార్థం ఒక గుహలో కొలువు తీరాడని స్థల పురాణం. ఖమ్మం కోట నిర్మాణ సమయంలో కాకతీయ చక్రవర్తి స్వామివారికి ఆలయం నిర్మించాడని చారిత్రక ఆధారాలున్నాయి. ఇక్కడి స్వామి వారు దక్షిణాభిముఖంగా ఉండటం ప్రత్యేకత.

## కథ | అత్యాశ పనికిరాదు!

వీరన్న తన ఊళ్లో అందరికీ అన్ని విధాలుగా తోడ్పడుతుండేవాడు. అందరి మెప్పు సంపాదించి, ఊరివాళ్ల సహాయంతో పెళ్లి కూడా చేసుకొని, ఓ ఇల్లు గలవాడై, నాలుగు రాళ్లు వెనక వేసుకున్నాడు.

ఒకరోజు దొంగలు పడి వీరన్న ఇంట్లో పూచికపుల్ల కూడా మిగల్చకుండా మొత్తం దోచుకుపోయారు.

ఆ స్థితిలో ఊరివాళ్లు మళ్లీ పూనుకుని తలా కొంత చందాలుగా వేసుకొని వీరన్న ఇల్లు నిలబెట్టారు.

బతికినన్నాళ్లూ అక్రమార్జన చేసి అంతులేని డబ్బు గడించిన బంగారయ్యకు ఇది చూసి దుర్బుద్ధి పుట్టింది.

ఒక రాత్రి బంగారయ్య, అతని భార్య తమ సొత్తు యావత్తూ ఊరి వెలుపల చెరువు దగ్గర పాతిపెట్టారు.

తెల్లవారగానే ఆ ఇద్దరు దంపతులు తమ ఇంట్లో దొంగలు పడి మొత్తం దోచుకెళ్లారని ఏడ్చినట్టుగా నటించసాగారు.

ఈ విషయం గురించి ఊరంతా తెలిసింది. కానీ ఎవరూ బాధపడలేదు. బంగారయ్య ఏనాడు, ఎవరిని ఆదుకున్నాడు



## పద్యం

**ఉత్తమ గుణములు నీచున**
**కెత్తెఱగున గలుగనేర్చు నెయ్యడలం దా**
**నెత్తిచ్చి కఱిగిపోసిన**
**నిత్తడి బంగార మగునె యిలలో సుమతీ!**

**భావం :** ఓ సుమతీ! బంగారమునకు సమానమైన ఇత్తడిని తీసుకొని ఎన్నిసార్లు కరిగించి పోసినను బంగారము ఎట్లు కాదో, అదేవిధంగా లోకములో నీచునకు ఎక్కడను, ఏ విధముగాను మంచి గుణములు కలుగనేరవు.

## శ్లోకం

'శాంతి మిచ్ఛంతి సాధవః'

**మచ్చికా వ్రణ మిచ్ఛంతి**
**ధన మిచ్ఛంతి పార్థివాః**
**నీచాః కలహ మిచ్ఛంతి**
**శాంతి మిచ్ఛంతి సాధవః**

**భావం :** ఈగలు పుండ్ల (కురుపులు) మీదనే వాలతాయి. పాలకులు ధనంపైనే దృష్టి సారిస్తారు. నీచులు కలహాన్ని కోరుకుంటారు. సాధువులు శాంతిని వాంఛిస్తారు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| పక్షి | బావి |
| మనిషి | గుహ |
| చేప | ఇల్లు |
| సింహం | నీరు |
| కప్ప | గూడు |

**జవాబులు :** పక్షి–గూడు; మనిషి–ఇల్లు; చేప–నీరు; సింహం–గుహ; కప్ప–బావి.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### అలేఖ్ పాత్రా

(జూలై 1, 1923 – నవంబర్ 17, 1999)



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. 18 ఏళ్లకే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఒడిశాలో పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలు కూడా చేశారు. పౌరహక్కుల ఉద్యమాలకూ స్ఫూర్తినిచ్చారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా నిమపాడా పోలీస్ స్టేషన్‌ను తగలబెట్టారు. శాసనోల్లంఘన ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. అనేకసార్లు అరెస్టయ్యారు.

## జనరల్ నాలెడ్జ్

1. 74వ భారత గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి ఏ దేశ అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు?
2. ఇటీవల ఆస్కార్ అవార్డు నామినేషన్లలో నిలిచిన తెలుగు సినిమా పాట ఏది?
3. ప్రపంచ వాతావరణ దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?

సమాధానాలు : 1. ఈజిప్ట్ (అబ్దుల్ ఫతా); 2. నాటు నాటు... (సినిమా: ఆర్ఆర్ఆర్); 3. మార్చి 23



కనకా? అందరూ సానుభూతి చూపారు గాని ఒక్కరూ చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు.

ఇక లాభం లేదని, బంగారయ్య దంపతులు తాము పాతిపెట్టిన సొత్తు తీసుకొని తెల్లవారే లోపల ఊరు విడిచి వెళ్లిపోదామనుకున్నారు.

అయితే కొంతకాలంగా వాయిదా పడుతున్న ఊరి చివరన గల చెరువు పక్కన నిర్మించాలనుకున్న గుడి పనులు మొదలు పెట్టాలని ఆరోజు గ్రామాధికారి ఆదేశించాడు.

గుడికి పునాదులు తవ్వుతూండగా ఒక మూటలో డబ్బు దొరికింది. దేవుడు తన గుడి ఖర్చు తానే సంపాదించుకున్నారని ఊరివారంతా ఆనందం, ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

బంగారయ్యకు ఏం చేయాలో తోచలేదు! అత్యాశతో ఉన్న డబ్బును కూడా పోగొట్టుకున్నానని బాధపడ్డాడు. ★

## మెదడుకు మేత

కిటకిట తలుపులు,
కిటారి తలుపులు,
ఎప్పుడు మూసినా
చప్పుడు కావు?

జవాబు : కళ్లు

## మంచిమాట

ఆశ, భయం, కోపం...
ఈ మూడింటిని
త్యజించిన వాడే
స్వతంత్రుడు!



# వారఫలాలు

**6-12 ఫిబ్రవరి 2023**




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆదాయపరంగా ఇబ్బందులు అధిగమిస్తారు. ఉద్యోగయత్నాలు అనుకూలిస్తాయి. స్థిరాస్తి కొనుగోలులో అవాంతరాలు తొలగుతాయి. వ్యాపారులకు లాభాలు ఉద్యోగులకు పనిభారం తగ్గే సూచనలు. రాజకీయవేత్తల యత్నాలు ఫలిస్తాయి. రచయితలు, క్రీడాకారులకు ఆహ్వానాలు. 6,7 తేదీల్లో వ్యయప్రయాసలు. ఖర్చులు అధికం. సోదరులతో విభేదాలు. శివాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ముఖ్య పనుల్లో ఆటంకాలు తొలగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. ఆస్తి వివాదాల నుంచి బయటపడతారు. వాహనాలు, గృహం కొంటారు. పట్టుదలతో సమస్యలను అధిగమిస్తారు. వ్యాపారులకు లాభాలు. కళాకారులకు విజయాలు. క్రీడాకారులు, వైద్యులు సత్తా చాటతారు. 8,9 తేదీల్లో బంధువులతో వివాదాలు. ఆకస్మిక ప్రయాణాలు. మానసిక ఆందోళన. విష్ణు సహస్రనామ పారాయణ చేయండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆర్థిక లావాదేవీలు కాస్త నిరుత్సాహ పరుస్తాయి. రుణాల కోసం యత్నిస్తారు. ఆలోచనలు కలసిరావు. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. ఇంటి నిర్మాణ యత్నాలలో అవాంతరాలు. ఆరోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ఉద్యోగులకు ఇష్టం లేకున్నా మార్పులు తప్పవు. రచయితలు, క్రీడాకారులకు కొన్ని చికాకులు. 9,10 తేదీల్లో వాహన యోగం. స్థిరాస్తి వృద్ధి. శుభవార్తలు. గణేశాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కొత్త కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేస్తారు. పాతబాకీలు వసూలై అవసరాలు తీరతాయి. ఆస్తుల వ్యవహారాలలో గందరగోళం తొలగుతుంది. వాహన, గృహయోగాలు. వ్యాపారులు నష్టాలు అధిగ మిస్తారు. ఉద్యోగులకు సంతోషకర వార్తలు. వ్యవసాయదారుల స్వయంకృషి ఫలిస్తుంది. కళాకారులు, వైద్యులకు ఉత్సాహంగా గడుస్తుంది. 11, 12 తేదీలలో దూరప్రయాణాలు. ధనవ్యయం. ఆరోగ్యభంగం. కనకదుర్గాదేవి స్తోత్రం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. నిరుద్యోగుల శ్రమ ఫలిస్తుంది. ఇంటి నిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. స్థిరాస్తి వృద్ధి. ఉద్యోగులు అదనపు బాధ్యతలు తొలగుతాయి. కళాకారులు, వైద్యులకు మరింత సంతోషదాయకంగా ఉంటుంది. 7, 8 తేదీల్లో కావలసిన వారితో వివాదాలు. అనారోగ్యం. దూర ప్రయాణాలు. దేవీస్తోత్రం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

నూతనోత్సాహంతో కొన్నిపనులు చక్కదిద్దుతారు. రాబడి ఉత్సాహాన్నిస్తుంది. రుణబాధల నుండి విముక్తి. వాహనాలు, భూములు కొంటారు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారాల్లో పురోగతి. ఉద్యోగులు చిక్కులు అధిగమిస్తారు. రాజకీయవేత్తలకు గుర్తింపు లభిస్తుంది. క్రీడాకారులు,రచయితలకు విశేష గౌరవం. 10,11 తేదీల్లో మానసిక ఆందోళన. కుటుంబంలో చికాకులు. ఆదిత్య హృదయం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

దూరప్రాంతాల నుంచి శుభవార్తలు. రాబడి ఉత్సాహాన్నిస్తుంది. నిరుద్యోగులకు కాస్త అనుకూలత. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. మీ ఖ్యాతి పెరుగుతుంది. వాహనయోగం. ఉద్యోగుల చిరకాల కోరిక నెరవేరుతుంది. కళాకారుల యత్నాలు కొలిక్కి వస్తాయి. శాస్త్రవేత్తలు, వైద్యుల సేవలు విస్తృత మవుతాయి. 9, 10 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. స్వల్ప అనారోగ్యం. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ముఖ్య కార్యక్రమాల్లో విజయం. శుభకార్యాల నిర్వహణలో పాలుపంచుకుంటారు. ఆస్తుల వ్యవహారాలలో అగ్రిమెంట్లు చేసుకుంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు ఒత్తిడుల నుంచి విముక్తి పొందుతారు. రచయితలు, క్రీడాకారులకు శుభవర్తమానాలు. 6,7 తేదీల్లో బంధువులనుంచి మాటపడతారు. దూర ప్రయా ణాలు. ఖర్చులు పెరుగుతాయి. నృసింహ స్తోత్రం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కార్యక్రమాలు కొంత నెమ్మదిస్తాయి. ఆర్థిక స్థితి మెరుగ్గాఉంటుంది. ఒక ప్రకటన విద్యార్థులను సంతోషపరుస్తుంది. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు గందరగోళం నుంచి బయటపడతారు. కళాకారులు స్వీయ ఆలోచనలతో అభివృద్ధిసాధిస్తారు. రచయితలు, క్రీడాకారుల ఆశలు ఫలిస్తాయి. 8, 9 తేదీల్లో అనారోగ్యం. బంధువులతో విభేదిస్తారు. సూర్యారాధన మంచిది.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

సమస్యల నుంచి బయటపడతారు. ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తినిస్తుంది. భూములు, వాహనాలు కొంటారు. ఆలయాలు సందర్శిస్తారు. చిరకాల స్వప్నం ఫలిస్తుంది. వ్యాపారుల కృషి ఫలిస్తుంది. ఉద్యోగులకు వివాదాలుసర్దుకుంటాయి. రాజకీయవేత్తలకు ఆహ్వానాలు. 10,11 తేదీల్లో మానసిక అశాంతి. దూర ప్రయాణాలు. పార్వతీదేవికి కుంకుమార్చనచేయండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

సమయానికి డబ్బు అందుతుంది. ఇంటి నిర్మాణాలకు శ్రీకారం చుడతారు. ఆకస్మిక ధనలబ్ధి. కొన్ని సమస్యలు ఎదురైనా వ్యాపారులు లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులు విధుల్లో ప్రతిష్టంభనను అధిగమిస్తారు. పారిశ్రామికవేత్తలకు వివాదాలు పరిష్కారం. 11, 12 తేదీల్లో మనశ్శాంతి లోపం. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. అనుకోని ప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆదాయం ఆశాజనకంగా ఉండి అప్పులు తీరుస్తారు. ముఖ్య పనులు ఆశించిన విధంగా పూర్తి చేస్తారు. మీ సత్తా పది మందీ గుర్తిస్తారు. ఆశ్చర్యకర విషయాలు తెలుసుకుంటారు. కొన్ని సమస్యల నుంచి గట్టెక్కుతారు. వాహన యోగం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వివాహ యత్నాలలో పురోగతి. ఉద్యోగులకు కొత్త హోదాలు. 6,7 తేదీల్లో ఆస్తి వివాదాలు. ప్రయాణాలు. దక్షిణామూర్తి స్తోత్రం పఠించండి. ★

# పదరసం-402

## ఆధారాలు

**అడ్డం**

1. ప్రస్తుతపు తెలుగు నెల (4)
4. ఈ నది పేరిట శర్మ ఒకప్పటి కవి, కథకుడు (4)
8. తపాలా (2)
9. సగం సగం, అసంపూర్తి అనే! (4)
11. ఆలోచన (2)
13. ఇది దట్టంగా పట్టిన ఆకాశం వర్ష సంకేతం (2)
14. కెరటము (3)
17. అటుగా ఆవుపేడ (3)
18. డెంగ్యూవ్యాధి కారక కీటకం (2)
19. ఇది ఒక నది. పంపితిని (2)
22. ఏనుగు (2)
23. సిగ్గు (2)
24. చెదిరిన వార్షికము (4)
26. సర్పపరంగా జనమేజయుడు చేసింది (2)
29. దీని స్వరూప స్వభావాలపైనే పోరంకి దక్షిణామూర్తి పరిశోధన (4)
30. సోమవారానికి ఎల్లుండి (4)

**నిలువు :**

2. ఒక సంగీత వాద్యం కుండ (2)
3. సంతోషం, వేడుక (4)
5. పనికత్తె (2)
6. వట్టిచెయ్యి (4)
7. తెలుగుల అమరగాయకుడు (4)
10. అరుణాచలదైవాంశముని (6)
12. సువాసన (4)
15. గుర్రం (2)
16. ఆగ్రహం (2)
20. జంఘాల శాస్త్రి పాత్ర. సృష్టికర్త, సాక్షి వ్యాసాల రచయిత (2)
21. చంద్రుడే! మాసంవైపు (4)
25 అలంకరణ. (3)
27. మందుడు. ఏలినాటి గ్రహం!?(2)
28. అగ్ని పర్వతం చిమ్మేది

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక,
3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | 2 | | 3 | ✠ | 4 | 5 | | 6 |
| 7 | ✠ | | ✠ | | ✠ | ✠ | | ✠ | |
| 8 | | ✠ | 9 | | | 10 | ✠ | 11 | |
| | ✠ | 12 | ✠ | | ✠ | 13 | | ✠ | |
| 14 | 15 | | ✠ | ✠ | ✠ | | ✠ | 16 | ✠ |
| ✠ | 17 | | | ✠ | 18 | | ✠ | 19 | 20 |
| 21 | ✠ | | ✠ | ✠ | ✠ | 22 | | ✠ | |
| 23 | | ✠ | 24 | | 25 | | ✠ | 26 | |
| | ✠ | 27 | ✠ | ✠ | | ✠ | 28 | ✠ | |
| 29 | | | | ✠ | 30 | | | | ✠ |

**పదరసం – 402**

పేరు : ..............................................................................................

చిరునామా:..............................................................................................

..............................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 ఫిబ్రవరి 20 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 398 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 గా | లి | 2 ప | టం | ✠ | 3 కో | 4 డి | పం | 5 దెం |
| 6 మే | ను | ✠ | ల | ✠ | 7 కా | ✠ | మ | ✠ | చ |
| ✠ | 8 గ | రి | క | ✠ | ర | ✠ | 9 ము | 10 గ | న |
| 11 దె | పిం | ✠ | 12 శో | ర | ణ | ము | ✠ | 13 జా | ము |
| ✠ | 14 డి | 15 డి | టి | ✠ | ము | ✠ | 16 రో | లు | ✠ |
| 17 స్త్రీ | ✠ | త్మ్క | ✠ | 18 భా | ✠ | 19 భో | గి | ✠ | 20 క |
| 21 మే | క | లు | ✠ | 22 వం | 23 పు | ✠ | ✠ | 24 చే | ను |
| పీ | ✠ | 25 కొ | ట్టు | ✠ | 26 లో | చ | నం | ✠ | ము |
| 27 తా | 28 క | ట్టు | ✠ | 29 జి | మా | ✠ | ✠ | 30 దా | ✠ |
| ✠ | 31 వి | ట | పి | ✠ | 32 వి | వే | క | నం | ద |

**విజేతలు:** కె.వి.ఎస్.ఎన్. మూర్తి, నల్లగండ్ల, హైదరాబాద్, టి. తులశమ్మ, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, మత్స్యరాజ విజయలక్ష్మి, అలాకపురి,హైదరాబాద్, వి.ఆర్.రావు, సైదాబాద్, హైదరాబాద్, గుమ్మల సుధారాణి, బాల్కొండ, నిజామాబాద్, నాగుల దీపక్‌గౌడ్, బాల్కొండ, నిజామాబాద్, కౌటికె శ్రీనివాస్, ఆర్మూర్, నిజామాబాద్, బోగ పండరి, కామారెడ్డి, వి.రామలింగాచారి, ప్రశాంత్‌నగర్, యాదిగిరి గుట్ట, వారణాసి సరస్వతి, గాంధీనగర్, కాకినాడ, కె.అల్లీరాణి, తిరుపతి, ఎస్.వి.ఎస్.శర్మ, రామచంద్రపురం, కోనసీమ జిల్లా, ఉమామహేశ్వరశర్మ, అనంతపురం, వి.భాస్కరయ్య– చెన్నై, కె.ఎన్.స్వామి–భువనేశ్వర్.

**బహుమతి పొందిన విజేత : జి. యశోదాప్రీతి, ఒంగోలు.**



# ఎడారిలో ఒయాసిస్

# మాలికాపురం

గత యేడాది డిసెంబర్ 30వ తేదీ కేరళలో ఉన్ని ముకుందన్ నటించిన 'మాలికాపురం' సినిమా విడుదలైంది. మూడున్నర కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఆ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా యాభై కోట్లకు పైగా వసూళ్లు చేసింది. అయ్యప్ప స్వామి ఆరాధకులను విశేషంగా ఆకట్టుకుని, థియేటర్లలో 'స్వామియే శరణమయ్యప్పా' అనే నినాదాలతో హోరెత్తేలా చేసిన 'మాలికా పురం' ఇటీవల తమిళ, తెలుగు భాషల్లోకి కూడా అనువాదమయ్యింది. రొటీన్ ఫార్ములా చిత్రాల చట్రంలో ఇరుక్కున్న భారతీయ సినిమా రంగంలో భక్తిభావాన్ని ప్రేక్షకులలో ప్రేరేపించిన 'మాలికాపురం' ఎడారిలో ఒయాసిస్సును తలపిస్తోంది.

కేరళలోని ఓ గ్రామంలో షన్ను కుటుంబం ఉంటుంది. ఆ చిన్నారికి నానమ్మ ప్రతిరోజు అయ్యప్ప స్వామి గాథలను కథలు కథలుగా చెబుతూ ఉంటుంది. దాంతో షన్నుకు అయ్యప్పను దర్శించు కోవాలనే కోరిక కలుగుతుంది. ఎనిమిదేళ్ల ఆ బాలిక అయ్యప్ప దర్శనానికి అర్హురాలే కాబట్టి, తండ్రి తనతో పాటు తీసుకెళతానని మాట ఇస్తాడు. అప్పటికే ఊరి నిండా అప్పులతో మునిగిపోయిన షన్ను తండ్రికి అయ్యప్ప మాల వేసుకుంటే కొద్దిరోజులపాటు అప్పుల వాళ్ల బాధ దూరమవుతుందనే భావన కలుగుతుంది. కానీ వడ్డీ వ్యాపారికి అలాంటి సెంటిమెంట్స్ ఉండవు కదా! ఊరి నడిబొడ్డున షన్ను తండ్రిని అప్పు ఎప్పుడు కడతావని నిలదీస్తాడు. ఈ గొడవ కూతురు కళ్ల ముందే జరగడంతో అవమాన భారంతో అతను ఆత్మహత్య చేసుకుంటాడు. దాంతో షన్ను తండ్రి లేని పిల్లకావడమే కాదు, అయ్యప్ప దర్శనం కూడా చేసుకోలేకపోతుంది. రోజు రోజుకూ అయ్యప్పను చూడాలనే కోరిక పెరిగిపోవడంతో ఓ రోజు తన తోటి పిల్లాడిని తీసుకుని పంబ వెళ్లే బస్సు ఎక్కేస్తుంది. ఈ ఇద్దరు చిన్నారులను కిడ్నాప్ చేసి, సొమ్ము చేసుకోవడానికి మరొకడు అదే బస్సు ఎక్కి వారిని అనుసరిస్తాడు. అయ్యప్పను దర్శించుకోవ డానికి ఇంట్లో చెప్పకుండా బయలు దేరిన ఈ చిన్నారుల లక్ష్యం నెరవేరిందా? వారిని కిడ్నాపర్ల బారి నుండి ఎవరు కాపాడారు? వీరికి సాయంగా నిలిచే అయ్యప్ప అనే పేరున్న ఆ వ్యక్తి అసలు ఎవరు? వీళ్లకు ఎందుకు అండగా ఉన్నాడు? అనేది మిగతా కథ.

గతంలో కోడి రామకృష్ణ 'దేవుళ్లు' అనే సినిమా తీశారు. తల్లిదండ్రులు గొడవ పడి విడిపోవాలని అనుకుంటున్న సమయంలో వారి పిల్లలిద్దరూ వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించి, ఆ దేవుళ్ల ఆశీస్సులతో తల్లిదండ్రులను కలుపుతారు. అందులోనూ ఇలా ఇంట్లో చెప్పకుండా అయ్యప్ప కొండకు వెళ్లే సన్నివేశాలూ ఉన్నాయి. తెలుగువారికి 'మాలికాపురం' సినిమా చూస్తుంటే 'దేవుళ్లు' చిత్రం గుర్తుకు రాకమానదు. అయితే ఆ సినిమాలో స్వయంగా దేవుళ్లే మానవరూపంలో ప్రత్యక్షమై ఆ చిన్నారులకు సాయం చేస్తారు. కానీ ఈ సినిమాలో తమకు సాయం చేసిన వ్యక్తి అయ్యప్పే అని ఈ చిన్నారులు విశ్వసిస్తారు. తన ఉద్యోగధర్మంగా వారిని రక్షించానని అయ్యప్ప చెప్పినా, చిన్నారి షన్ను కలలోకి అతను ఎలా వచ్చాడు? అతని బొమ్మను ఆమె స్కూల్ బుక్స్‌లో ఎలా గీసింది అనేది ఓ మిస్టరీ! 'దైవం మానుషరూపేణా' అని మనం చెప్పుకుంటాం. కష్టాలలో ఉన్నవారిని దేవుడే మానవరూపంలో వచ్చి రక్షిస్తాడని నమ్ముతాం. కాబట్టి తమను కాపాడింది అయ్యప్ప స్వామేనని ఆ పిల్లలు భావించడంలో ఎలాంటి తప్పు లేదనిపిస్తుంది! ఈ పాయింట్ ఈ తరం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అందుకే కేరళలో ఈ సినిమాకు నీరాజనాలు పలికారు. మల్లూవుడ్‌లో ముస్లిం, క్రైస్తవ, కమ్యూనిజ ప్రచార చిత్రాలదే డామినేషన్. ఎప్పుడో కానీ హిందుత్వ భావాలను బలపరిచే ఇలాంటి సినిమాలు రావు. పైగా శబరిమల దర్శనాన్ని వివాదాస్పదం చేసి, హిందూ ధర్మం మీద కమ్యూనిస్టులు, సోకాల్డ్ మేధావులు విషం చిమ్ముతున్న ప్రస్తుత కాలంలో 'మాలికాపురం' వంటి సినిమా రావడం, దానికి ప్రేక్షకాదరణ లభించడం విశేషం. ఆ మధ్య విడుద లైన 'అఖండ', ఆ తర్వాత వచ్చిన 'కార్తికేయ-2, కాంతార' వంటి భక్తి ప్రబోధాత్మక చిత్రాల జాబితాలోకే ఇది కూడా చేరుతుంది.

'జనతా గ్యారేజ్, భాగమతి'తో పాటు గత యేడాది వచ్చిన 'ఖిలాడీ, యశోద' చిత్రాలతో ఉన్ని ముకుందన్ తెలుగువారికి చేరువయ్యాడు. అతని ఎంట్రీ ఈ సినిమాలో ఆలస్యంగా జరిగినా అక్కడ నుండి తన భుజానకెత్తుకునే నడిపించాడు. షన్నుగా దేవనంద అద్భుత నటన కనబరిచింది. ఆ చిన్నారికి ఈ సినిమాతో అవార్డు రావడం ఖాయం. అలానే ఇతర ప్రధాన పాత్రలను మాస్టర్ శ్రీపద్, మనోజ్ కె జయన్, టి.జి. రవి, సైజు కురుప్, రెంజీ ఫణిక్కర్, విష్ణు నారాయణ్, రమేశ్ పిషారోడి తదితరులు చేశారు. రంజిన్ రాజ్ తన నేపథ్య సంగీతంతో సినిమాకు ప్రాణం పోశాడు. నిజానికి దర్శకుడు విష్ణు శశిశంకర్ ఈ చిత్రాన్ని మరింత గొప్పగా తీసి ఉండొచ్చు, కానీ పరిమితమైన బడ్జెట్ అతనికి ప్రతిబంధం అయి ఉంటుంది. చిత్రానువాదం చక్కగా ఉంది. ప్రథమార్థం కాస్తంత నిదానంగా సాగినా, ద్వితీయార్థంలో సినిమా ఊపందుకుంటుంది. కన్నడ 'కాంతార'ను తెలుగువారి ముందుకు తీసుకొచ్చిన గీతా ఫిలిమ్ డిస్ట్రిబ్యూషన్ 'మాలికాపురం'ను తెలుగులో విడుదల చేసింది. అయితే.. ఈ సినిమాను జనంలోకి తీసుకెళ్లటానికి ఇంకాస్తంత గట్టిగా కృషి చేయాల్సింది. హైదరాబాద్ వంటి మహానగరం లోనూ ఒకే ఒక్క సింగిల్ థియేటర్‌లో దీని స్క్రీనింగ్ జరుగుతోంది. మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో సింగిల్ షోస్ వేస్తున్నారు. బహుశా ఈ రివ్యూ పాఠకులు చదివే సమయానికి మీ ఊళ్లలో 'మాలికాపురం' ఉండక పోవచ్చు. కానీ ఇలాంటి సినిమా ఒకటి వచ్చిందనే విషయం తెలుసుకోవడం మంచిది కదా! రేపు ఓటీటీలో ప్రసారం అయిన ప్పుడైనా చూసి ఆదరించండి, ఆనందించండి!!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# లవ్ జిహాద్‌కీ, ల్యాండ్ జిహాద్‌కీ నిరసనగా...

'ఒకవేళ ఒక హిందూ యువతి, ముస్లిం యువకునికి మధ్య ప్రేమ చిగురించి పెళ్లి చేసుకుంటే దాన్ని ఏమనాలి?' ఇది ఒక విలేకరి ప్రశ్న.

'అది ఎలాంటి ప్రేమ? ముందు అది చెప్పండి! ఏదో చిన్న గొడవకే స్నేహితురాలి శరీరాన్ని 35 ముక్కలుగా నరికేయడమా? ఆమె తల ఫ్రిజ్‌లో పెట్టడమా ప్రేమంటే?' ఆ విలేకరి ప్రశ్నకి ముగ్గురు నుంచి ఏకకాలంలో వచ్చిన సమాధానమిది. ఇది శ్రద్ధా వాకర్ అనే హిందూ యువతికి పట్టిన దుర్గతి అన్న సంగతి గుర్తుండే ఉంటుంది.

జనవరి 29వ తేదీన ముంబైలో లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌లకు వ్యతిరేకంగా జరిగిన భారీ ప్రదర్శనలో వినిపించిన సంభాషణ ఇది. పలు హిందూ సంస్థలు, ఇతర సంస్థలు, వీరి మద్దతుదారులు ఉదయమే శివాజీ పార్క్ వద్దకు చేరుకుని జిహాద్‌లకు వ్యతిరేకంగా తమ గళం వినిపించారు. సకల్ హిందూ సమాజ్ సంస్థ పేరుతో, కాషాయ పతాకాలు చేతబూనిన వేలాది మందితో హిందూ జన ఆక్రోశ్ పేరుతో ఇది జరిగింది. మీనా తాయ్ ఠాక్రే విగ్రహం నుంచి శివాజీ పార్క్ (దాదర్) వరకు ఈ ఊరేగింపు జరిగింది. లవ్ జిహాద్ గ్రామాలకే పరిమితమని అనుకోవద్దు. అసలు మహారాష్ట్రలోనే ఇది లేదని చెప్పడం సరికాదు అన్న నినాదాలు వారు ఇచ్చారు. కాబట్టి లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఒక చట్టం తీసుకురావాలని ఈ ఊరేగింపు గట్టిగా కోరింది. చాలామంది ఈ ఊరేగింపు కోసం బస్సులలో వచ్చారు. ఇక ఉదయం వ్యాహ్యాళికి వచ్చిన వారు కూడా ఇందులో భాగమయ్యారు. దీనిని ఎంతో క్రమశిక్షణతో నిర్వహించాం. పేవ్‌మెంట్ మీద వెళ్లే వారు సహా ఏ వాహనానికి మేం అడ్డంకి కాలేదు అని ఒక మహిళా నాయకురాలు చెప్పారు. లవ్ జిహాద్ తుపాను మన ఇంటిని తాకకూడదని కొందరు నినదించారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు లవ్ జిహాద్‌ను అరికట్టేందుకు చట్టాలు చేసిన సంగతిని కూడా పలువురు గుర్తు చేశారు. అక్రమంగా మసీదులు నిర్మిస్తూ పలుచోట్ల భూఆక్రమణలకు పాల్పడుతున్నారని, దానినే ఇప్పుడు భూజిహాద్‌గా పిలుస్తున్నారని కొందరు చెప్పారు. ఇది ముస్లింలకు వ్యతిరేకం కాదని, ముస్లిం మతోన్మాదానికి వ్యతిరేకమని ఇంకొందరు చెప్పారు. ఏపీజే అబ్దుల్ కలాం, భారత సైనికాధికారి అబ్దుల్ హమీద్ వంటివారిని తాము ఎప్పటికీ గౌరవిస్తామని ప్రదర్శకులు చెప్పారు.

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 16

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు


వెల : ₹.200/-


వెల : ₹.200/-


వెల : ₹.390/-


వెల : ₹.300/-


వెల : ₹.200/-


వెల : ₹.200/-


వెల : ₹.200/-


వెల : ₹.200/-


వెల : ₹.250/-


వెల : ₹.250/-



వెల : ₹.599/-



వెల : ₹.695/-



వెల :₹.799/-



వెల : ₹.799/-



వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244